04-04Pg1exHMNWJQE.qxd:04-04Pg1exHMNWJQE.qxd 01/01/01 10:00 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-4-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 62 పేజీలు: 12 వెల: 6.50

బెంగాల్‌లో 25వేల టీచర్ల నియామకాలు రద్దు
కర్ణాటకలో ఓలా, ఉబర్, ర్యాపిడోలపై నిషేధం
9లో

# ఇక జలహారతి కార్పొరేషన్



గురువారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశం

## పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు రూపకల్పన
## స్వతంత్ర సంస్థగా డ్రోన్ కార్పొరేషన్
## సాగర్ లెఫ్ట్ బ్రాంచి కెనాల్‌కు రిటైనింగ్ వాల్
## మంత్రిమండలి కీలక నిర్ణయాలు

**విజయవాడ, ఏప్రిల్3, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాభివృద్ధిలో నూతన సాంకేతికతను పూర్తి స్థాయిలో వినియోగించుకుందామనే ఆలోచన తమ ప్రభుత్వానిదని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు.సిఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరిగింది.. ఈ సమావేశంలో పలు కీలకఅంశాలకు ఆమోదం తెలిపారు. ఆయా అంశాలను ఆమోదించడానికి ముందు ఏఉద్దేశంతో ఈ నిర్ణయాలు తీసుకుంటుందని సిఎం చంద్రబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్‌ను (ఎపిడిసి), ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) నుంచి విడదీసి స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేసేందుకు కేబినెట్ ఆమోదంతెలిపింది. డ్రోన్ సంబంధిత అంశాలన్నింటికీ నోడల్ ఏజెన్సీగా ఎపిడిసి వ్యవహరించనుంది. అనకాపల్లి జిల్లాలోని డీఎల్‌పురం వద్ద క్యాపిటివ్ పోర్టు ఏర్పాటుకు ఆమోదం, త్రీ స్టార్, ఆ పైబడిన హోటళ్లకు బార్ లైసెన్స్ ఫీజుల కుదింపునకు ఆమోదం, బార్‌లైసెన్స్‌ల ఫీజును రూ.25 లక్షలకు కుదిస్తూ ఆమోదం, >>2

# 8 నగరాల్లో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది నగరాల్లో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఒకేచోట 200 మంది వ్యాపారాలు చేసుకునేలా సదుపాయాలు కల్పిస్తోంది. ఈ విధానంతో వీధి వ్యాపారుల జీవనోపాధి మెరుగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో మార్కెట్ ఏర్పాటుకు సర్కార్ రూ.7 కోట్ల చొప్పున ఖర్చు చేయనుంది. ఇందులో మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థలు రూ.3 కోట్లు, వ్యాపారులకు శిక్షణ, ఇతర సేవలు అందించేందుకు సెర్ప్ రూ.1.25 కోట్లు ఖర్చు చేయనున్నాయి. బ్యాంకుల నుంచి వ్యాపారులకు పెట్టుబడి నిధి కింద రూ.3 కోట్ల మేర రుణాలు అందిచనున్నారు. మార్కెట్ల నిర్వహణను నగరపాలక సంస్థలకు అప్పగిస్తారు. షాపుల నుంచి అద్దెలు, ప్రకటనల ఆదాయంతో ఆయా మార్కెట్లను నిర్వహిస్తారు.
స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను నెల్లూరులో ప్రయోగాత్మకంగా జూన్‌లో ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇక్కడ ప్రత్యేకంగా కంటైనర్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 200 షాపులు నిర్వహించొచ్చు. ప్లగ్అండ్‌ప్లే విధానంలో వాటిని వ్యాపారులకు కేటాయించిన వెంటనే షాపులు ప్రారంభించుకోవచ్చు. కంటైనర్‌పైన సోలార్ పలకలు అమర్చి, వాటి ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను షాపు అవసరాలకు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మార్కెట్‌లో నిత్యావసరాల నుంచి పండ్లు, కూరగాయల వరకు అన్నీ అందుబాటులో ఉంటాయి. రెండో దశలో విశాఖపట్నం, మంగళగిరి, పిఠాపురం, శ్రీకాకుళం, విజయవాడ, ఒంగోలులోనూ వీటిని ఏర్పాటు చేయాలని సర్కార్ నిర్ణయం తీసుకుంది. రాయలసీమలో కర్నూలు, కడప, అనంతపురంలో ఏదో ఒక నగరాన్ని త్వరలో ఎంపిక చేయనున్నారు. ఇవి అక్టోబర్‌లో >>2

## మాజీ మంత్రి కాకాణికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**విజయవాడ ఏప్రిల్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. కాకాణిపై తొందరపాటు చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంది హైకోర్టు. కాకాణి ముందస్తు బెయిల్ క్వాష్ పిటిషన్లు విచారించిన ఎపి హైకోర్టు తెల్లారాయి అక్రమ రవాణాకి సహకరించటంతో పాటు ఎస్సీ,ఎస్టీ కేసును కాకాణిపై నమోదు చేశారు. పొదలకూరు పోలీసులు >>2

## సిఐడి కార్యాలయానికి పోసాని కృష్ణ మురళి

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను దూషించిన కేసులో షరతులతో కూడిన బెయిల్‌పై ఉన్న నటుడు పోసాని కృష్ణమురళీ సిఐడి కార్యాలయానికి హాజరయ్యారు.ప్రతి సోమ,గురువారం పోసాని సిఐడి ప్రాంతీయ కార్యాలయానికి ఆయన హాజరయ్యారు. వివిధ స్టేషన్లలో నమోదైన కేసుల నేపథ్యంలో ఆయన హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.బెయిల్ షరతులను అనుసరించి ఆయన సిఐడి కార్యాలయానికి నెల రోజుల్లో ప్రతి సోమ,గురువారాల్లో సిఐడి ప్రాంతీయ కార్యాలయానికి హాజరు కావాల్సి ఉంది.

## మిథున్‌రెడ్డి ముందస్తు బెయిలు పిటిషన్ డిస్మిస్

**విజయవాడ, ఏప్రిల్ 3, ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో వైకాంగ్రెస్ పార్టీ ఎంపీ మిథున్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మిథున్ రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ధర్మాసనం డిస్మిస్ చేసింది. వైకాంగ్రెస్‌పార్టీ హయాంలో భారీ మద్యం కుంభకోణం జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై గతేడాడి సెప్టెంబరు 23న సిఐడి పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో కేసులో తన పేరు చేర్చి ఎక్కడ అరెస్టు చేస్తారేమో అనే భయంతో హైకోర్టును ఎంపి మిథున్ రెడ్డి ఆశ్రయించారు.
తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మిథున్‌రెడ్డి పిటి >>2



గురువారం మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

# చట్టాలు ఉల్లంఘిస్తేనే 'రెడ్ బుక్'

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా దర్యాప్తు
## దుష్ప్రచారం చేసేవారిపై తగిన చర్యలు: మంత్రి లోకేష్


**మంగళగిరి, ఏప్రిల్ 3,ప్రభాతవార్త :** రెడ్ బుక్ పేరు చెప్పగానే వైఎస్సార్సీ నాయకులు బెంబేలెత్తుతున్నారు, ఇప్పటికే ఒకరికి గుండెపోటు వచ్చింది, మరొకరు బాత్రూమ్‌లో పడి చేయి విరిగింది. చట్టాలు ఉల్లంఘించిన వారికే రెడ్ బుక్ వర్తిస్తుందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టంచేశారు. మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో నిరుపేద కుటుంబానికి శాశ్వత పట్టా అందించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుచేసింది. మేము అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నామన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కంటే ఎక్కువగా జగన్‌కు జడ్ ప్లస్ సెక్యూరిటీ ఇచ్చాం. ఆయన స్వేచ్ఛగా ప్రజల్లోకి వెళ్లే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. కనిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో 35వేలమంది ప్రజలు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు పొట్టచేతబట్టుకొని వలసలు వెళ్లారన్నారు.
యువగళం పాదయాత్ర సమయంలో అక్కడ వలసలను నివారిస్తానని హామీ ఇచ్చా. ఆ మాటమేరకు కనిగిరిలో తొలి రిలయన్స్ సిబిజి ప్లాంటు ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి 50వేల ఎకరాల భూములు ఇచ్చేందుకు తమ రైతులు సిద్ధంగా ఉన్నారని చెప్పారన్నారు . రిలయన్స్ డైరక్టర్ స్పందించి 50ప్లాంట్లు అక్కడే ఏర్పాటుచేస్తామని అన్నారు. కరువు ప్రాంతంలో పెద్దఎత్తున యువతకు ఉపాధి కల్పించేందుకు ఇటువంటి ప్రాజెక్టులు తెస్తుంటే వైఎస్సార్సీ వారికి కడుపుమంట దేనికి? బొబ్బలు వస్తాయంటూ దానిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దుష్ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టేందుకే అటువంటి వారిని రెడ్ బుక్‌లోకి ఎక్కిస్తానని చెప్పా అని అన్నారు. జగన్‌కు సొంతవాళ్లను కలిసేందుకే తీరికలేదు. సొంత చెల్లి, తల్లికి న్యాయం చేయలేని వారు మాకు చెబుతారా? ప్రిజనరీ ఆలోచనలన్నీ జైలువైపే ఉంటాయి. తప్పుచేశారు కనుక ఆయన ధైర్యంగా ప్రజల్లో తిరగలేకపోతున్నాడనీ ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఎవరినీ కలవలేదు, ప్రతిపక్షంలోకి వెళ్లిన తరువాత కూడా కనీసం కార్యకర్తలను కలిసే సమయం జగన్‌కు లేదు. ప్రజలను కలిసే ఓపిక ఆయనకు ఎక్కుడుందనీ విమర్శించారు.
పేదలకు అండగా నిలిచే ప్రజాప్రభుత్వం మాది. మాతో అభివృద్ధి, సంక్షేమంలో పోటీపడలేక కులం, మతం, ప్రాంతంపేరుతో విద్వేషాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారనీ విమర్శించారు.పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ విషయంలో మా ప్రభుత్వం పారదర్శకంగా దర్యాప్తు చేస్తోంది. తప్పుచేసిన వారు ఎవరైనా వదిలే ప్రసక్తిలేదనీ స్పష్టం చేశారు.విజనరీ -ప్రిజనరీకి ఎంతో తేడాఉంది! ప్రపంచంలో వస్తున్న సాంకేతిక మార్పులకు >>2

## గూడూరు కాలేజీలో ఎంటెక్ విద్యార్థి అనుమానాస్పద మృతి

**గూడూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** గూడూరు సమీపంలోని కాలేజ్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. గురువారం ఎంటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నెల్లూరు జిల్లా మనుబోలుకి చెందిన జస్వంత్ అనే యువకుడు కాలేజీలో అనుమానాస్పదంగా మృతిచెందడంసంచలనంగామారింది. మృతుడు బిల్డింగ్ పైనుండి దూకేసాడని కాలేజీ యాజమాన్యం చెబుతుండగా తమ బిడ్డను అన్యాయంగా చంపేశారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులు గ్రూపులు గ్యాంగ్‌వార్లకు నిలయంగా మారుస్తూ, మత్తు పదార్థాలు కూడా పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కాలేజీ ముందరే కొన్ని గ్రూపులు కత్తులు చేతబట్టి గొడవలకు దిగడంతో అనేక మంది విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు.

# వెంకన్నకు కోటి ఇస్తే భారీ ప్రయోజనాలు!

## యేడాదిలో 3 రోజులు సుప్రభాత సేవ, విఐపి బ్రేక్ దర్శనాలు



**తిరుమల,ఏప్రిల్ 3ప్రభాతవార్తప్రతినిధి:** కోట్లాది మంది హిందూ భక్తులు విశ్వాసంతో నమ్మికొలిచే ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ఎన్నిసార్లు దర్శనం చేసుకున్నా మళ్లీమళ్లీ ఆ దివ్యమంగళ రూపాన్ని చూడాలనే తాపత్రయం కలుగుతుంది. సామాన్యభక్తులు ఆ దేవుని క్షణకాల దర్శనం కోసం పరితపిస్తుంటే ధనవంతులైన, కోటీశ్వరులైన భక్తులకు, దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం తాజాగా బహుళప్రయోజనాలు చేకూర్చే దిశగా కార్యాచరణ రూపొందించింది. గతంలో గత పాలకమండళ్లు పద్మావతి చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి కోటి రూపాయలు,1.50కోట్ల రూపాయలు దాతలు విరాళమిస్తే వారికి ఏడాదిలో ఆరుమందికి ఉదయాస్తమాన సేవదర్శనం టిక్కెట్ (తెల్లవారూజామున సుప్రభాతం నుండి సాయంత్రం సహస్రదీపాలంకారసేవ వరకు) ఆలయంలోపల కులశేఖరపడివద్ద నుండి వేంకటేశ్వరస్వామి కొలువైన ముందుకు వెళ్లి తనివితీరా దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పించింది. అంతేగాక ఆభక్తులకు సుప్రభాతం, తోమాల, అర్చన సేవలు కొందరు గృహస్థభక్తులు, విఐపి బ్రేక్‌కు మరికొందరు గృహస్థభక్తులను దాత తీసుకెళ్లే ప్రయోజనం ఉండేది. ఇప్పుడు తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి వినూత్నంగా కొత్త ఆలోచన చేశారు. ఇప్పుడు కోటి రూపాయలు విరాళమిస్తే ఆ దాతలైన భక్తులు ఐదుగురికి ఏడాదిలో మరిన్ని ప్రయోజనాలు, దేవుని దర్శనం, >>2

# ఐఎఎస్‌ల పల్లెనిద్ర

## పాస్టర్ ప్రవీణ్ విషయంలో వైఎస్సార్సీ దుష్ప్రచారాన్ని తిప్పకొట్టండి
## కేబినెట్ సమావేశం తర్వాత మంత్రులతో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణగ్రామం పేరుతో ఐఎఎస్‌లు పల్లె నిద్ర చేయాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఉన్నతాధికారులు మూడు రోజులు, రెండు రాత్రులు పల్లెనిద్ర చేయాలని నిర్ణయించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులతో సిఎం పలు అంశాలపై మాట్లాడారు. ప్రజలకు ఎంతో చేసి సరైన ప్రచారం చేసుకోలేక పోతున్నామని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కర్మయోగి ట్రైనింగ్ ప్రోగ్రామ్‌పై చర్చించారు. శాఖలకు స్వయం ప్రతిపత్తి కల్పించే దిశగా ఆప్కాస్‌ను ఎలా వినియోగించాలనే అంశంపై మంత్రులతో మాట్లాడారు. ఆప్కాస్‌పై ఓ మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసే యోచనపై ఉన్నామని సిఎం తెలిపారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు చెప్పుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో పొరుగు రాష్ట్రాల్లో నాలుగోవంతు కూడా అమలు చేయడం లేదని సిఎం వ్యాఖ్యానించారు.
రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆదేశించారు. ప్రతి శాఖ కేంద్ర పథకాలను అధ్యయనం చేసి రాష్ట్రానికి నిధులు వచ్చేలా ప్రయత్నం చేయాలని మంత్రులకు సీఎం సూచించారు. రుషి కొండ ప్యాలస్‌పైనా మంత్రులతో సిఎం చర్చించారు. రుషికొండపై జగన్ నిర్మించిన భవనాలను ఏం చేయాలన్న దానిపైనా మరోమారు చర్చించారు. మొదట మంత్రులంతా రుషికొండ ప్యాలస్‌ను సందర్శించాలని సిఎం చంద్రబాబు సూచించారు. ఆ తర్వాత ఏం చేద్దామన్న అంశంపై మంత్రులు అభిప్రాయాలు చెప్పాలని సిఎం చంద్రబాబు తెలిపారు. పాస్టర్ ప్రవీణ్ మరణం విషయంలో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని వైకాంగ్రెస్‌పార్టీ చూస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులతో సిఎం మాట్లాడుతూ.. సిసి కెమెరాల్లో ఒక్కో అంశం బయటకు వస్తోందన్నారు. ప్రవీణ్ డెత్ మిస్టరీ ఛేదనలో సిసి కెమెరాలది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. మనం అప్రమత్తంగా లేకుంటే.. బాబాయ్ గొడ్డలి, కోడికత్తి, గులకరాయి తరహాలో అన్నీ మనపైనే వేస్తారని విమర్శించారు. చేసిన మంచి చెప్పుకోవడానికి ఇబ్బందులు పడుతుంటే లేని నిందలు మనపై వేసే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.
సోషల్ మీడియాలో మంచి ఉద్దేశంతో పోస్టులు పెడుతుంటే వాటిని వక్రీకరించి చెడు సందేశాలను వ్యాప్తి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నింటిపై అప్రమత్తంగా ఉంటూ కుట్రలను తిప్పికొడదామని మంత్రులకు సీఎం సూచించారు. గత వైఎస్సార్సీ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను ఆప్కాస్ ద్వారా దుర్విని >>2

## పలు చోట్ల వర్షాలతో తగ్గిన ఉష్ణోగ్రతలు

**విజయవాడ, ఏప్రిల్3, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గురువారం ఎండవేడిమి నుంచి కొంత ఉపశమనం దక్కింది. పలు చోట్ల చల్లగాలులు వీచాయి. జల్లు వానలు పడ్డాయి. దీంతో ప్రజల గత కొద్దిరోజులుగా ఎండవేడిమి, వడగాలులు, తీవ్ర ఉక్కపోత పరిస్థితుల నుంచి బయటపడ్డారు. గత కొంత కాలం నుంచి రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి, వడగాల్పులు వణికిస్తున్నాయి. బయటికొస్తే ఎండ, లోపలుంటే ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ దశలో వాన కురవటం జనానికి ఊరటనిచ్చింది. పలుచోట్ల వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలను అప్రమత్తం చేసింది.పలు జిల్లాల్లో ఉధృతంగా పిడుగులు పడే అవకాశం ఉన్నట్టు తెలిపింది. దీంతో నంద్యాల, కర్నూలు, అన్నమయ్య, తిరు >>2

## రామానాయుడు స్టూడియో 34.4 ఎకరాలలో 15.7 ఎకరాలు రద్దు

### భూమి వినియోగ నిబంధనల ఉల్లంఘనకు వ్యతిరేకంగా కఠిన చర్యలు

# భూములు వెనక్కి

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖలో సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన 34.44 ఎకరాల భూమిలో 15.17 ఎకరాల భూభాగాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం రూరల్ మండలం మధురవాడ గ్రామం,సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూమి వినియోగంపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం 34.44 ఎకరాల భూమిని ఫిల్మ్ స్టూడియో, అనుబంధ పరిశ్రమల అభివృద్ధి కోసం కేటాయించగా, సంస్థ తాజాగా 15.17 ఎకరాల భూమిని నివాస యాజమాన్యంగా మార్చేందుకు అనుమతి కోరింది.ఈ భూమి 13 సెప్టెంబర్ 2003న విడుదలైన జి.ఒ.ఎంఎస్. 963 ద్వారా కేటాయించబడింది. భూమిని కేవలం ఫిల్మ్ స్టూడియో అభివృద్ధి, అనుబంధ పరిశ్రమల స్థాపన కోసం ఉపయోగించాలనే నిబంధనలు విధించబడ్డాయి. అనంతరం, 5 జనవరి 2010న డాక్యుమెంట్ నం.16/2010 ప్రకారం రిజిస్ట్రేషన్ డీడ్ కూడా జారీ చేయబడింది. అయినప్పటికీ, సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ 15.17 ఎకరాల భూమిని నివాస యాజమాన్యంగా మార్చేందుకు 2 మార్చి 2023న జివిఎంసీకి దరఖాస్తు సమర్పించింది.
ఈ వ్యవహారంపె సుప్రీంకోర్టు స్పెషల్ లీవ్ పిటిషన్ నం.1890/2024లో 9 ఫిబ్రవరి 2024న తీర్పు ఇచ్చింది. కోర్టు తాత్కాలిక ఉత్తర్వుల్లో భూమిని అసలు కేటాయించిన ప్రయోజనానికి విరుద్ధంగా వినియోగించరాదని స్పష్టం చేసింది. దీంతో, ప్రభుత్వం ఈ భూమి వినియోగ నిబంధనల ఉల్లంఘనపై సమీక్షించి, సంస్థ భూవినియోగ పరిమితులను తక్కువ చేసేందుకు >>2

04-04pg2exHMNWJQE.qxd:04-04pg2exHMNWJQE.qxd 01/01/01 10:02 AM Page 1





గురువారం బ్యాంకాక్‌లో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ప్రవాస భారతీయులు

## ప్రధానిమోడీకి థాయ్‌ప్రధాని విశిష్ట కానుక

**బ్యాంకాక్, ఏప్రిల్ 3:** థాయిలాండ్ పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్రమోడీకి ఆదేశ ప్రధాని పెటోంగ్టార్న్ షినవత్రా విశిష్ట కానుకలు అందచేసారు. బ్యాంకాక్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చల సందర్భంగా ది వరల్డ్ తిపిటక సజ్జాయ ఫొనెటిక్ ఎడిషన్‌పేరుగల బౌద్ధగ్రంథాన్ని మోడీకి బహూకరించారు. ఈ చర్య భారత్‌థాయిలాండ్‌మధ్య బలమైన సాంస్కృతిక, భాషాపరమైన మతపరమైన సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తున్నదనిమోడీ కీర్తించారు. తిపిటక అంటే పాలీభాషలో మూడు బుట్టలు. ఇది బౌద్ధ ధర్మగ్రంథాలలోప్రధానం. బౌద్ధసన్యాసుల నియమాలు సూత్రాలు బోధనలు సంగ్రహించబడి ఉంటాయి. ఈగ్రంథం మొత్తం 108 సంపుటాలుగా ఉంది. థాయ్‌ప్రభుత్వం రాజు భూమిబల్ అతుల్యతేజ్(రామ-9), రాణి సిరికిట్ 70వ వార్షికోత్సవం సందర్భంగా 2016లో వరల్డ్ తిపిటక ప్రాజెక్ట్‌లోభాగంగా ఈప్రత్యేక ఎడిషన్‌ను ప్రచురించింది. పాలి, థాయ్ ఇలపులతో రూపొందించిన ఈ గ్రంథం తొమ్మిది మిలియన్లకుపైగా పదాలతో ఉంది. కచ్చితమైన ఉచ్ఛారణతో పఠిచేందుకు వీలుగా రూపొందించారు.

మోడీ స్పందిస్తూ ప్రధాని షినవత్రా నాకు తిపిటకను బహుమతిగా ఇచ్చారని, లార్డ్ బుద్ధుని పుణ్యభూమి అయిన భారత దేశం తరపున నేను దానిని వినయంగా స్వీకరించానన్నారు. గత ఏడాది భారత్ లార్డ్‌బుద్ధుని పవిత్ర అవశేషాలను, ఇద్దరు ప్రధానమతగురువులను థాయిలాండ్‌కు పంపించిందని గుర్తుచేసారు. సుమారు నాలుగు మిలియన్లప్రజలు ఈ అవశేషాలకు నివాళులర్పించారని తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. థాయ్ అధికారులు తెలిపిన వివరాలప్రకారం థాయ్ రాజులు బౌద్ధమత సంరక్షకులుగా నిలవడంతోపాటు తిపిటకను ఇతరదేశాలకు వ్యాప్తిచేయడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

## స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లు

>> అందుబాటులోకి రానున్నాయి.

**2,000 మంది ఉపాధికి భరోసా**

నగరాల్లోని ప్రధాన కూడళ్లలో రోడ్లకు ఇరువైపులా తోపుడుబళ్లపై వ్యాపారాలు చేస్తున్న వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు, నగరపాలక సంస్థల అధికారులు, రాజకీయ నాయకులు ఎవరికి కోపం వచ్చినా వారు తమ బళ్లను అక్కడి నుంచి తీసేయాల్సిందే. దీనివల్ల ఉపాధి కోల్పోతున్నారు. ఇలాంటి వారందర్నీ గుర్తించి స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్లలో చోటు కల్పించనున్నారు. ఈ ఎనిమిది మార్కెట్ల ద్వారా 1600 మంది చిరు వ్యాపారుల ఉపాధికి భరోసా లభించనుంది. మరో 400 మందికి మార్కెట్ శుభ్రం చేయడం, కాపలాదార్లుగా, ఇతరత్రా పనుల్లో ఉపాధి కల్పించనున్నారు. ఇంటికి అవసరమైన వస్తువులన్నీ ఒకేచోట లభిస్తే చాలా సౌలభ్యంగా ఉంటుంది. వినియోగదారులకు నాలుగైదు చోట్లకు తిరిగే పని తప్పుతుంది. అన్ని వస్తువులూ ఒకేచోట కొని తీసుకెళ్లొచ్చుననే దిశలో ఏపి ప్రభుత్వం అటువంటి ప్రయత్నం చేస్తోందన్నారు.

## ధరల నియంత్రణ కోసం ప్రత్యేక కమిటీ

### పౌరసంబంధాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ,ఏప్రిల్ 3,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా ధరల నియంత్రణ కోసం సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక కమిటీ వేశారని ఏపీ పౌరసంబంధాలశాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతే ప్రతివారం వీటిపై సమీక్షిస్తున్నారు. వినియోగ దారులకు మెరుగైన సరుకులు అందించాలనే ఉద్దేశంతో మేము ఇతర శాఖల మంత్రులతో సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నాం. ఈ రైతు బజారును గతంలోనూ తనిఖీ చేశాను. ఇప్పుడు ఇక్కడ ధరలు అందుబాటులోకి వచ్చాయని వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేసే వారిని కఠినంగా శిక్షించేందుకు వారిపై పీడీ యాక్ట్‌లు పెడుతున్నాం. భవిష్యత్‌లో సిఎం, డిప్యూటీ సీఎంతో చర్చించి సరుకులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ధరల నిరోధానికి మంత్రులతో సిఎం చంద్రబాబు కమిటీ వేశారని నాదెండ్ల మనోహర్ గుర్తుచేశారు. ఎప్పటికప్పుడు తాము ఇతర శాఖల మంత్రులతో కలిసి రేట్ల నియంత్రణ చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ రైతు బజారును గతంలోనూ తనిఖీ చేశానన్నారు. ఇప్పుడు ఇక్కడ ధరలు అందుబాటులోకి వచ్చాయని వినియోగదారులు సంతృప్తి వ్యక్తం చేశారని నాదెండ్ల వెల్లడించారు. చౌక బియ్యం నిల్వ ఉంచే బఫర్ గోదాముల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో కూడిన కెమెరాలు బిగించబోతున్నామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా నిరోధించేలా కాకినాడ యాంకరేజ్ పోర్టు వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని ఎన్‌ఓసీ ఇచ్చిన తర్వాతే సదరు లారీలు నౌకలో లోడ్ చేసేలా కార్యాచరణ చేపట్టామన్నారు.

## ఈడెన్ గార్డెన్స్‌లో ఆరెంజ్ ఆర్మీ హ్యాట్రిక్ ఓటమి!

### 80 బంతుల తేడాతో కోల్‌కత్తా నైట్ రైడర్స్ జయభేరి



**కోల్‌కత్తా, ఏప్రిల్ 3:** ఐపిఎల్ 2025 సీజన్‌లో 15 వమ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు హ్యాట్రిక్ ఓటమిని మూటగట్టుకుంది. ఈడెన్‌గార్డెన్స్‌లోజరిగిన ఈమ్యాచ్‌లో కోల్‌కత్తా నైట్‌రైడర్స్ ఆరువికెట్ల నష్టానికి 200 పరుగులుచేయగా తదనంతరం లక్ష్యఛేదనకు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ కేవలం 120 పరుగులుమాత్రమే చేయగలిగింది. దీనితో కెకెఆర్‌జట్టు 80 పరుగుల తేడాతో విజయం నమోదుచేసింది. కెకెఆర్ బౌలర్లు ముందునుంచీ కూడా ఆరెంజ్ ఆర్మీకి చుక్కలుచూపించారు. 16.4ఓవర్లలో 120 పరుగులకే ఆలౌట్ అయ్యేలా కెకెఆర్ బౌలర్లు వ్యూహం అమలుచేసారు. హెన్రిచ్ క్లాసెన్ మినహా ఇతర బ్యాటర్లెవ్వరూ పెద్దగా రాణించలేకపోయారు. క్లాసెన్ 22 బంతుల్లో 33 పరుగులుచేసాడు. ఇందులో రెండుఫోర్లు రెండు సిక్సులుకూడా ఉన్నాయి. నితీష్‌కుమార్‌రెడ్డి 19, మెండిస్ 27 మినహా ఎవ్వరూ తమ బ్యాట్‌లతో ప్రతాపంచూపించలేకపోయారు. కోల్‌కత్తా బౌలర్లలో వరుణ్‌చక్రవర్తి, వైభవ్ అరోరాలు అద్భుతంగా బౌలింగ్‌చేసారు. చెరో మూడు వికెట్లు తీసి ఆరెంజ్ ఆర్మీ బ్యాటర్లకు ముచ్చెమటలు పట్టించారు. ఆండ్రూ రస్సెల్2, హర్షిత్‌రాణా, సునీల్ నరైన్ చెరొక వికెట్‌తీసారు. తొలుత బ్యాటింగ్‌చేసిన కెకెఆర్ నిర్ణీత 20 ఓవర్లలో ఆరువికెట్ల నష్టానికి 200 భారీ స్కోరుచేసింది. టాస్‌గెలిచిన ఆరెంజ్ ఆర్మీ బ్యాటింగ్ కెకెఆర్‌కు అప్పగించింది. ప్రారంభ ఓవర్లలోనే కెకెఆర్ ఓపెనర్లను పెవిలియన్‌కు పంపించింది. మంచి ఫామ్‌లో ఉన్న క్వింటన్‌డీకాక్‌ను, ప్యాట్ కమ్మిన్స్ ఔట్‌చేసాడు. మరో ఓపెనర్ సునీల్ నరైన్‌ను మహ్మద్‌షమీ పెవిలియన్‌కు పంపించాడు. ఆ తర్వాత వచ్చిన రహానె రఘువంశీతోకలిసి స్కోరుబోర్డు చక్కదిద్దారు. కెకెఆర్‌కు మంచి భాగస్వామ్యం ఇచ్చారు. చివరిలో వెంకటేశ్ అయ్యర్; రింకూసింగ్ బౌండరీలమోతతో టీమ్‌స్కోరును పరుగులు పెట్టించారు. వెంకటేశ్ అయ్యర్ కేవలం 29 బంతుల్లో 60 పరుగులుచేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇందులో ఏడు ఫోర్లు 3 భారీ సిక్స్‌లు రాబట్టడం విశేషం. మరోవైపు రింకూసింగ్ 17 బంతుల్ల 32పరుగులుచేససాడు. వెంకీ, రింకూకలిసి చివరి ఐదు ఓవర్లలో 78 పరుగులు రాబట్టారు. వీరివల్లనే స్కోరు 200కి చేరింది. ఇక ఆరెంజ్ ఆర్మీ బౌలర్లలో పాట్‌కమిన్స్, షమీ, హర్షల్‌పటేల్; మెండీస్, జీషాన్ అన్సారి చెరోవికెట్ తీసారు.

# జలహారతి కార్పొరేషన్

>> యువజన, పర్యాటక శాఖ జీవోల ర్యాటిఫికేషన్‌కు ఆమోదం, రూ.710కోట్ల హడ్కో రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చేందుకు ఆమోదం, ఎపి మీడియా అక్రిడేషన్ నిబంధనలు 2025కి ఆమోదం లభించింది.

నూతన సమగ్ర ఎపి స్టేట్ మీడియా అక్రిడేషన్ రూల్స్2025 నిబంధనలకు కేబినెట్ విస్తృత చర్చ తరువాత అంగీకారం తెలిపింది.. రాష్ట్రంలో త్రీస్టార్ సహా ఇతర ప్రీమియం హోటళ్ల అభివృద్ధికి బార్ లైసెన్స్ ఫీజును తగ్గించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.. బార్ లైసెన్స్‌ల ఫీజును రూ.25లక్షలకు కుదించారు. అనకాపల్లి జిల్లాలో క్యాపిటివ్ పోర్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో వివిధ జీవోల రేటిఫికేషన్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నాగార్జున సాగర్ లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్‌కు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఇచ్చిన ప్రతిపాదనల్ని ఆమోదించారు. నాగార్జునసాగర్ లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ రిటైనింగ్ వాల్ నిర్మాణ ప్రతిపాదనకు ఆమోదం, జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఆమోదం. జలహారతి కార్పొరేషన్ ద్వారా పోలవరంబనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు రూపకల్పన. ప్రధాని నరేంద్ర మోడీ అమరావతిలో పర్యటించనున్నారు.. ఆయన చేతుల మీదగా రాజధాని అమరావతి పనులను తిరిగి ప్రారంభించనున్నారు. అమరావతిలో అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ప్రధాని మోడీ పర్యటనకు సంబంధించిన అంశాలపై సిఎం చంద్రబాబు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను ఆరా తీసారు. ప్రధాని పర్యటన ఖరారు కాగానే పూర్తిస్థాయి ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల పి4 కార్యక్రమం ప్రారంభించిన ప్రాంతంలో 50 ఎకరాలకు పైగా చదును చేయాలని చెప్పారు.. పార్కింగ్ ఏర్పాట్లకు ఇప్పటి నుంచే కసరత్తు చేయాలని సూచనలు చేశారు. గతంలో ప్రధాని పర్యటనల్లో పనిచేసిన అధికారుల జాబితా సిద్ధం చేసి.. వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ మేరకు ప్రధాని మోడీ పర్యటనకు సంబంధించి.. డిజిపి, సిఆర్‌డిఎ అధికారులు, గుంటూరు జిల్లా కలెక్టర్, ఎస్పీ, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆ ప్రాంతాన్ని సందర్శించాలని ఆదేశించారు. సమగ్ర నివేదిక అందజేయాలని సూచించారు. గతంలో అమరావతి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించిన సమయంలో కూడా వివిధ పనుల నిర్వహణను, మంత్రులు, అధికారులతో కమిటీలను నియమించిన విషయాన్ని సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా గుర్తుచేశారు. ఇప్పుడు కూడా కమిటీలను వేయాలని సూచన చేశారు.

ఇక అన్ని రంగాల్లో డ్రోనులను వినియోగిస్తున్నందున కచ్చితంగా ఇందుకు ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ కావాలనే సిఎం చంద్రబాబు అభిప్రాయంతో మంత్రి మండలి ఆమోదించింది.సుదీర్ఘ చర్చ,విశ్లేషణ తరువాత ఎపి ఫైబర్‌నెట్ నుంచి ఎపి డ్రోన్ కార్పొరేషన్‌ను డీమెర్జ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అంటే ఎపిడిసి (ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్)ను ఎపిఎస్‌ఎఫ్‌ఎల్ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్) నుంచి సపరేట్ చేసి.. స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేస్తారు. రాష్ట్రంలో డ్రోన్ సంబంధిత అంశాలన్నింటికీ నోడల్ ఏజెన్సీగా ఎపిడిసి వ్యవహరించనుంది. మంత్రివర్గ సమావేశానికి ముందు ఆనవాయితీగా వస్తోన్న లోకేష్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం జరిగింది.. ఎపి రాజధాని అమరావతిలో సింగపూర్ బృందం పర్యటించింది. సిఎస్ విజయానంద్‌తో సమావేశమైన సింగపూర్ ప్రతినిధులు, ఇవాళ సిఎం చంద్రబాబు, లోకేష్‌ను కలవనున్నారు. సీడ్ కేపిటల్ నిర్మాణంలో ఏపీ ప్రభుత్వం, సింగపూర్ సహకారం ప్రభుత్వం కోరింది.ఈ అంశంపై మంత్రి మండలిలో కీలకంగా చర్చించారు.మంత్రి మండలిలో తీసుకుంటున్న నిర్ణయం ప్రజలకు చేరే విధంగా మంత్రులు,వారి ద్వారా ఎంఎల్‌ఏలు, అధికారులు కృషి చేయాలన్నారు..మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ విద్యారంగంలో తీసుకుని వస్తున్న మార్పులు గురించి ప్రస్తావించారు.రాష్ట్రంలో శాంతి భద్రతల నియంత్రణ,ఈగిల్ టీమ్‌తో మత్తుపదార్థాల రవాణాదారుల అణచివేత, క్రైమ్ ఎగినేస్ట్ కేసుల నియంత్రణ తదితరంశాలపై హోంమంత్రి అనిత మాట్లాడారు.పురపాలక రంగంలో తీసుకుని వస్తున్న సంస్కరణలపై మంత్రి నారాయణ ప్రస్తావించారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువపై చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భాగంగా వెంపాడులో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సుమారు రూ.45 కోట్ల నిధుల మంజూరుకు ఆమోదం తెలిపింది. పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును జలహారతి కార్పొరేషన్ పేరిట ప్రత్యేక వాహక ప్రాజెక్టుగా పరిగణిస్తూ ఎపి కేబినెట్ ఆమోదంతెలిపింది. ఈ సమావేశంలోవ్యవసాయ మంత్రి అచ్చెన్ననాయుడు, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, వివిధశాఖల మంత్రులు, పాల్గొన్నారు.

## చట్టాలు ఉల్లంఘిస్తేనే 'రెడ్ బుక్'

>> అనుగుణంగా మనబిడ్డలను సిద్ధం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. 1994లో చంద్రబాబు తొలిసారి సిఎం అయినప్పుడు కొందరు ప్రత్యర్థులు కంప్యూటర్లు అన్నం పెడతాయా అంటూ అవహేళన చేశారు. ఇప్పుడు హైదరాబాద్ లో ఐటి ఎన్నిలక్షలమంది యువత ఉద్యోగాలు చేస్తున్నారో కళ్లముందు కన్పిస్తోంది. చంద్రబాబు నాయుడు ఎంతో ముందుచూపుతో ఆలోచించి ఐటి టవర్, ఐఎస్ బి, జీనోమ్ వ్యాలీ, అవుటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ ఎయిర్పోర్ట్ వంటివాటిని అభివృద్ధి చేశారు. ఫలితంగా ఈరోజు హైదరాబాద్ అంతర్జాతీయస్థాయి నగరంగా తయారైంది. విభజిత ఆంధ్రప్రదేశ్‌ను అదేస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు అవిశ్రాంతంగా కృషిచేస్తున్నారన్నారు. నిరుపేదలను పేదరికం నుంచి శాశ్వతంగా బయటకు తేవాలన్న లక్ష్యంతో పి4 విధానానికి రూపకల్పన చేసి, ఇటీవల ప్రారంభించారు. రైతులకు న్యాయం చేసే బాధ్యత మాది రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరల విషయంలో మా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. వరికి సంబంధించి గత ప్రభుత్వ బకాయిలను చెల్లించడమేగాక కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొన్న ధాన్యానికి ఎప్పటికప్పుడే డబ్బు రైతుల ఖాతాల్లో జమచేస్తున్నాం. తక్కువ ధర పలికే కొన్నిరకాల మిర్చి కనీస మద్ధతుధర రూ.11,500 అందజేస్తున్నాం. పసుపు ధరలకు సంబంధించి నేను దృష్టిసారించా. గిట్టుబాటు ధరలపై అచ్చంనాయుడు, నాదెండ్ల మనోహర్ లతో కూడిన కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షి స్తోంది. రైతు నష్టపోకుండా చూసుకునే బాధ్యత మా ప్రభుత్వానిదన్నారు. కొన్నిరకాల పంటల ఎక్కువగా వచ్చినపుడు మార్కెట్ ఇంటర్వెన్షన్‌తో ధరలను స్థిరీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి లోకేష్ చెప్పారు

## ఎదురుదెబ్బ

>> అయితే కాకాణి పిటిషన్‌కు విచారణ అర్హత లేదని వాదించారు అడ్వొకట్ జనరల్ ఎస్సీ ఎస్టీ కేసులో మొదట స్పెషల్ కోర్టుకి వెళ్లాలన్న ఎజి కాకాణి నేరుగా హైకోర్టులో పిటిషన్ వేశారని ఆ పిటిషన్‌కు విచారణ అర్హత లేదని వాదించారు. మొదట స్పెషల్ కోర్టు రిజెక్ట్ లేదా రిటర్న్ చేస్తే మాత్రమే హైకోర్టులో పిటిషన్ వేయాలి అంటుంది ప్రభుత్వం. గతంలో పలు కోర్టులు ఇచ్చిన జడ్జిమెంట్‌లు ఈ సందర్భంగా ఎజి ఉదాహరించారు.

## పిటిషన్ డిస్మిస్

>> షన్ దాఖలు చేశారు. అలాగే మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అనుబంధ పిటిషన్ సైతం వేశారు. అయితే దీనిపై మార్చి 24న హైకోర్టులో వాదనలు జరిగాయి. ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును ఇవాళ్టి (ఏప్రిల్ 3)కి వాయిదా వేసింది. ఈ మేరకు మిథున్ రెడ్డి వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది.

## ఐఏఎస్‌ల పల్లెనిద్ర

>> యోగం చేసిందని విమర్శించారు. విచ్చలవిడి నియామకాలతో వ్యవస్థలను నాశనం చేశారన్నారు. ఒక టిటిడిలోనే 4వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు సరైన విధివిధానాలు అవసరమన్నారు. కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఔట్ సోర్సింగ్ నియామకాలను సక్రమ పద్ధతికి తీసుకొద్దామని తెలిపారు.

స్వర్ణ గ్రామం పేరుతో ఉన్నతాధికారులు పల్లె నిద్ర చేయాలి అని సీఎం ఆదేశించారు. ఉన్నతాధికారులు 3 రోజులు, 2 రాత్రులు పల్లెనిద్ర చేయాలని నిర్ణయించారు. ఋషికొండ ప్యాలెస్‌ను వినియోగంలోకి ఎలా తీసుకు రావాలి అనే అంశంపై చర్చించాలని తెలిపారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఋషికొండ ప్యాలెస్‌ను సందర్శించి అభిప్రాయలు చెప్పాలని మంత్రులతో ముఖ్యమంత్రి అన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 04-04-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల సప్తమి రా.8.18
ఆరుద్ర తె.5.21
వర్జ్యం సా.5.26 - రా.7.03
దు.ఉ.8.29 - 9.18, 2) మ.12.36-1.25
శుభసమయం : ఉ.6.10-6.50
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగాలలో స్థాన మార్పులు వుంటాయి. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**వృషభం :** అనుకోని సమస్యలు ఎదురైన అధికమించి ముందుకు సాగుతారు. ఖర్చులు పెరుగుతాయి.

**మిథునం:** ఋణాలు తీరుతాయి. ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. ఆరోగ్యంపట్ల జాగ్రత్త అవసరం.

**కర్కాటకం :** గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం నిదానంగా దాలుస్తాయి. శ్రమకు తగ్గిన ఫలితం కష్టమే.

**సింహం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. పట్టుదలతో ముందుకు సాగుతారు.

**కన్య:** సంతానంనకు నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**తుల :** ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గుంటారు.

**వృశ్చికం:** ఇంటర్వ్యూలు, పోటీ పరీక్షలలో చురుకుగా పాల్గొంటారు. దైవదర్శనాలు వస్తు కొనుగోలు.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఋణబాధలు తప్పవు.

**మకరం:** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**కుంభం:** నూతన మిత్రులు పరిచయమై కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. శుభవార్తలు.

**మీనం:** ఋణాలు తీరి ఊరట చెందుతారు. జీవితభాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం న్యూఢిల్లీలో ఎవరెస్ట్ శిఖరం పర్వతారోహణకు జెండా ఊపుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

## కోటి ఇస్తే భారీ ప్రయోజనాలు!

>> వసతి,ప్రసాదాలు అందించే దిశగా నూతన పథకం తీసుకువచ్చారు.

**రూ.కోటి విరాళమిస్తే బహుళ ప్రయోజనాలు:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో అనేక విధాలుగా ట్రస్ట్‌లు, పథకాలు అమలవుతున్నాయి. వీటిని పటిష్టంగా నిర్వహించి,పేదలకు మెరుగైన వైద్యసేవలు, విద్యాబోధన చేస్తోంది. కొత్తగా రూపొందించిన కార్యాచరణ మేరకు కోటిరూపాయలు విరాళమిచ్చిన దాతలకు టిటిడి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తుంది. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజుల్లో మినహాయించి మిగిలిన రోజుల్లో కోటి విరాళమిచ్చిన భక్తులు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకునేలా కార్యాచరణ రూపొందించారు. కోటి విరాళమిచ్చిన దాతలకు జీవితకాలంలో దాతతోబాటు నలుగురికి ప్రతి ఏడాదిలో మూడురోజులు సుప్రభాతసేవ దర్శనాలు, 3రోజులు విఐపి బ్రేక్ దర్శనాలు,నాలుగురోజులపాటు సుపథం ప్రవేశ దర్శనం ద్వారా ఆలయంలోనికి చేరుకుని ఇష్టదైవం దర్శనం చేసుకోవచ్చు. వీటితోబాటు 10 పెద్ద లడ్డూలు, 20 చిన్నలడ్డూలు, ఒక దుప్పట, రవికె, 10 మహాప్రసాదం ప్యాకెట్లు బహుకరిస్తారు. ఏడాదిలో ఒకసారి దాతలైన భక్తులకు వేద ఆశీర్వచనం వంటి సౌకర్యం పొందవచ్చు. అంతేగాక తిరుమలకొండపై 3వేల రూపాయలు అద్దెతో కూడిన వసతి గదుల సదుపాయం మూడురోజులు కల్పిస్తారు. జీవిత కాలంలో దాతకు ఒకసారి ఐదు గ్రాముల బంగారు డాలర్, 50గ్రాముల వెండిడాలర్‌ను తగిన ఆధారాలను కార్యాలయంలో చూపి పొందవచ్చు.

**విరాళాలివ్వాల్సిన పథకాలు:**

దాతలు కోటిరూపాయలు విరాళాలివ్వాల్సిన టిటిడి ట్రస్ట్‌లలో కాటేజీ డొనేషన్ స్కీం, ఎస్వీప్రాణదానట్రస్ట్, ఎస్వీ విద్యాదనట్రస్ట్, బర్డ్ ట్రస్ట్, ఎస్వీ అన్నదానట్రస్ట్, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్, ఎస్వీ సర్వశ్రేయాస్‌ట్రస్ట్, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్, శ్రీవాణి ట్రస్ట్, ఎస్వీబిసిట్రస్ట్, బాలాజీఆరోగ్యవరప్రసాదిని స్కీమ్‌లకుదాతలు విరాళాలు చెల్లించి సౌకర్యాలను పొందవచ్చని టిటిడి తెలిపింది. దాతలు టిటిడి వెబ్‌సైట్"డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టిటిదేవస్థానమ్స్.ఎపి.జివొవి,ఇన్"లో ఆన్‌లైన్ ద్వారా విరాళాలు చెల్లించవచ్చు. ఆఫ్‌లైన్‌లో దాతలు విరాళాలను ఇఒ టిటిడి పేరున డిడి,చెక్‌లను తిరుమలలోని దాతల విభాగంలో (డోనార్‌సెల్)అందజేయాలి.

## విద్యుత్ ఛార్జీల తగ్గింపునకు చర్యలు

### ప్రతి ఇంటికి సోలార్‌ను అనుసంధానించేందుకు కృషి

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని గణనీయంగా తగ్గించేందుకు ఎపి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రాయోజిత పథకమైన పిఎం సూర్యఘర్ యోజన కింద ప్రతి ఇంటినీ సోలార్ ద్వారా విద్యుత్ వినియోగానికి అనుసంధానించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికిపైగా డ్వాక్రా మహిళలున్న నేపథ్యంలో వారి ద్వారా అంచెలంచెలుగా విస్తృత పరచాలని నిర్ణయించింది. తొలి విడతగా లక్ష మంది డ్వాక్రా మహిళల ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌ను అమర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీటి ఏర్పాటు వల్ల కలిగే లబ్ధిపై గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ అధికారులు డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. సమ్మతి తెలిపిన వారికి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 80,000ల మంది సమ్మతి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో 700 ఇళ్లపై సోలార్ ప్యానళ్లు అమర్చగా వాటిలో 400 గృహాలు డ్వాక్రా మహిళలవే ఉన్నాయి. ఇతర జిల్లాల్లోనూ ప్యానళ్ల ఇన్‌స్టాలేషన్ ప్రారంభమైంది.

పిఎం సూర్య ఘర్ యోజన గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. దీని కింద 3 రకాల సామర్థంతో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. మూడు కిలోవాట్ల సామర్థం ఉన్న రూఫ్‌టాప్ ఏర్పాటు వ్యయం రూ.1.95 లక్షలు కాగా రాయితీ రూ.78,000లు వస్తుంది. రెండు కిలోవాట్లయితే రూ.1.40 లక్షలు కాగా రాయితీ రూ.60,000లు వర్తిస్తుంది. ఒక కిలోవాట్ వ్యయం రూ.70,000లు కాగా రూ.30,000ల రాయితీ లభిస్తుంది. లబ్ధిదారులు వారి ఇంటి విద్యుత్ వినియోగాన్ని బట్టి రూఫ్‌టాప్ సామర్థ్యాన్ని ఎంపిక చేసుకోవచ్చు. లబ్ధిదారు వాటా 10 శాతం పోనూ, మిగతా మొత్తాన్ని 7 శాతం వడ్డీపై బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించే బాధ్యతను సెర్ప్ అధికారులు తీసుకుంటున్నారు. ఒకవేళ లబ్ధిదారు 10 శాతం వాటా కూడా చెల్లించలేని స్థితిలో ఉంటే ఆ మొత్తాన్ని బ్యాంకు, స్త్రీనిధి, పొదుపు మొత్తం నుంచి అందించనున్నారు.

## స్టూడియో భూములు వెనక్కి

>> ప్రయత్నించిందని తేల్చింది. బిఎస్‌ఓ 24 ప్రకారం, భూమి వినియోగ పరిమితిని మార్చే హక్కు కేవలం రాష్ట్ర ప్రభుత్వానికే ఉంది. జిల్లా స్థాయి అధికారులకు భూమి వినియోగ విధానాలను మార్చే అధికారం లేదని స్పష్టంగా పేర్కొంది. భూమి ప్రజా ప్రయోజనానికి అనుగుణంగా చిత్ర పరిశ్రమ అభివృద్ధికి మాత్రమే వినియోగించాలనే ప్రభుత్వ ఉద్దేశానికి విరుద్ధంగా, సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ నివాస యాజమాన్యానికి అనుమతి కోరడం స్పష్టమైన నిబంధనల ఉల్లంఘనగా గుర్తించబడింది.ఈ అంశాన్ని పరిశీలించిన ప్రభుత్వం, సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన 34.44 ఎకరాల భూమిలో 15.17 ఎకరాల భూభాగాన్ని రద్దు చేయాలని నిర్ణయించింది. మిగిలిన భూమిపై నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు గత తీర్పుల ప్రకారం, భూమి కేటాయింపులో నిబంధనలు ఉల్లంఘిస్తే, దానిని రద్దు చేసి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవచ్చని వెల్లడించబడింది.ప్రభుత్వ నిర్ణయం ప్రకారం, వైసిడిఎ , జివిఎంసీ వంటి సంస్థలు భూమి వినియోగ మార్పు దరఖాస్తులను ఆమోదించకూడదని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వబడ్డాయి. విశాఖపట్నం జిల్లా కలెక్టర్, సురేష్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కి 15.17 ఎకరాల భూమిపై షోకాజ్ నోటీసు జారీ చేయాలని, భూమి రద్దుపై తుది నిర్ణయం తీసుకునే ముందు సంస్థకు సముచిత సమయం ఇచ్చి, వారి వాదన వినిపించే అవకాశం కల్పించాలనే సూచనలు ఇచ్చింది.ప్రభుత్వ నిర్ణయం మేరకు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ తుది చర్యలు తీసుకుని, వాటి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ప్రకారం, భూమి వినియోగ నిబంధనల ఉల్లంఘనకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా భూ కేటాయింపులపై సరైన నియంత్రణ తీసుకురావాలని స్పష్టమైంది.

## వర్షాలతో తగ్గిన ఉష్ణోగ్రతలు

>> పతి, ఎన్టీఆర్, అల్లూరి జిల్లాల్లో పిడుగులు పడతాయని వెల్లడించింది. ఉరుములతో వర్షం కురిసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు చెట్ల కింద ఉండరాదని తెలిపింది.

కృష్ణా.ఎన్టీఆర్ జిల్లాలో వానలు పడ్డాయి.గన్నవరం పరిసరాల్లో వర్షం కురిసింది. దాదాపు అరగంట సేపు మోస్తరు జల్లులు పడ్డాయి. గత కొన్నిరోజులుగా ఉక్కపోతకు గురైన ప్రజలు వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రాంతంలో సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అనంతరం ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ విపరీతంగా ఉండటంతో ప్రజల తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మధ్యాహ్నం తర్వాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో వర్షం కురిసింది.

కడప నగరంలో గత పది రోజుల నుంచి ఎండ వేడితో ప్రజలు అల్లాడిపోతున్నారు. 38, 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నేటి మధ్యాహ్నం నుంచి భిన్న వాతావరణం నెలకొంది. భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఏకధాటిగా 45 నిమిషాల పాటు భారీ వర్షం కురవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భారీ వర్షంతో నగరంలోని రోడ్లపై వర్షం నీరు వచ్చి చేరింది. మురికి కాలువలు పొంగి ప్రవహించాయి. ఎండ తీవ్రత అత్యధికంగా ఉన్న ప్రస్తుత రోజుల్లో ఈ స్థాయిలో వర్షం కురవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురవడంతో ఉష్ణోగ్రతలు తగ్గుతాయని ప్రజలు భావిస్తున్నారు. గుంటూరు.బాపట్ల.ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వానలు పడ్డాయి.

3ong.qxd:04-04Pg3exHMNWJQER.qxd 01/01/01 9:53 AM Page 1



# ఇచ్చిన మాట ప్రకారమే పేదలకు పట్టాభిషేకం!

## దశాబ్దాల సమస్యను 10నెలల్లో పరిష్కరించా

## త్వరలో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన: మంత్రి లోకేష్

**మంగళగిరి(గుంటూరుజిల్లా),ఏప్రిల్ 3,ప్రభాతవార్త :** గతంలో మంగళగిరిలో జెసిబి పాలన చూశాం, ఎన్ డిఎ అధికారంలోకి వచ్చాక దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి ఉచితంగా శాశ్వత పట్టాలు అందించాలని నిర్ణయించాం, ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని ఈరోజు ఉండవల్లిలో తొలిపట్టాను అందజేశానని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గం ఉండవల్లిలో గత పదిహేనేళ్లుగా కొండవాలు ప్రాంతంలో నివసిస్తున్న రాజమండ్రి గోవిందు కుటుంబానికి మంత్రి లోకేష్ ఇంటికెళ్లి బట్టలు పెట్టి శాశ్వత పట్టాను అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... మంగళగిరిలో పాదయాత్ర నిర్వహించిన సమయంలో ఇక్కడ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కీలకమైన హామీ నెరవేర్చానన్నారు.తొలివిడతగా 3వేలమంది శాశ్వత పట్టాలు అందజేస్తున్నట్టు ప్రకటించారు.ఘనవిజయంతో నా బాధ్యత పెరిగింది!2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి తొలిసారి పోటీచేసి 5,300 ఓట్లతేడాతో ఓడిపోయాను. మొదటి రోజు బాధపడ్డా, రెండో రోజునుంచి మంగళగిరి ప్రజల మనసు గెలిచేందుకు ప్రయత్నించా. గత అయిదేళ్లుగా సొంత నిధులతో నియోజకవర్గంలో 26 సంక్షేమ కార్యక్రమాలు అమలుచేశామని వివరించారు. ఎన్నికల ప్రచారంలో 50వేల మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరా. నన్ను గెలిపిస్తే చంద్రబాబు, పవనన్నతో పోరాడి నిధులు తెస్తానని చెప్పా. మంగళగిరి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో 3వ అతి పెద్ద మెజారిటీ 91వేలతో నన్ను గెలిపించారు. ఈ ఘన విజయంతో నాలో కసి, బాధ్యత పెరిగింది. మంగళగిరిలో 50 అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారంరాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమం నిర్వహిస్తున్నాన్నారు. పార్కులు, ప్లేగ్రౌండ్లు, రైతు బజార్లు అభివృద్ధి చేస్తున్నాం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పైప్ లైన్ ద్వారా గ్యాస్ వంటి ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయనీ చెప్పారు. మంగళగిరిలో మోడరన్ రైతుబజార్‌నిర్మాణం, లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆధునీకరణ, మంగళగిరి ప్రజల కల అయిన వంద పడకల హాస్పటల్ ను దేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. త్వరలో వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తాం. స్థానిక సంస్థల నిధులు, సిఎస్ ఆర్ ఫండ్స్ తో గత పదినెలల్లో మంగళగిరి నియోజకవర్గంలో 50 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. మంగళగిరిని టిడిపి కంచుకోటగా మారుస్తా చేనేతలకు అధునాతన సాంకేతికతపై శిక్షణ, డిజైనింగ్ కోసం కేంద్రప్రభుత్వ సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ ను ఏర్పాటు చేయబోతున్నాం. స్వర్ణకారుల కోసం 75ఎకరాల్లో జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు ఏర్పాటుచేసేందుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. దీనివల్ల స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకోసం చిత్తశుద్ధితో బాధ్యతగా పనిచేస్తున్నాం. ఏపిలోనే మంగళగిరిని నెం.1గా నిలపాలన్నది మా లక్ష్యం.



## ఏసిబి అధికారులకు చిక్కిన జిల్లా వైద్యాధికారి!

**శ్రీకాకుళం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త** జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి బాల మురళీకృష్ణ గురువారం ఏసీబీ అధికారుల చేతికి చిక్కారు. వివరాల్లోకి వెళ్లగా డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో పని చేస్తోన్న ఆదివరపు కాంతమ్మ దీర్ఘకాలపు సెలవుపై వెళ్లారు. ఆ సెలవును పూర్తి చేసుకుని తిరిగి విధుల్లో జాయిన్ అవ్వడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పర్మిషన్ ఇచ్చేందుకు లంచంగా రూ.20వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు ఆయన దొరికిపోయేలా చేశారు. బాధితురాలు కాంతమ్మ ఈ విషయం గురించి ఏసీబీని ఆశ్రయించగా, అధికారులు ప్రణాళికాబద్ధంగా అడ్డుకున్నారు. డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలోనే లంచం తీసుకుంటుండగా అధికారులు అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ వ్యవహారం నడిపిన సీసీ సురేష్‌కుమార్‌పైన కూడా కేసు నమోదైంది. ఈ దాడిలో డిఎస్పీ రమణమూర్తి, సీఐ రమణ, భాస్కర్ తదితరులు పాల్గొని విశాఖ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు.

# తిరుమల సమాచారం

## మాట విననివారిని ఉపేక్షించొద్దు

### - భక్తులతో సంయమనంగా వ్యవహరించండి

### - అలిపిరి తనిఖీ కేంద్రంలో ఇన్‌ఛార్జి సివిఎస్ఒ హర్షవర్ధన్‌రాజు



**తిరుమల,ఏప్రిల్ 3ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పవిత్రతను కాపాడటంలో పోలీసులు,విజిలెన్స్,టిటిడి సెక్యూరిటీతో భక్తులు పూర్తిస్థాయిలో సహకరించాలని తిరుపతి జిల్లా ఎస్పీ ,టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్ఒ వి.హర్షవర్ధన్‌రాజు కోరారు. నిబంధనలు పాటించని యాత్రికులను, వారి వాహనాలను కొండకు అనుమతించొద్దని, మాట వినని వారిని ఉపేక్షించొద్దని సూచించారు. అలిపిరి తనిఖీ కేంద్రంలో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ భక్తులతో సంయమనంతో వ్యవహరించాలని అన్నారు. తిరుమలకు మద్యం సేవించిన వ్యక్తులు యధేచ్ఛగా వాహనాల్లో అలిపిరి తనిఖీ కేంద్రం దాటుకుని చేరుకోవడం, అలిపిరిలో తనిఖీలు పై గురువారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా ఎస్పీ ,టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్ఒ వి.హర్షవర్ధన్‌రాజు ఆకస్మిక తనిఖీలు చేశారు. తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరచారి,తిరుపతి డిఎస్పీ శ్రీలత,అలిపిరి ఏవిఎస్ఒ ప్రభుతో కలిసి ఆయన తిరుపతి నుండి వచ్చే ప్రైవేటు వాహనాలు, యాత్రికుల వాహనాలు, ద్విచక్రవాహనాలువెళ్ళే ప్రవేశ ద్వారాలను, విఐపి వాహనాలు వెళ్ళే ప్రవేశ ద్వారాన్ని పరిశీలించారు. ఇక్కడ వాహనాలను,యాత్రికుల లగేజీలను భద్రత సిబ్బంది తనిఖీ చేస్తున్న తీరును ఆయన గమనించారు. అలిపిరి తనిఖీ కేంద్రంలోసిసి కెమెరాలను తనిఖీ చేసి సూచనలిచ్చారు. ఇక్కడ భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, యాత్రికుల లగేజీలు, బ్యాగ్‌ల స్కానింగ్ మరింత నిశితంగా తనిఖీ చేయాలని విజిలెన్స్ సిబ్బందికి సూచించారు. తిరుమలకు వెళ్ళే ప్రతి వాహనాన్ని, ప్రతి ఒక్కరినీ మరింత క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే అనుమతించాలని ఏవిఎస్ఒ ప్రభుకు స్పష్టంగా ఆదేశాలిచ్చారు.

## గదిలో వదిలేసిన బంగారు గొలుసు అప్పగింత



**తిరుమల,ఏప్రిల్ 3ప్రభాతవార్తప్రతినిధి:** దైవదర్శనం కోసం వచ్చి హడావిడిలో గదిలో భక్తులు వదలివెళ్ళిన బంగారు గొలుసును టిటిడి సిబ్బంది నిజాయితీగా తిరిగి భక్తులకు అప్పగించారు. గురువారం మధ్యాహ్నం తిరుమలలో సన్నిధానం విశ్రాంతి భవనంలో గది 37లో నెల్లూరుకు చెందిన సురేష్ కుటుంబం బసచేసింది. గురువారం ఉదయం స్వామివారి దర్శనానంతరం గదిని ఖాళీచేసి వెళ్ళిపోయారు. గదిని శుభ్రం చేయడానికి వెళ్ళిన సిబ్బంది గమనించి 40గ్రాముల బంగారు గొలుసును పద్మావతి విశ్రాంతి భవనం విచారణ కార్యాలయం సూపరింటెండెంట్ భాస్కర్‌నాయుడు, మేనేజర్ కామేశ్వరరావు, ఆఫీస్ సబార్డినేట్ చంద్రశేఖర్‌కు అందజేశారు. దీన్ని వెంటనే భక్తుల చరవాణికి సమాచారం అందించి బంగారుగొలుసును తిరిగి అప్పగించారు. టిటిడి సిబ్బంది నిజాయితీని భక్తులు అభినందించారు.


## మద్యం మత్తులో భార్యపై భర్త దాడి

### - తల్లిని రక్షించబోయి తండ్రిని చంపిన కుమారుడు

**శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** ఓ వ్యక్తి మద్యం మత్తులో భార్యపై దాడి చేశాడు. ఇది సహించని కుమారుడు తల్లిని రక్షించే ప్రయత్నంలో ప్రక్కనే పడివున్న ఇటుక రాయితో తండ్రిని కొట్టడంతో తండ్రి మృతి చెందిన సంఘటన గురువారం చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. ఎస్ఆర్ పురం మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంకు చెందిన శ్రీనివాసమండడి(60) మద్యంకు బానిసగా మారి ప్రతి రోజు మద్యం సేవించి భార్య జ్యోతితో గొడవపడేవాడు. ఈ క్రమంలో బుధవారం సైతం శ్రీనివాసులు మండడి అతని భార్య జ్యోతిల మధ్య గొడవ తీవ్రం అయ్యింది. భర్త శ్రీనివాసులు మండడి తనకు చేతికి అందిన వస్తువులతో భార్య జ్యోతిపై దాడికి పాల్పడటం ప్రారంభించడంతో శ్రీనివాసులు మండడి కుమారుడు నాగరాజులు మండడి తండ్రి దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించి ఆవేశంతో ప్రక్కనే వున్న ఇటుక రాయితో తండ్రిపై దాడి చేశాడు. ఈ దాడిలో శ్రీనివాసులు మండడి తలకు తీవ్రంగా గాయాలు కావడంతో ఆయన మృతి చెందాడు. ఈ విషయంను నాగరాజు మండడి సమీప బంధువు సుబ్రమణ్యం మండడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హనుమంతప్ప, ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్‌లు సంఘటనా స్థలం చేరుకుని విచారించారు. మృతి చెందిన శ్రీనివాసులు మండడి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పారిశ్రామిక అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు

### - మంత్రి కొలను పార్థసారధి



**విజయవాడ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని సమాచార పౌరసంబంధాలశాఖా మంత్రి కొలను పార్థసారధి తెలిపారు.ఏపీ సమాచారశాఖ ప్రచార ప్రాంగణంలో ఆయన గురువారం సాయంత్రం మీడియాతో మాట్లావారు. ఈ రంగాన్ని అభివృద్ధి పర్చడం ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని వృద్ధి చేయడమే కాకుండా ఉపాధి అవకాశాలను పెద్ద ఎత్తున మెరుగు పర్చవచ్చని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ రంగం అభివృద్ధిపై దృష్టి సారించారు. టెంపుల్ టూరిజంకు కూడా పెద్ద ఎత్తున అవకాశాలు ఉన్నాయి. పర్యాటకులకు సరిపడా రూములు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ ఐదేళ్లలో దాదాపు 50,000 రూములను నిర్మించాలనే ఆలోచనలో పర్యాటక శాఖ ఉంది. ఫలితంగా రాష్ట్రంలోని 3 స్టార్ అంతకంటే ఎక్కువ కేటగిరీ హోటళ్లకు బార్ లైసెన్స్ ఫీజును రూ.66 లక్షల నుండి రూ. 25 లక్షలకు తగ్గించడానికి ఆమోదం కోసం యువజన సర్వీసులు, పర్యాటక సాంస్కృతిక శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పినట్లు వివరించారు. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని ఆతిథ్య రంగాభివృద్ధికి తగిన అనుకూల వాతావరణాన్ని కల్పించడమవుతుంది. ఆతిథ్య. పర్యాటక రంగం ఇతర రాష్ట్రాలకు దీటుగా అభివృద్ధి చెందడానికి ఊతం ఇస్తూ తద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించడంతో పాటు మరిన్ని ఉద్యోగ అవకాశలు కల్పించబడతాయి..యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ.. చాలా సంవత్సరాల తదుపరి ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున రాష్ట్రంలో నిర్వహించడం జరిగిందన్నారు.. రాష్ట్రంలోని అన్ని రకాల కళలను ప్రోత్సహించాలనే దృక్పథంతో ప్రభుత్వం ఉందన్నారు. ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఉగాది పురస్కారాలకు సంబందించి జారీ చేయబడి అమలు చేయబడినట్లు వివరించారు..మౌలికవసతులు పెట్టుబడుల శాఖ.పరంగా . మెస్సర్స్ ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ దాదాపు ఒక లక్షా 35 వేల కోట్ల పెట్టు బడితో రెండు దశల్లో 17.8 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేసే స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు చేసిన ప్రతిపాదనకు ముందుకు వచ్చిందన్నారు. ఇందు కోసం వారు కోరిన విధంగా అనకాపల్లి జిల్లాలోని డిఎల్ పురం వద్ద 2.9 కి.మీ.ల వాటర్ ఫ్రంట్ తో ఒక క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకై ఆమోదం తెల్పడం జరిగింది. ఈ క్యాప్టివ్ పోర్టు అనుమతికై కాకినాడ గేట్వే పోర్టు లిమిటెడ్ (కెజిపిఎల్) కు సంబందించిన పోర్టు రాయితీ ఒప్పందంలోని క్లాజు నెం.30.1.1 (ఇండియన్ పోర్టు యాక్టు1908) ను సవరించడం జరిగింది. ఈ నిర్ణయం ద్వారా మొదటి దశలో ఏడాదికి 7.3 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సామర్థం గల స్టీల్ ప్లాంట్ ను రూ.55,964 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయబడుతుంది. జనవరి 2029 నాటికి తొలి దశ ఉత్పత్తి ప్రారంభించాలనే టార్గెట్‌ను నిర్థేశించడం జరిగింది. మొదటి దశలో దాదాపు 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి.

## కాలువలో ఈతకు వెళ్లి తిరిగి రాని లోకానికి.. ఇద్దరు యువకులు మృతి

**పత్తిపాడు ఏప్రిల్ 3 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి, ఏలేరు కాలువ పోర్లు వద్ద స్నానానికి దిగి ఇద్దరు యువకులు మృతి. జగ్గంపేట నుండి ఎనిమిది మంది యువకులు స్నానానికి వెళ్లారు.వీరిలో ఇద్దరు యువకులు దేవర జీవన్ (17) మొల్లి తరుణ్(19) లు మృతి చెందారు.ఈ సంఘటన తెలిసిన వెంటనే జగ్గంపేటలో విషాద ఛాయలు అలుము కున్నాయి. స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డాక్టర్ చీటీ లేకుండా.. మత్తు మాత్రలు అమ్మొద్దు : ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ




**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ని తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా, రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మార్గనిర్దేశకత్వంలో ఈగల్ పనిచేస్తుందని ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. డ్రగ్స్ కంట్రోల్ అసోసియేషన్ ఆధర్యంలో రాష్ట్ర సీమాంధ్ర డ్రగ్స్ డీలర్స్ అసోసియేషన్‌తో మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన డ్రగ్స్ నియంత్రణపై జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.రాష్ట్రంలో నిబంధనలు అతిక్రమించిన 58 మందుల షాపులను గుర్తించామన్నారు: ఈగల్, డ్రగ్స్ కంట్రోల్ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్, పోలీసు శాఖలు సంయుక్తంగా ఆపరేషన్ గరుడను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ దాడుల్లో 158 మందుల షాపులు నిబంధనలు అతిక్రమించారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని, కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎన్.ఆర్.ఎక్స్, ఎక్స్ఆర్.ఎక్స్ డ్రగ్స్ ఎటువంటి ప్రిస్కిప్షన్స్ లేకుండా మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మందుల అమ్మకం, కొనుగోలుకు సంబంధించిన బిల్ బుక్ సంబంధిత వ్యక్తులపై కేసులను నమోదు చేస్తాం: కాలం చెల్లిన మందులను నిరక్షరాస్యులు, పిల్లలు, వృద్ధులకు డిస్కౌంట్స్ పేరుతో అమ్ముతున్నట్లు "ఈగల్" బృందం గుర్తించిందన్నారు. అటువంటి మందుల షాపులపై ఎన్డీపీఎస్ అండ్ డ్రగ్ కాస్మోటిక్ యాక్ట్ ప్రకారం సీజ్, వార్నింగ్ మెమో, లైసెన్సులను రద్దు చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులను నమోదు చేస్తామని ఐజీ ఆకే రవికృష్ణ హెచ్చరించారు. ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్(మత్తు మాత్రలు) విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, రాష్ట్రంలో మత్తు మహమ్మారిని తరిమేసే యజ్ఞంలో భాగంగా పోలీసులతో కలిసి గంజాయిని బాగా కట్టడి చేశామని చెప్పారు. మత్తుకు అలవాటు పడ్డ యువత మెడికల్ షాపుల్లో ఎన్ఆర్ఎక్స్ మందులు కొని విచ్చలవిడిగా వినియోగిస్తుండటం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. అందుకని ఆ రకమైన మందులు డాక్టర్ సిఫారసు చీటీ లేకుండా ఎవ్వరూ విక్రయించవద్దని ఆదేశించారు. ఇటీవల ఆపరేషన్ గరుడ పేరుతో ఈగల్, డ్రగ్ కంట్రోల్, విజిలెన్స్ విభాగాలు ఉమ్మడిగా నిర్వహించిన సోదాల్లో 158 మెడికల్ షాపుల్లో పలు అక్రమాలు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా నిషేధిత మందులు విక్రయిస్తే ప్రజల్ని టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే, ఈగల్ ఐజీ చర్యల వల్ల రాష్ట్రంలో ఎన్ఆర్ఎక్స్ మందులు తప్పనిసరిగా వాడాల్సిన రోగులు ఇబ్బంది పడుతున్నారని వాటి విక్రయదారులు చెబుతున్నారు. గంజాయి, డ్రగ్స్ విక్రేతల్ని అరెస్టు చేసి మత్తును అదుపు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేస్తే, మెడికల్ స్టోర్లపై పడటం విచిత్రంగా ఉందంటున్నారు. ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ విక్రయాలను తాము పూర్తిగా ఆపేశామని, అయితే, యువత ఆన్‌లైన్‌లో వాటిని బెంగళూరు, హైదరాబాద్ నుంచి తెప్పించుకొంటున్నారని చెబుతున్నారు.

డాక్టర్ చీటీ లేకుండా అటువంటి మందులు ఇవ్వొద్దని డ్రగ్ డీలర్లకు ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ సూచించారు. మీ దృష్టికి వస్తే 1972 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేయండి: ఎవరైనా నిషేధిత మందులను విక్రయిస్తున్నట్లు దృష్టికి వస్తే 1972 టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ నగేష్ బాబు, డీజీ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ప్రసాద్, సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యవర్గ సభ్యులు, ఈగల్ కు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీమ మీదుగా ముంబై-కన్యాకుమారి మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 3,ప్రభాతవార్త** రాయలసీమ జిల్లాల మీదుగా ముంబై–కన్యాకుమారి–ముంబై మధ్య వేసవి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ముంబై వీటీ నుంచి కన్యాకుమారి వెళ్లే నెంబ 01005ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 9,16,23,30వ తేదీల్లో ప్రతి బుధవారం అర్ధరాత్రి 12.30గంటలకు ముంబై వీటీ నుంచి బయలుదేరి తరువాతిరోజు మధ్యాహ్నం 1.15గంటలకు కన్యాకుమారి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కన్యాకుమారి నుంచి ముంబై వీటీ వెళ్లే నెంబర్ 01006ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 10,17,24,మే 1వ తేదీల్లో ప్రతి గురువారం మధ్యాహ్నం 3.30గంటలకు కన్యాకుమారి నుంచి బయలుదేరి తరువాతి రోజు తెల్లవారుజామున 4–15గంటలకు ముంబై వీటీ చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యలో దాదార్,థానే,కళ్యాణ్, లోనవాలా,పూణే,దోన్డ్,ఖుర్దువాడి,షోలాపూర్, కలబురిగి(గుల్బర్గ), వాడి,క్రిష్ణా,రాయచూరు, మంత్రాలయం,గుంతకల్లు,అనంతపురం, ధర్మవరం,యలహంక, క్రిష్ణరాజాపురం, బంగారుపేట్,తిరుపుత్తూర్,సేలం,నమక్కల్,కరూర్,డిండిగుల్,కొడైకెనాల్,మధురై,విరుద్‌నగర్, సత్తూర్,కోవిల్ పట్టి,తిరుణ్ వేళి,వల్లియూర్, నాగర్ కోయిల్ స్టేషన్లలో నిలుస్తాయి.

## రెండోరోజు ఏసిబి విచారణకు హాజరైన ఐ అండ్ పిఆర్ మాజీ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఐ అండ్ పీఆర్ మాజీ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి రెండో రోజు ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఏసీబీ ఇచ్చిన నోటీసుల మేరకు నిన్న బుధవారంఏసీబీ రిజనల్ కార్యాలయానికి విచారణకు వచ్చారు విజయ్ కుమార్. దాదాపు ఎనిమిది గంటల పాటు ఏసీబీ విచారణ కొనసాగింది. అయితే నిన్నటి విచారణకు విజయ్‌కు మార్ రెడ్డి సహకరించలేదని అధికారులు చెబుతున్నారు. ఈరోజు మరోసారి విచారణకు పిలిచారు. దీంతో ఇవాళ ఉదయం 10:30 గంటల తర్వాత రెండో రోజు విచారణకు విజయ్ కుమార్ హాజరయ్యారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సమాచార శాఖ కమిషనర్‌గా పనిచేసి విజయ్ కుమార్ రెడ్డి మొత్తం రూ.859 కోట్ల రూపాయలను ప్రభుత్వ ప్రకటన రూపంలో ఖర్చు చేయగా.. వాటిలో 50 శాతం వరకు కేవలం ఒక పత్రిక, మీడియాకు మాత్రమే కేటాయించారు. అంతే కాకుండా మిగిలిన 50 శాతం కూడా అత్యధిక శాతం వైకాంగ్రెస్ పార్టీ అనుకూలంగా పనిచేసే మీడియా సంస్థలకే కట్టబెట్టారు. ఈ కేసులోనే విజయ్‌కుమార్‌ను ఏసీబీ విచారిస్తోంది. 2019 – 24 మధ్యకాలంలో రూ.859 కోట్ల ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేసినట్టు విజిలెన్స్ నివేదిక ఇచ్చింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. అప్పటి ఐ అండ్ పీఆర్ సమాచార కమిషనర్ విజయ్ కుమార్ నోటీసులు ఇచ్చారు. ఎవరి ప్రోద్బలంతో చేశారు.. ఎందుకు చేశారు అనే దాన్ని ఏసీబీ కూపీ లాగుతోంది. ఈ వ్యవహారానికి సంబంధించి విజయ్ కుమార్‌రెడ్డిని నిన్న కొన్ని ప్రశ్నలు అడుగగా.. ఆయన మౌనం దాల్చినట్లు తెలుస్తోంది. ఎలాంటి సమాధానం చెప్పకుండా ఉండటంతో గత ప్రభుత్వంలో మీడియాకు, వైసీపీ అనుకూల మీడియాకు ఇచ్చిన ప్రభుత్వ ప్రకటనల రికార్డులను కూడా ఆయన ముందు ఉంచి ప్రశ్నించారు. అయినప్పటికీ విజయ్ కుమార్ ఎలాంటి సమాధానాలు ఇవ్వనట్లు తెలుస్తోంది. దీంతో ఈరోజు మరోసారి విచారణకు రావాల్సిందిగా విజయ్ కుమార్‌రెడ్డికి ఏసీబీ అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఉదయం విచారణ నిమిత్తం ఏసీబీ ఆఫీసుకు వచ్చారు విజయ కుమార్‌రెడ్డికి వైకాంగ్రెస్‌పార్టీ అనుకూలంగా ఉన్న మీడియా సంస్థలకు ఎందుకు దోచిపెట్టారు.. ఎవరి ప్రోద్బలంతో, ఎవరు ఆదేశాల మేరకు ప్రభుత్వ ధనాన్ని దాదాదత్తం చేశారని విజయ్ కుమాంరెడ్డిని ప్రశ్నించి.. ఆయన నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేయనున్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లుకు జనసేనమద్దతు : డీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం లోకసభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు జనసేన పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. వక్ఫ్ చట్టాన్ని ఆధునీకరించడం లక్ష్యంగా పెట్టుకున్న బిల్లుకు అనుకూలంగా ఓటు వేయాలని పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ ఎంపీలను ఆదేశించారు. ఇదే విషయాన్ని పవన్ కళ్యాణ్"ఎక్స్" వేదిక స్పష్టం చేసారు. ఈ చట్ట సవరణ ముస్లిం సమాజానికి మేలు చేస్తుందని జనసేన విశ్వసిస్తోంది. ఈ మేరకు లోక్ సభలోని జనసేన ఎంపీలకు పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ బిల్లుకు అనుకూలంగా ఓటింగ్ లో పాల్గొనాలని జనసేన పార్లమెంట్ సభ్యులకు తెలిపారు. వక్ఫ్ చట్టంలో సవరణలకు సంబంధించిన బిల్లును 31 మంది సభ్యులతో జైంట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసి సమీక్షించారు. సంబంధిత వర్గాలతో విద్యావంతులతో, పాలన రంగ నిపుణులతో చర్చించి ఈ బిల్లును రూపొందించారు. బ్రిటిష్ కాలంనాటి వక్ఫ్ చట్టాన్ని నేటి కాలానికి తగిన విధంగా క్రమబద్ధీకరించడం ద్వారా విస్తృత ఫలితాలు దక్కుతాయి. ఈ వక్ఫ్ సవరణ బిల్లుకు ఇవ్వాలి అని పవన్ కళ్యాణ్ మద్దతు తెలిపారు. వక్ఫ్ బిల్లు ముస్లిముల ప్రయోజనాలను కచ్చితంగా కాపాడుతుందన్నారు.తమ పార్టీ వక్ఫ్ బిల్లు అంశాన్ని క్షుణంగా అధ్యయనం చేసిన తరువాతనే మద్దతు ప్రకటించింది.సామాజికంగా ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా మార్పులు అవసరమన్నారు.

## రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన రాష్ట్ర మంత్రి టిజి భరత్

### - పలు రైల్వేప్రాజెక్టులపై కేంద్రమంత్రితో చర్చించిన టిజి భరత్

**కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ బుధవారం రాత్రి ఢిల్లీలో కలిశారు. ఈసందర్భంగా కర్నూలు నుండి ముంబాయికి మరియు కర్నూలు నుండి విజయవాడకు కొత్త రైల్వే సర్వీసులను ప్రవేశపెట్టాలని కేంద్ర మంత్రిని కోరినట్లు టీజీ భరత్ తెలిపారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు కర్నూలు రాజధానిగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తు ఈప్రాంతాన్ని రైల్వేపరంగా అభివృద్ధి చేసేందుకు కృషిచేయాలని విన్నవించారు.

## 5న విజయవాడలో ఆర్ట్‌గ్యాలరీ

**విజయవాడ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** ఈనెల 5న విజయవాడ ఐటిఐ కాలేజ్, స్కూల్ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఆవరణలో ఇండియా ఆర్ట్ వన్‌డే వర్క్‌షాపును నిర్వహిస్తామని డ్రీం వర్క్ ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ పి రమేష్ గురువారం విజయవాడలో మీడియాకు తెలిపారు. తమ సంస్థ, విజయవాడ స్కూల్ఆఫ్ ఆర్కిటెక్చర్ , ఏపి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా ఈ ప్రదర్శన వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి 150 మంది ప్రముఖ చిత్రకారులు పాల్గొనే ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనే యువ చిత్రకారులు, ఆర్ట్ టీచర్లు, చిత్రకారులు, కార్టూనిస్టులకు షీట్, రంగులు అందిస్తామన్నారు. బ్రష్‌లు వారే తెచ్చుకోవాలన్నారు. కళాశాల విద్యార్థుల చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు అదేరోజు శనివారం బహుమతులందిస్తామన్నారు. వివరాలకు 9393949596 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కుమార్, గోళ్ళ నారాయణరావు, సుబ్బారావ్, రామ్ తదితరులు పాల్గొన్నారు.




:మీడియాతో మాట్లాడుతున్న రమేష్

## రికార్డు స్థాయిలో విద్యుత్ రైలింజన్ ఉత్పత్తి

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 3,ప్రభాతవార్త** రాబోయే విద్యుత్ అవసరాలకు అనుగుణంగా రైల్వే శాఖ విద్యుత్ రైలు ఇంజన్(లోకోమోటివ్)లను ఉత్పత్తి చేయడంలో విద్యుత్ రైళ్ల కంటే వేగంగా పురోగమిస్తోంది. 2024–25ఆర్థిక సంవత్సరంలో 1,681విద్యుత్ రైలు ఇంజన్లను ఉత్పత్తి చేసి అమెరికా సంయుక్త రాష్ట్రాలతో పాటు యూరప్,ఆఫ్రికా,ఆస్ట్రేలియా దేశాలను సైతం వెనక్కు నెట్టి భారత్ ముందుకు దూసుకుపోతుంది. చిత్తరంజన్‌లో కోమోటివ్ వర్క్స్(సిఎల్‌డబ్ల్యు)700విద్యుత్ లోకోమోటివ్‌లను ఉత్పత్తి చేయగా, వారణాసిలోని బనారస్ లోకోమోటివ్ వర్క్స్(బిఎల్‌డబ్ల్యు)-477, పాటియాలా లోకోమోటివ్ వర్క్స్-304, మాధాపూరా, మరాహోవ్రహ్-100 చొప్పున మొత్తం 1,681 విద్యుత్ రైలు ఇంజన్‌లను ఉత్పత్తి చేశాయి.

## రూ.12లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 3,ప్రభాతవార్త** నూతన ఆర్థిక సంవత్సరం 2025–26 ఈ నెల (ఏప్రిల్) 1 నుంచి ప్రారంభమైంది. మంగళవారం నుంచే కొత్త ఆదాయపు పన్ను విధానం (న్యూ ట్యాక్స్ రిజీమ్), పాత ఆదాయపు పన్ను విధానం (ఓల్డ్ ట్యాక్స్ రిజీమ్)లో బడ్జెట్ 2025లో చేసిన మార్పులు అమలులోకి వచ్చాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన సాధారణ బడ్జెట్‌లో పన్ను విధానంలో రూ.12లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి పన్నును రద్దుచేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో పాత పన్ను విధానంలో ఎలాంటి మార్పులు చేయలేదు. దీంతో ఇప్పుడు పాత పన్ను విధానం లాభదాయకమా..?లేక కొత్త పన్ను విధానం శ్రేయస్కరమా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త పన్ను విధానంలో ఏ విధంగా పన్ను ఆదా చేయవచ్చు, పన్ను చెల్లింపుదారులకు ఎంత మొత్తం ప్రయోజనం చేకూరనుంది అనే విషయాలను పరిశీలిస్తే కొత్త పన్ను విధానం మేరకు రూ.4లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి ఎలాంటి పన్ను లేదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ప్రజారోగ్య మరియు మునిసిపల్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
నం.01/Podili/MPLADS/DB/TO/2025, తేది: 01.04.2025
పని పేరు: విశ్వనాథపురం కరెంట్ ఆఫీస్ రోడ్, 11వ వార్డ్ నుండి మెట్టు వెంకట రెడ్డి (ట్రెండ్స్) షోరూమ్ వరకు CC డ్రెయిన్ నిర్మించుట. అంచనా ధర: రూ.8,06,318/-. బిడ్ డాక్యుమెంట్స్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 08.04.2025 ఉ.10.30 గం. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ప్రజారోగ్యం డివిజన్, ఒంగోలు
DIPR.No.16037/CL/Advt/1/1/2022-23, తేది: 03.04.2025

వార్త

విద్య లేకపోయినప్పటికీ గర్వించేవాడు, దరిద్రుడైనప్పటికీ పెద్ద ఎత్తులు వేసేవాడు, పనులు చేయనప్పటికీ ధనాన్ని ఆశించేవాడు మూర్ఖుడు.

-లావోసు

# తెలుగింట సన్న బువ్వ!


అఖిలాంధ్ర ప్రజానీకానికి ఇప్పుడు సన్నరకం బియ్యం చేరువయ్యాయి. తెలంగాణలో సన్నబియ్యం పేరు మారుమోగిపోతోంది. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంలో నిరు పేదలు ఈ ఉగాదిని సన్నబియ్యం పండగగా జరుపుకున్నాయి. దారిద్ర్యరేఖ దిగువనున్న వారందరికీ సన్నరకం బియ్యం అందించడమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మక పథకాన్ని సిద్ధంచేసింది. జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం కింద రాష్ట్రంలోని రేషన్‌కార్డులు ఉన్నవారందరికీ సన్న బియ్యం అందుతుంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం కొంత సమకూర్చినా, బియ్యం ధరలో వ్యత్యాసం వల్ల రాష్ట్రప్రభుత్వ ఖజానాపై రూ.2858 కోట్లు భారం పడుతుంది. రేషన్ కార్డులపై ఒక్క కుటుంబ సభ్యునికి నెలకు ఆరుకిలోలు చొప్పున సన్నరకం నాణ్యమైన బియ్యం ఉచితంగా ఇస్తారు. 1980వ దశకంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నందమూరి తారక రామారావు పేదలకు మూడు పూటలా భోజనం పెట్టాలన్న సంకల్పంతో కిలో రెండు రూపాయల బియ్యాన్ని ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి పేద ప్రజలు తమకు మంచి బువ్వ దొరకుతోందని ఆనంద పడేవారు. కాలక్రమేణా దాని రూపురేఖలు మారిపోయి దొడ్డు బియ్యం చేతికొచ్చాయి. కొంతకాలం దొడ్డు రకం బియ్యం అందినా తినలేని పరిస్థితి ఉండేది. దిగువ మధ్య తరగతి ప్రజలు రేషన్ కార్డును ఉనికిలో ఉంచుకోవడంకోసం తమబియ్యాన్ని రేషన్‌షాపుల్లో వదిలేస్తే తిరిగి మిల్లులకుచేరి రీసైక్లింగ్ బియ్యంగా మార్కెట్‌కు చేరేవి. ఇప్పుడు ఆపరిస్థితి లేదు. పక్కా సన్నరకం బియ్యం నేరుగా ప్రతి పేదవాడి ఇంటికి చేరుతున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు అలనాటి ఆనందాన్ని కలిగించే విధంగా సన్నబియ్యంతో వండిన అన్నాన్ని విస్తరిలో చూసుకొని 'అన్నం పరబ్రహ్మ స్వరూపం'గా కళ్ళకద్దుకుని బహుదానందపడుతున్నారు. వారి కళ్ళల్లో ఆనంద బాష్పాలు చూడగలుగుతున్నారు. గతకాలపు దొడ్డు బియ్యాన్ని కనీసం పశువులు తినేందుకు కూడా పనికిరాదని ప్రజలు తిరస్కరించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడైతే అలాంటి పరిస్థితి లేదు. సన్నబియ్యం తన చేతికందగానే పాయస పరమాన్నాలు వండుకున్న సందర్భాన్ని ఆయా కుటుంబాలు ఎంతో ఆనందంగా స్వీకరిస్తున్నాయి. ఈసారైనా తాము సన్న బియ్యం తినగలుగుతున్నామని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు ఇకముందు కూడా ఇదే విధంగా సాగాలని వారు కోరుకుంటున్నారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 85శాతం కుటుంబాలకు సన్న బియ్యం అందుతాయి. అంటే 3.10కోట్ల మంది లబ్ధిదారులకు చేరుతాయి. గతంలో రూ.10,665కోట్లు వెచ్చించినా దొడ్డు బియ్యమే గతి. చివరకు కోళ్ల ఫారాలకు, బీరు కంపెనీలకు దారి మరళ్లాయని అపప్రధ ఉండేది. నిజానికి ఆ దొడ్డు బియ్యంలో ఎటువంటి పోషకాలు లేవు. తాజాగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని 1723 రేషన్ దుకాణంలో 2.91 లక్షల మంది కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుంది. సన్న బియ్యం పథక రచనకు ముందుగానే సన్నబియ్యం పండించే రైతులను సన్నబియ్యం వరి రకాన్ని పండించేందుకు ప్రోత్సాహకాలు అందచేసింది. క్వింటాకు 500రూపాయలు అదనంగా బోనస్ ఇస్తామని ప్రకటించారు. మద్దతు ధరతో బాటు బోనస్ కూడా రావడంతో రైతులందరూ సన్న బియ్యం సాగుకు ముందుకు వచ్చారు. ఆ మేరకే వారి పథకం ప్రకారం నేడు సన్నబియ్యం పథకం సజావుగా సాగేందుకు వీలుగా తెలంగాణలోనే సన్న బియ్యం పండించడం సాధ్యమైంది. సన్న బియ్యం పంపిణీ ఆచరణలో అవరోధాలు దాటుకుంటూ ఒక యజ్ఞంగా చేపడితేనే తప్ప ఈ పథకం పేదలకు నిర్విరామంగా చేరే అవకాశం. ఈ విషయంలో ప్రభుత్వం ఎక్కువ జాగ్రత్తలుతీసుకోవాల్సి ఉంది. ఇదేపరిస్థితి కొనసాగి రైతులందరికీ సన్న బియ్యం అందించగలిగితే దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ప్రారంభించేందుకు మొగ్గుచూపుతాయి. ఈవిధంగా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పేదలకు అందించేందుకు ఒక మార్గదర్శకంగా తెలంగాణ వైపు దేశం అంతా చూసే అవకాశం ఉంది. ప్రాథమిక విద్యనభ్యసించే పసిపిల్లలకు, గర్భిణులు, బాలింతలకు వెరసి మొత్తం 10.8లక్షలు లబ్ధిదారులకు ఏటా24 వేల మె.టన్నులు సన్నబియ్యం సరఫరా చేస్తోంది. ఈ విధంగా సన్నబియ్యం ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంచింది. ఇది మాత్రం కొత్త ప్రయోగమే. పేదలకు పంచ భక్ష్యపరమాన్నాలు అందించలేక పోయినా సుష్టుగా తినగలిగే సన్న బియ్యం ఇవ్వడం మేలైన ఆలోచన. దానితో పాటు ఉప్పు, పప్పు చింతపండు నిత్యావసర వస్తువుల కిట్ కూడా అందుతుంది. గతంలో దొడ్డు బియ్యం సానబట్టి సాధారణ మార్కెట్‌కి చేరిపోయేవి. ఎవరూ దొడ్డు బియ్యానికి ఆశపడే వారు కాదు. ఈ సారి అలాంటి పరిస్థితి లేకుండా పర్యవేక్షణ లోపం లేకుండా అమలు జరిగితే తెలంగాణలో నిరుపేదలంతా సౌఖ్యంగా భోజనం తినగలుగుతారు. అలాంటి పరిస్థితి దేశవ్యాప్త పౌరులందరికీ లభించేందుకు తెలంగాణ ఒక మార్గదర్శకం కావాలి. ఆంధ్రప్రదేశ్‌లో మధ్యాహ్న భోజన పథకం వరకే సన్నబియ్యాన్ని అందించే ఏర్పాట్లు చేస్తుంటే తెలంగాణ మాత్రం అతి పెద్ద ఆర్థిక భారాన్ని తలకెత్తుకుంది. ఆర్థిక పరిస్థితి సరిగా లేని తరుణంలో బియ్యం పంపిణీ హర్షదాయకం. అంతేకాదు ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు లక్ష టన్నుల బియ్యం ఎగుమతి చేసే స్థాయికి చేరింది. త్వరలో తెలంగాణ ప్రపంచ దేశాల్లో 'రైసు హబ్' గా మారే అవకాశాన్ని ఆహ్వానిద్దాం!

మీరు తప్ప మీకు శాంతిని ఎవరూ ప్రసాదించలేరు. సిద్ధాంతాలు పాలనలో విజయాన్ని సాధించినప్పుడే మీకు మానసిక శాంతి లభిస్తుంది.



ఎమర్సన్

మన శక్తియుక్తుల్ని మానవ కళ్యాణానికి వినియోగించాలి. కానీ వినాశనానికి కాదు.



షేక్‌స్పియర్

# ప్రజావాక్కు



## అదనపు సిబ్బందిని నియమించాలి

రానురాను పెరుగుతున్న జనాభాగృహాలు గృహాల సముదాయాలుఆకాశహర్మ్యాలు, పరిశ్రమలువ్యాపార వాణిజ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు విస్తృతస్థాయిలో ఏర్పడి సమయానుకూలమైన యాజమాన్య పద్ధతులు పర్యవేక్షణ అవలంబించకపోవడం వలన ప్రస్తుతం గత కీర్తి ప్రతిష్టలకు నోచుకోవడం లేదు. నగరాన్ని ఉదయంలో శుభ్రపరచడానికి సఫాయి ఉద్యోగులు తమ శక్తి వంచన లేకుండా ఏకాలమైనా విధులనునిర్వహిస్తుంటారు. వీధులను ఉడ్చుటకు సంవత్సరానికి ఒకసారి చీపురు కట్టలను, రక్షణకు కావలసిన చేతిగ్లౌజులు, మాస్కులు, చేతులు శుభ్రం చేసుకోవడానికి హ్యాండ్ వాష్‌తో కూడిన కిట్స్‌ను అందజేసేవారని ఈఉద్యోగులు తెలుపుతున్నారు. ప్రస్తుతం ఈ కిట్స్‌ను అందజేయడం లేదని వాపోతున్నారు.

-దండంరాజు రాంచందర్ రావు, పాత బోయినపల్లి

## పామాయిల్ సాగును పెంచాలి

పామాయిల్ సాగును ప్రభుత్వం పెద్ద ఎత్తున వ్యవసాయ శాఖ ద్వారా ఉపాధి హామీ ద్వారా చేపడుతోంది. దీనివల్ల రైతులకు లాభంతో పాటు విభిన్న పంటలు సాగులోకి వచ్చేఅవకాశంఉంది. ఖమ్మంజిల్లాలో రెండుచోట్లా పామాయిల్ పరిశ్రమలు ఫామ్ చేయడం ఇందులో భాగం. దీనివల్ల స్థానికంగా ఉపాధిఅవకాశాలు పెరగడంతో పాటు రవాణా వ్యయం రవాణా సమయం తగ్గేఅవకాశం ఉంది. దీనివల్ల స్థానికంగానే నూనె ఉత్పత్తి కేంద్రాలు కూడా ప్రభుత్వ ఆధీనంలోని స్వయం సహాయక బృందాలు ద్వారా క్రయవిక్రయాలు జరిపించి వాటిని బలోపేతం చేయడానికి అవకాశం ఉంది.

-భారత అవినాష్, జనగామ

## భారీ జరిమానాలు విధించాలి

రాష్ట్రంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడుతున్న వార్తలు నిత్యంపత్రికల్లో వస్తున్నాయి. కేసులు నమోదు చేస్తున్నారు. అయితే అందువలన అక్రమ తరలింపు ఆగే పరిస్థితిలేదు. అలాగే పట్టుబడిన బియ్యం కాలం గడిచే కొద్దీ పురుగు పట్టి ఎందుకూ పనికి రాని ప్రమాదంఉంది. అధికారులు చట్టపరమైన చర్యలు వేగవంతం చేసి, పట్టుబడిన బియ్యాన్ని వేలం వేయాలి. అక్రమాలకు పాల్పడిన వారికి భారీ జరిమానాలు విధించాలి.

- జి.రామకృష్ణ, ఏలూరు జిల్లా

## శాస్త్రం ఎన్నటికి తప్పకాదు

మార్చి 30వ తారీఖు ఉగాది పండుగ జరుపుకున్నాము. శ్రీ క్రోధికి వీడ్కోలు చెప్పి శ్రీ విశ్వావసుకు స్వాగతం పలికాము. రాజకీయ పార్టీలు అయిన కాంగ్రెసు, బి.ఆర్.ఎస్., బి.జె.పి. తెలుగుదేశం, వై.యస్.ఆర్.సి.పి. వారు ఉద్దండ పండితులను తమ పార్టీల కార్యాలయాలకు ఆహ్వానించారు. వారు విశ్లేషించి వినిపించిన పంచాంగ శ్రవణం పార్టీలకు శ్రవణానందకరంగా ఉంటే టి.వి.ల ముందు కూర్చుని వింటున్న వారికి కంపరం పుట్టించింది. ఎందుకంటే ఆ జ్యోతీష శాస్త్రవేత్తలు తమను పిలిచిన పార్టీలవారిని అతీతంగా పొగుడుతూ ఆకాశానికి ఎత్తేశారు పదవిలో నున్న పార్టీలు అమోఘంగా పాలిస్తున్నాయని, పదవి కోల్పోయిన పార్టీలు త్వరలోనే పాలనను చేపడతారని గట్టిగా శ్లాఘిస్తూ ఉద్ఘాటించారు. జ్యోతిష్య శాస్త్రం తర్కానికిచక్కని పరమాద్భుతమైన పురాతన సైంటిఫిక్ విద్య. రాబోయే చంద్ర సూర్యగ్రహణాలను గణించి రచించిరాసిన పంచాంగం ప్రకారం శ్రవణం చేస్తున్నప్పుడు, ఈ పండితులు చెప్పేవి ఒక రీతిగా లేవు. శాస్త్రంఎన్నటికి తప్పుచెప్పదు. చెప్పేవారిలో దోషాలుంటే విని ఆచరించే వారు అనుభవించాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ప్రజలతో చర్చించండి

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం రాష్ట్రంలోఉన్న12.769 గ్రామాలలో అధికారి ప్రజలతో చర్చకార్యక్రమం నిర్వహించాలి. ప్రతి అధికారి గ్రామాలలోని ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను దరఖాస్తు రూపంలో స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించాలి. కొన్ని రకాల దరఖాస్తులను ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలి. ప్రతి అధికారి ప్రతిగ్రామంలో పర్యటించే విధంగా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేవిధంగా కృషిచేయాలి. ప్రజల సమస్యలను ప్రభుత్వకార్యాలయాల చుట్టూ తిరిగితిరిగి విసిగివేసారి పోకుండా ప్రభుత్వ అధికారులే ప్రజలవద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరించేవిధంగాకార్యక్రమాలను రూపొందించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## నానాటికీ తీసికట్టుగా మానవ సంబంధాలు

మానవ సంబంధాలు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. సంసార బంధాలు కూడాధర్మం తప్పుతున్నాయి. భార్యా భర్తలు వివాహేతర కారణాలవల్ల ఒకరినోకరిని హతమార్చడం, అలాగే ఆస్తితగాదాలతో హత్యలకుపాల్పడడం, ఈఅర్థాంతర మరణాలు, అనైతిక సంబంధాలను అరికట్టే చర్యలు తీసుకోవాలి.

- ఎన్.గోపికృష్ణ, హైదరాబాద్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విశ్వవిద్యాలయాలను కాపాడుకోవాలి

**విశ్వవిద్యాలయాలు విద్యా కేంద్రాలుగా మాత్రమే కాదు అవి ప్రకృతి వనరులు, పర్యావరణ పరిరక్షణ కేంద్రాలుగా ప్రభుత్వాలు గుర్తించాలి. 400 ఎకరాల భూమికి సంబంధించిన వివాదాన్ని సృష్టించింది విశ్వవిద్యాలయం కాదు, విద్యార్థులు కాదు అలాగే పర్యావరణాన్ని రక్షించేవిధంగా అభివృద్ధి జరగాలని రాహుల్ గాంధీ ఆలోచన కాబట్టి అందరికీ ఆమోద యోగ్యమైన పరిష్కారాన్ని సూచించవలసిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను తీర్చిదిద్ది బడ్జెట్ నిధులను కేటాయించి క్రమం తప్పకుండా బోధనా సిబ్బందిని నియమించి మౌలిక వసతులను కల్పించి విద్యా ప్రమాణాలను పెంచి విశ్వవిద్యాలయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాల పైనే ఉన్నది. ఆ విధంగా ప్రభుత్వాలు ఆలోచన చేసి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను కాపాడుతాయని ఆశిద్దాం.**



డాక్టర్ తిరుణహరి శేషు

విద్యా వ్యవస్థలో విశ్వవిద్యాలయాలకు ఒక ప్రత్యేక గౌరవం ఉంది. విజ్ఞాన కర్మాగారాలుగా బోధనలో పరిశోధనలో నూతన ఆవిష్కరణలకి విశ్వవిద్యాలయాలు వేదికలుగా నిలబడ్డాయి. ఇటీవల కొత్త నలంద విశ్వవిద్యాలయ క్యాంపస్‌ని ప్రారంభిస్తున్న సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంఅంటే ఒక గౌరవం, విలువ, అద్భుతమని చెప్పారంటే విద్యా వ్యవస్థలో విశ్వవిద్యాలయాలకి ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతుంది. విజ్ఞానాన్ని విశ్వవ్యాప్తం చేసే విశ్వవిద్యాలయాలను కాపాడుకోవటం ఒక సామాజిక బాధ్యతగానే చూడాలి. ఒకనాడు అద్భుతాలు సృష్టించిన విశ్వవిద్యాలయాలు ప్రభుత్వాల అలసత్వం వలన నేడు తమ పూర్వ వైభవాన్ని కోల్పోతున్నాయి. 2024 నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) జాబితాలో మొదటి పది స్థానాలలో దేశంలో ఏ ఒక్క విశ్వవిద్యాలయం స్థానం దక్కించుకోలేకపోయిందంటే విశ్వవిద్యాలయాల ప్రమాణాలు ఏస్థాయిలో పడిపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఎన్ఐ ఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో మొదటి వంద ర్యాంకులలో తెలంగాణ రాష్ట్రం నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సియు) 28వ ర్యాంక్ ఉస్మానియా విశ్వవిద్యాలయం 43వ ర్యాంకును దక్కించుకున్నాయి. గత కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం నుండి విశ్వవిద్యాలయాలకు సహకారం దక్కక పోవటం వలన విశ్వవిద్యాలయాలు తమ పూర్వ వైభవాన్ని కోల్పోతున్నాయనే చెప్పాలి. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం కేటాయించిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే ఆరోపణలు, విశ్వవిద్యాలయాలకు చెందిన భూములను ప్రభుత్వాలు ఇతరత్రా అవసరాలకు వినియోగించటంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరుఎత్తినట్టుగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీదా! తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్నిదా! అనే వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆ భూమిని తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చరల్ కార్పొరేషన్ (టిజిఐఐసి) ద్వారా అభివృద్ధి చేసి పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించాలనే ప్రభుత్వ నిర్ణయం పట్ల హెచ్‌సియు విద్యార్థుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తంమవుతుంది. విశ్వవిద్యాలయానికి చెందిన 400 ఎకరాల భూమిని కేంద్రప్రభుత్వ సహకారంతో నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2004లో ఐ ఎం జి భారత్ అకాడమీ ప్రైవేట్ సంస్థకి అప్పగించడం జరిగింది. బదులుగా రాష్ట్ర ప్రభుత్వం గోపనపల్లి వద్ద 397 ఎకరాల భూమిని హెచ్ సియుకి అప్పగించారు. ఎన్నికలకి ముందు



నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విలువైన విశ్వవిద్యాలయ భూమిని హడావుడిగా ప్రైవేట్ సంస్థకి కట్టబెట్టటానికి తీసుకున్న నిర్ణయాన్ని 2006లో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూఐఎంజి సంస్థ కోర్టులను ఆశ్రయించటం 2024లో హైకోర్టు సుప్రీం కోర్టులు ఐఎంజి సంస్థకి కేటాయించిన భూమిని ప్రభుత్వానికి చెందిన భూమిగానే తీర్పుఇవ్వటంతో కంచ గచ్చిబౌలి లోని 400 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న 400ఎకరాల భూమి పై యాజమాన్య హక్కు ఎవరిది? అనేది ఒక వివాదం అయితే స్వాధీనం చేసుకున్న భూమిపై ఉన్న జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తూ పర్యావరణానికి నష్టం చేసే విధంగా ప్రభుత్వం ఆ భూమిని వినియోగంలోకి తేబోతుంది? అనేది మరొక అభ్యంతరం. జై తెలంగాణ, జై ఆంధ్ర ఉద్యమాల నేపథ్యంలో 6 పాయింట్ ఫార్ములాలో భాగంగానే 1973 లో హెచ్ సియు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం 2300 ఎకరాల భూమిని కేటాయించింది ఆ కేటాయించిన భూమిలో నుండే 2004లో రాష్ట్రప్రభుత్వం 400 ఎకరాల భూమిని తీసుకొని ఐఎంజి సంస్థకి కేటాయించింది కాబట్టి సాంకేతికంగా కోర్టు తీర్పులు ప్రభుత్వ భూమిగా పరిగణించినా ఆ భూమి విశ్వవిద్యాలయానికి చెందినదే అని విద్యార్థులు విశ్వవిద్యాలయ అధికారుల వాదన. 400ఎకరాల భూమి విషయంలో విశ్వవిద్యాలయ విద్యార్థుల నుండి పర్యావరణ వేత్తల నుండి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఇలాంటి సున్నితమైన విషయంలో ప్రభుత్వం పట్టుదలకు పోకుండా పునరాలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నాటి ప్రభుత్వం విశ్వవిద్యాలయాల నుండి సేకరించిన భూమి తిరిగి విశ్వవిద్యాలయానికి కేటాయించటం సమంజసం. ఈ విషయంలో ప్రభుత్వం వెనుకకు తగ్గటం అంటే ప్రభుత్వం ఓడిపోయినట్టు కాదు ప్రజా ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి విలువ ఇచ్చి తననిర్ణయాన్ని పునఃసమీక్ష చేసుకున్నట్లుగానే భావించాలి. గతప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ భూములను వాడుకోవాలని భావించినప్పుడు విద్యార్థుల నుండి వచ్చిన వ్యతిరేకతతో ప్రభుత్వం తన ఆలోచనను విరమించుకున్న విషయాన్ని గమనించాలి. కాకతీయ విశ్వవిద్యాలయంతో పాటు రాష్ట్రంలోని అనేక విశ్వవిద్యాలయాల భూములు అన్యాక్రాంతమవుతున్నాయి కాబట్టి విశ్వవిద్యాలయాల భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. విశ్వవిద్యాలయాలు విద్యా కేంద్రాలుగా మాత్రమే కాదు అవి ప్రకృతి వనరులు, పర్యావరణ పరిరక్షణ కేంద్రాలుగా ప్రభుత్వాలు గుర్తించాలి. 400 ఎకరాల భూమికి సంబంధించిన వివాదాన్ని సృష్టించింది విశ్వవిద్యాలయం కాదు, విద్యార్థులు కాదు అలాగే పర్యావరణాన్ని రక్షించేవిధంగా అభివృద్ధి జరగాలని రాహుల్ గాంధీ ఆలోచన కాబట్టి అందరికీ ఆమోద యోగ్యమైన పరిష్కారాన్ని సూచించవలసిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదే. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగాప్రభుత్వ విశ్వవిద్యాలయాలను తీర్చిదిద్ది బడ్జెట్ నిధులను కేటాయించి క్రమం తప్పకుండా బోధనా సిబ్బందిని నియమించి మౌలిక వసతులను కల్పించి విద్యా ప్రమాణాలను పెంచి విశ్వవిద్యాలయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాల పైనే ఉన్నది. ఆ విధంగా ప్రభుత్వాలు ఆలోచన చేసి ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను కాపాడుతాయని ఆశిద్దాం. ●

# జలకాలుష్యంతో మానవాళికి ముప్పు

డాక్టర్. పి.ఎస్. చారి

నదులు పర్యావరణ వ్యవస్థకు కీలకమైనవని. అవి వరద నియంత్రణ, వాతావరణ మార్పు, జీవ వైవిధ్యానికి కూడా సహాయపడతాయి. కానీ ప్రపంచ వ్యాప్తంగా నదులు ప్రమాదంలో ఉన్నాయి. వాతావరణమార్పు, బాధ్యతారహిత అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల అవి మరింతగా విచ్ఛిన్నం, కలుషితమవుతూ బలహీనపడుతున్నాయి. నదులు ప్రమాదంలో ఉన్నప్పుడు, మన సమిష్టి భవిష్యత్తు కూడా అంతే ప్రమాదంలో ఉంది. ఆరోగ్యకరమైన నదులు, పరిశుభ్రమైన నీటిని పొందడం మనందరినీ కలిపే ప్రాథమిక మానవ హక్కులు. మంచినీటి జాతులు 1970నుండి 83 శాతం క్షీణతను చూశాయి. ఇది భూసంబంధమైన లేదా సముద్ర వాతావరణాలలో అనుభవించిన క్షీణత రేటు కంటే రెండింతలు. ప్రపంచవ్యాప్తంగా నదుల క్షీణత, కాలుష్యం ఒక ముఖ్యమైన పర్యావరణ సమస్య. ఇది ప్రధానంగా పారిశ్రామికవ్యర్థాలు, శుద్ధిచేయని మురుగునీరు, వ్యవసాయ ప్రవాహం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పట్టణీకరణ, అటవీ నిర్మూలన, తగ్గిన నీటివడపోత పెరిగినకోత, వాతావరణ మార్పు మొదలైన కారణాల వల్ల సంభవిస్తుంది. గంగా, యమునా సిటారమ్, యాంగ్జీ మతం జారియాచులో నది వంటి ప్రధాన నదులు ప్రపంచవ్యాప్తంగా అత్యంత కలుషితమైనవిగా పరిగణించబడుతున్నాయి. ఇవి తరచుగా కలుషితమైన నీటి వనరుల కారణంగా జీవవైవిధ్యం కోల్పోవడం, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు, పర్యావరణ అంతరాయం, జలజీవులు మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. వాతావరణ మార్పు, భూ వినియోగం వల్లప్రపంచవ్యాప్తంగా 402 బేసిన్లలో నదీ ప్రవాహం తగ్గింది. ఇది2000 సంవత్సరం నుండి ఐదురెట్లు పెరుగుదల. పరిశోధకులు 89 దేశాలలో 75,000 కంటే ఎక్కువ నీటివనరులను సర్వేచేశారు. 40శాతానికిపైగా తీవ్రంగా కలుషితమైందని కనుగొన్నారు. ఒక నివేదిక ప్రకారం 90దేశాలు, ముఖ్యంగా ఆఫ్రికా, మధ్య, ఆగ్నేయాసియాలో నదీ క్షీణతను ఎదుర్కొంటున్నాయి. 2030నాటికి మానవాళిలో సగానికిపైగా కరువు, వరదలు, మురుగు నీటికాలుష్యం, తగినంత నీటినాణ్యత లేని దేశాలలో నివసిస్తారు. 47 దేశాలు అంతర్జల వనరుల నిర్వహణనిపూర్తిగా చేరుకున్నాయి. 63దేశాలు అంతర్జల వనరుల నిర్వహణ అమలును వేగవంతం చేయాలి. అయితే 73 దేశాలు అంతర్జల వనరుల నిర్వహణ కోసం పరిమిత సామర్థ్యాన్ని మాత్రమే కలిగి ఉన్నాయి. ప్రస్తుత పురోగతి రేటు ప్రకారం, ప్రపంచం 2049 నాటికి స్థిరమైన నీటి నిర్వహణను సాధిస్తుంది. దీనిఅర్థం 2030 నాటికి 100 కంటే ఎక్కువ దేశాలలో కనీసం 3.3 బిలియన్ల మంది ప్రజలు నీటి డిమాండ్లను సమతుల్యం చేయడానికి అసమర్థమైన పాలనను కలిగిఉండే అవకాశం ఉంది. భారతదేశంలో నదీకాలుష్యం నిర్వహణ భారతదేశంలో కూడా నదీ క్షీణత కాలుష్యం ఒకముఖ్యమైన పర్యావరణ సమస్య. ప్రధానంగా శుద్ధిచేయని మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలు సరికాని వ్యర్థాలను పారవేయడం వల్ల ఇది సంభవిస్తుంది. దీనివలన కలుషితమైన నీరు మానవ వినియోగానికి పనికిరాకుండాపోతుంది. గంగా యమునా వంటి ప్రధాన నదులలో జలచరాలకు హాని కలిగిస్తుంది. 60శాతం కంటే ఎక్కువ మురుగునీరు నేరుగా నదులలోకి విడుదలవుతుంది. ఇదిదేశవ్యాప్తంగా తీవ్రమైన కాలుష్య సమస్యలకు దోహదం చేస్తుంది. భారతదేశంలోని ప్రధాన నగరాలురోజుకు 38,354 మిలియన్లీటర్ల మురుగు నీటిని ఉత్పత్తి చేస్తాయి. కానీ పట్టణ మురుగు నీటిశుద్ధి సామర్థ్యం 11,786మాత్రమే. భారతదేశంలో సగటు వార్షిక వర్షపాతం దాదాపు 4000 బిలియన్ క్యూబిక్ మీటర్లు అయినప్పటికీ, మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల దాదాపు 1122 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటివనరులు మాత్రమే వినియోగానికి అందుబాటులో ఉన్నాయి. కాలుష్యం నీటి నాణ్యతను క్షీణింపజేస్తుంది. కాబట్టి ఈనీటిలో ఎక్కువభాగం సురక్షితం కాదు. నీటికాలుష్యం భారతీయ వినియోగదారులకు, దాని పరిశ్రమకు వ్యవసాయానికి అందుబాటులోఉన్న నీటి మొత్తాన్ని తీవ్రంగా పరిమితం చేస్తుంది. భారతదేశంలో నదీ నిర్వహణను ప్రధానంగా జలశక్తి మంత్రిత్వశాఖ పర్యవేక్షిస్తుంది. ప్రధానంగా భారతదేశంలో అత్యంత కలుషితమైన నదులలో ఒకటైన గంగాను శుభ్రపరచడం, పునరుజ్జీవింప జేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఐక్యరాజసమితి జనరల్ అసెంబ్లీ 2021-2030ని పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ దశాబ్దంగా ప్రకటించింది. ●

# భారీ దిగుమతులతో నష్టాల్లో కోకో రైతులు

కె. శ్రీనివాస్

ఆంధ్రప్రదేశ్‌లో 75 వేల ఎకరాలలో కోకో తోటల సాగు ఉంది. ఏలూరుజిల్లాతో పాటు తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో కోకో అంతర పంటగా ఉంది. ప్రపంచ కోకో ఉత్పత్తిలో మన దేశం ప్రపంచంలో 20దేశాల్లో 20వ స్థానంలోఉంది. మన దేశ అవసరాలకు తగిన విధంగా ఇక్కడ ఉత్పత్తి లేదు. 80 శాతం కోకోను ఇతర దేశాల నుండి మన దేశం దిగుమతి చేసుకుంటున్నది. ప్రపంచ కోకోఉత్పత్తిలో 70శాతం ఘనా, ఐవరీ కోస్ట్, నైజీరియా, కామెమాన్ వంటి పశ్చిమ ఆఫ్రికా దేశాలదే. ఘనా, ఇండోనేషియా దేశాల నుండి మనం అత్యధికంగా కోకోను దిగుమతి చేసుకుంటున్నాం. కోకోను చాక్లెట్లు, కేకులు, వివిధ ఆహార పదార్థాల తయారీలో ఉపయోగిస్తున్నారు. మనం ఉత్పత్తి చేసిన కోకో గింజలను కంపెనీలు కొనుగోలు చేస్తున్నాయి. మన రాష్ట్రంలో మోండలీజ్ (క్యాడ్బరీ) ప్రధాన కొనుగోలు కంపెనీగాఉంది. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇస్తున్నామని కంపెనీలు చెబుతున్నాయి. గత సంవత్సరం కంపెనీలు పోటీపడి అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కిలో గింజలను రూ.1040/ వరకు కొనుగోలు చేశారు. గత సంవత్సరం రైతుకు కిలో కోకో గింజలకు సరాసరి ధర రూ.749లు వచ్చింది. రాష్ట్రంలో 1992 నుండి కోకోతోటల సాగు ఉన్నా ఈవిధంగా ధర వచ్చిన సందర్భాలు లేవు. ఎన్నో కష్టనష్టాలకు గురై రైతులు కోకో గింజలు ఉత్పత్తి చేస్తున్నారు. ఈ సంవత్సరం కంపెనీలు సిండికేట్‌గా మారి అంతర్జాతీయ ధర ఇవ్వడం లేదు. పైగా అన్ సీజన్ (వర్షాకాలపు) గింజలు కొనుగోలు చేయడం లేదు. సీజన్ కోకో గింజలు ధర రోజురోజుకీ తగ్గించి వేస్తున్నారు. కంపెనీలు ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంది. మార్చి 6న ఏలూరు కలెక్టరేట్ ముందు వందలాది మంది కోకో రైతులు మహాధర్నా నిర్వహించారు. గుంటూరులోని ఉద్యానశాఖ కమీషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రాలు అందజేశారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇచ్చి కోకో గింజలు కొనుగోలు చేయాలని, పాత గింజలు వెంటనే కొనాలని, కంపెనీలు రైతులను పెడుతున్న ఇబ్బందులను తదితర సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోకో రైతులు కోరినా కంపెనీలు కనీసంగా పట్టించుకోలేదు. కోకో రైతులు సంఘటితంగా లేకపోవడం వలన కంపెనీలు సిండికేట్‌గా మారిఇబ్బంది పెడుతున్నాయి. కంపెనీలు రైతులను ఇబ్బందులు పెట్టే ధోరణితోనే ఉన్నాయి. పాత గింజల కొనుగోలుపై కంపెనీలు స్పష్టత ఇవ్వడం లేదు. కంపెనీలు మాత్రం అన్ సీజన్ గింజలు కొనలేమని, నాణ్యత లేదని బుకాయిస్తూ రోజురోజుకీ ధర తగ్గించి వేస్తున్నాయి. అధికారులు, ప్రభుత్వం కూడా కంపెనీలు కొనాలని గట్టిగా చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవేళ చెప్పినా కంపెనీలు మాత్రం తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇంతకుముందు లేని గ్రేడింగ్ విధానాన్ని ముందుకు తీసుకు వచ్చారు. నాణ్యతాప్రమాణాలు గురించి మాట్లాడుతున్నారు. కంపెనీలు కొత్త గింజలు కొంటామని పాత గింజలు కొనలేమని చెప్పడం అన్యాయం. కొత్త గింజలు రూ.650 నుండి రూ.600 లకు ఇప్పుడు రూ. 550 లకు, రూ.500లకు ధర తగ్గించారు. ఈ ధర మరింత తగ్గిస్తామని కంపెనీలు రైతులను బెదిరిస్తున్నాయి. అన్ సీజన్ గింజలను రూ.200 నుండి రూ.240 లకు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ



కొనుగోలు కూడా నామ మాత్రమే. కోకో పంటను అత్యధికంగా సాగుచేస్తున్న ఏలూరు జిల్లాలోని ఒక్క పెదవేగి మండలంలోనే 500 టన్నుల వరకు అన్ సీజన్ (పాత గింజలు) రైతుల వద్ద నిల్వ ఉన్నాయి. మొత్తంగా 2 వేల టన్నుల వరకు పాత కోకోగింజలు రైతులు వద్దనే ఉండిపోయాయి. అన్ సీజన్, సీజన్ గింజలకు కొద్ది తేడా ఉన్నా ఇప్పటివరకు కంపెనీలు అవేమీ పట్టించుకోకుండా కొద్ది తేడాతో కొనుగోలు చేశాయి. ప్రస్తుతం పాత గింజలు కొనుగోలు చేయడం లేదు. అక్కడక్కడ కొనుగోలు చేసినా చాలా తక్కువ ధర ఇస్తున్నాయి. రైతులు గత్యంతరం లేక అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుల వద్దనున్న గింజలు కొనుగోలు చేయకుండా వివిధ కంపెనీల ప్రతినిధులు, గింజల కొనుగోలుదారులు ఫోన్లు కూడా ఎత్తడం లేదు. ఇంటింటికి వచ్చి రైతులను బ్రతిమలాడి కోకో గింజలు కొనుగోలు చేసిన ట్రేడర్లు, కంపెనీల ప్రతినిధులు మొఖం చాటేస్తున్నారు. పైగా నిల్వ ఉంచిన గింజలను 'పచ్చళ్లు పట్టుకోండి' అంటూ రైతులను ఎగతాళి చేస్తూ అవమానిస్తున్నారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇటీవల ఎరువులు, పురుగు మందులు ధరలు, కూలీ ఖర్చులు పెరిగాయి. కోకో గింజలు ధర పెరిగిన తర్వాత కౌలురేట్లు పెరిగాయి. ప్రస్తుతంఎకరా కోకో తోటలకు రూ.లక్ష నుండిరూ.లక్ష 50వేల వరకు కౌలు ఉంది. ఎకరాకు ఎరువులు, పురుగు మందులు, కూలీఖర్చులు రూ.60వేల వరకు ఖర్చు అవుతున్నాయి. ప్రస్తుతం కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నా రు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కంపెనీలు సిండి కేట్‌గా మారి రైతులను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం తగినంతగా జోక్యం చేసుకోకపోతే కోకో రైతులు తీవ్రసంక్షోభంలో కూరుకుపోతారు. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కంపెనీలు రైతుకు తగిన ధర ఇవ్వడంలేదు. కాబట్టి వ్యత్యాసపు ధరప్రభుత్వం చెల్లించే విధంగా రైతును ఆదుకునే విధంగాచర్యలు చేపట్టాలి. మన దేశ అవసరాలకు లక్షా20వేల టన్నుల అవసరం కాగాఇక్కడ దేశీయంగా ఉత్పత్తి జరుగుతున్నది 35 వేల టన్నులు మాత్రమే. మిగిలిన కోకోను దిగుమతి చేసుకుంటున్నాము. కోకో గింజల కంటే కోకో పొడి, బట్టర్ రూపంలో అత్యధికంగా దిగుమతులు జరుగుతున్నాయి. కంపెనీలు తమకు కావలసిన కోకోను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుని ఇక్కడ కోకో రైతులను ఇబ్బందులు గురిచేస్తున్నాయి. ఎగుమతులు దిగుమతులు విధానంవలన కోకో రైతులు నష్టపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం వైపు నుండి తగిన జోక్యం లేదు. విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదలకు ఎటువంటి చర్యలు చేపట్టడంలేదు. ఫలితంగా దేశీయంగా రైతు నష్టపోవాల్సివస్తోంది. బహుళజాతి కంపెనీల కబంధహస్తాల్లో కోకో రైతు నలిగిపోతున్నాడు. ధర గురించి అడిగితే అధికారులు సప్లై డిమాండ్ సూత్రం చెబుతున్నారు. 80శాతం కోకోనుదిగుమతి చేసుకుంటున్న మనదేశంలో సప్లైఉన్నట్లా లేనట్లా? డిమాండ్ ఉన్నది గానీ సప్లైలేదు. మరి ఈ పరిస్థితుల్లో కోకో రైతుకు మెరుగైన ధర రావాల్సిన అవసరంఉంది. ఎందుకు రావడం లేదో సమాధానం లేదు. గత సంవత్సరం ఘనాలో పంట దెబ్బతిని దిగుబడులు లేవు కాబట్టి అంతర్జాతీయంగాకోకోకు డిమాండ్ పెరిగింది. ఈ సంవత్సరం ఆఫ్రికన్ దేశాల్లో దిగుబడులు పెరిగాయి కాబట్టి ధరతగ్గిందని చెప్తున్నారు. అయినా ప్రస్తుతం కిలో కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర రూ.700వరకు ఉంది. ఈధర రైతుకు రావడం లేదు. పైగా కంపెనీలు రైతులనుండి గింజలు కొనుగోలు చేయడం లేదు. ఇక్కడ రైతులు సంఘటితంగా లేకపోవడం వలన కంపెనీలు రైతులను నిలువుగా దోచుకుంటున్నాయి. కోకో గింజలకు కేంద్రప్రభుత్వం కనీసం మద్దతుధర ప్రకటించడం లేదు. ●

## అంబేద్కర్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా భీమ్ సేవా సమితి, భీమ్ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగమూరు రోడ్డు మర్రిచెట్టు వద్ద మైదానంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ యువతలో ఉన్నతభావాలు తెస్తుందని ఆశిస్తున్నామని, అంబేద్కర్ ఆలోచనా విధానంతో సమాజ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. పోటీలను దాసరి కోటేశ్వరరావు, ఎం.ఆదినారాయణ, శ్రీనివాసులు, కృపారావు, అల్లూరయ్య, అంగలకుర్తి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

## కనిగిరి పట్టణ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఎస్పీకి వినతి

**కనిగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణ పోలీసు స్టేషన్‌లో గురువారం ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. అనంతరం కనిగిరి పట్టణంలో రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యలపై ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు అదనపు సిబ్బంది నియామకం అవసరమని, రహదారి విస్తరణ, ట్రాఫిక్ సిగ్నల్స్ అమలు తదితర చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ కోరారు. వినతిని సానుకూలంగా స్వీకరించిన ఎస్పీ దామోదర్, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువ న్యాయవాది షేక్ సుమైయిర్ పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



ఎపి రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలు ఈనెల 20,21 తేదీలలో విజయవాడలోని కొండపల్లిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వృత్తి చెరువులపై భూమి హక్కులు, గ్రామాలలో శ్రమకు తగిన వేతనం, పట్టణాలలో కనీస వేతన చట్టం అమలు, దోబీ ఘాట్‌ల నిర్మాణం, దోబీ పోస్టుల భర్తీ, సామాజిక రక్షణ చట్టం అంశాలపై మహాసభలలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో టంగుటూరి రాము, రమణమ్మ, డాక్టర్ కృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఖర్చులతో విగ్రహం ఏర్పాటు చేయాల్సిందే

- నగర కాంగ్రెస్ అధ్యక్షులు తురకపల్లి నాగలక్ష్మి డిమాండ్

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



క్లౌపేట చౌరస్తాలో రాజీవ్‌గాంధీ విగ్రహం తొలగించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని నగర కాంగ్రెస్ అధ్యక్షులు తురకపల్లి నాగలక్ష్మి అన్నారు. స్థానికంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ముందస్తు సమాచారం లేకుండా విగ్రహం తొలగింపు దారుణమని, శాస్త్ర సాంకేతిక రంగాలలో దేశాన్ని అగ్రగామిగా నిలిపిన రాజీవ్‌గాంధీ పట్ల గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. కక్షపూరిత రాజకీయాలను సహించేది లేదని, మే 21 రాజీవ్‌గాంధీ వర్ధంతిలోగా ప్రభుత్వ ఖర్చులతో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## చైర్మన్ హోదాలో సమావేశం నిర్వహించిన ఎంపి మాగుంట

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



ఢిల్లీలోని పార్లమెంట్ భవనం కమిటీ హాలులో గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ చైర్మన్ హోదాలో ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి సభ్యులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్‌సిఆర్‌టిసి పాత్రపై స్టాండింగ్ కమిటీ 2024-25 ముసాయిదా నివేదిక, ఆమోదం చర్చించి అమృత్‌పై మంత్రిత్వ శాఖ ప్రతినిధుల వివరణ తీసుకున్నారు.

## హత్యాయత్నం కేసులో ఐదుగురు అరెస్టు

- సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌ను హత్యచేసేందుకే కత్తితో దాడి
- ఇంటి స్థలం వివాదమే హత్యాయత్నంకు కారణం

**చీరాల రూరల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



చట్టాన్ని చేతిలోకి తీసుకొని క్షణికావేశంలో నేరాలకు పాల్పడే వారిని చట్టపరంగా జైలుకు పంపిస్తామని డీఎస్పీ మహమ్మద్ మొయిన్ అన్నారు. గత నెల 30వ తేదీన చీరాల మండలం గనివారిపాలెం గ్రామంలో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ చిదరబోయిన నాగేశ్వరరావు అనే వ్యక్తి పై అదే గ్రామానికి చెందిన పలువురు హత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ కేసులో 5 గురు నిందితులను ఈపురుపాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయంపై రూరల్ సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈపురుపాలెం ఎస్సై చంద్రశేఖర్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మొయిన్ మీడియాకు వివరాలు వెల్లడించారు. చీరాల మండలం గనివారిపాలెం గ్రామానికి చెందిన చిదరబోయిన నాగేశ్వరరావు ఢిల్లీలోని ఆగ్రాలో సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అయితే అదే గ్రామంలో నివాసం ఉంటున్న నాయనమ్మ రాములమ్మ ఇంటికి సెలవులపై రావడం జరిగింది. కాగా గత నెల 28న పాత ఇల్లు పడేసి అదే స్థలంలో కొత్త ఇల్లు కట్టుకుంటున్న రాములమ్మతో అదే గ్రామానికి చెందిన చిదరబోయిన లక్ష్మీ నారాయణ అతని కొడుకు భరత్ కుమారన, సోదరుడైన వీరయ్యలను రైల్వే పోలీసుగా పని చేస్తున్న మేనల్లుడు పి.లక్ష్మీనారాయణ తరచుగా ఇంటి సరిహద్దుల విషయంలో రాములమ్మతో తలెత్తున్న ఘర్షణలో వారికి సలహాలు ఇస్తూ అవసరమైతే వాళ్ళను చంపటానికి కూడా వెనకాడవద్దని ప్రోత్సహిస్తూ ఉండేవాడు అన్నారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న చిదరబోయిన నాగేశ్వరరావు తన నాయనమ్మ రాములమ్మ ఇంటి విషయంలో జోక్యం చేసుకుని ముద్దాయిల మీదకి రావడం జరిగిందన్నారు. అది మనసులో ఉంచుకొని బాపట్ల కర్లపాలెంలో ఉంటున్న తన మేనల్లుళ్ళులు గొర్ల వేణు, వెంపరాల కుమారస్వామిల మద్దతు కోరి ఎలాగైన సరే చిదరబోయిన నాగేశ్వరరావును అంతమొందించి రాములమ్మ వద్ద నుండి స్థలం తీసుకోవాలని పక్కా పథకం రచించారన్నారు. అందులో భాగంగా గత నెల 30వ తేదీన ఉదయం గవినివారిపాలెంలో వాకింగ్‌కు వెళ్లి వస్తున్న నాగేశ్వరరావును చంపేందుకు అదే అదునుగా భావించి తాటి ముంజికాయల కత్తితో నరకటంతో పాటు ఇనుప పైపుతో కొట్టారన్నారు. అది గమణించిన చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకునే లోపు ముద్దాయిలు పరారయ్యారని అన్నారు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా వైద్యశాలకుతరలించి చికిత్స అందించారని మెరుగైన వైద్యం గుంటూరు ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు. జరిగిన ఘటన గురించి తెలుసుకున్న ఎస్పీ తుషార్ డూడి డీఎస్పీ మొయిన్, చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు, ఐదుగురు పోలీసు సిబ్బందితో బృందంను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. దర్యాప్తులో భాగంగా ఘటన జరిగిన రోజు కావూరివారిపాలెం జంక్షన్ వద్ద కత్తిని పొదల్లో పడేసివిజయవాడ వెళ్లి ద్వారక తిరుమల వెళ్లారన్నారు. అయితే పోలీసులు ద్వారకా తిరుమల వచ్చారని పసిగట్టిన ముద్దాయిలు కేసు విషయమై లాయర్‌తో మాట్లాడేందుకు తిరిగి వచ్చి కత్తి పడేసిన ప్రాంతానికి దాన్ని పోలీసులకు కనపడకుండా చేద్దామని వెళ్ళిన తరుణంలో పోలీసుల కంటపడ్డారన్నారు. దీంతో వెంటనే లక్ష్మీనారాయణ, వీరయ్య, భరత్ కుమార్,గొర్ల వేణు, కుమారస్వామిలను అరెస్టు చేశామని అయితే పిన్నెబోయిన లక్ష్మీనారాయణ పరారీలో ఉన్నాడన్నారు. వారి వద్ద హత్య చేసేందుకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నేపథ్యంలో హత్యాయత్నం జరిగిన గైనవారిపాలెం గ్రామంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. సందర్భంగా గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అదే విధంగా వేసవి కాలం వచ్చిన తరుణంలో ప్రజలు ఆరు బయట నిద్రిస్తారు, కావున దొంగలు పడే అవకాశం ఉంటుందని జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రస్తుతం మిస్సింగ్ కేసులు ఎక్కువ నమోదు అవుతున్నాయన్నారు. కారణం పిల్లలు సెల్ ఫోన్లు ఎక్కువగా చూస్తూ ప్రేమ పేరుతో జీవితాలు పాడు చేసుకుంటున్నారు. కావున తల్లిదండ్రులు వారి పైన నిఘా ఉంచి వారిని సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత వారిదేనన్నారు. కేసును త్వరగా ఛేధించినందుకు జిల్లా ఎస్పీ తుషార్ డూడి డీఎస్పీ మొయిన్, సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్, సిబ్బందిని అభినందించారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## కలెక్టర్ అన్సారియాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ ఉద్యోగులు

**ఒంగోలు, ప్రభాతవార్త**



బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహణకు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకి స్కోచ్ నిర్వాహకుల చేతుల మీదుగా ఢిల్లీలో అవార్డు ప్రధాన ఉత్సవం జరిగింది. ఈ సందర్భంలో ప్రకాశం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘ సభ్యులు కలెక్టర్‌ని కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, భూపాల్‌రెడ్డి, రజిత, మానస, పట్టణ అధ్యక్షులు మోటా శ్రీనివాసరావు, శ్రీకాంత్‌రెడ్డి, గౌరి, బాబురావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్‌కు ఈకేవైసీ గండం

- ఈనెల 30వరకు గడువు పెంపు
- పూర్తి కాకుంటే రేషన్‌తో పాటు సంక్షేమ పథకాలు కట్

**ఒంగోలు, ప్రభాతవార్త**

సంక్షేమ పథకాలు అమలు చేయడంలో మీనవేషాలు లెక్కిస్తున్న కూటమి ప్రభుత్వం ఉన్న వాటిని తొలగించేందుకు రంగం సిద్దం చేస్తుంది. ఇందులో భాగంగా పేదలపై ఎలక్ట్రానిక్, నో యువర్ కస్టమర్(ఈకేవైసీ) అస్త్రాన్ని సందించింది. ఈనెల 30వ తేదీ లోగా రేషన్ కార్డుదారుల్లో వేలిముద్రల పక్రియ పూర్తి చేయాలని హుకుం జారీ చేసింది. ఈ పక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడం వెనుక రేషన్‌లో కోత విధించాలనే దురుద్దేశంతో ఉందని విషయం తేటతెల్లం అవుతుంది. రైస్ కార్డు, ఈకేవైసీ చేయించుకునే వారికి వచ్చిన రేషన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాల్లో కోత విధించే అవకాశం ఉందని ప్రచారం విస్తృతంగా సాగుతుంది. రేషన్ కార్డుల్లో ఈకేవైసీ నమోదు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈకేవైసీ లేకపోతే సరుకులు కట్ అవుతాయని ప్రచారం వల్ల పిల్లలు, పెద్దలు, వృద్దులు వేలిముద్రలు పడని వారు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. సచివాలయాలు, మీ సేవ, ఆధార్ నమోదు కేంద్రాల వద్ద ప్రజల తాకిడి ఎక్కువైంది. మరో పక్క సర్వర్ సమస్య వల్ల మందకోడిగా ఈకేవైసీ జరుగుతుంది. జిల్లాలో 6లక్షల 61వేల రేషన్ కార్డులు ఉండగా వాటిల్లో 19.35లక్షల మంది సభ్యులు ఉన్నారు. అందులో ఇప్పటి వరకు 17లక్షల 31వేల మంది ఈకేవైసీ చేయించుకోగా మరో 2 లక్షల మంది చేయించుకోవాల్సి ఉంది. ప్రస్తుతం రేషన్ కార్డు



దారులు ఉన్న పరిధిలోని డీలర్ల ద్వారా ఈకేవైసీ పక్రియను చేపట్టారు. ఈకేవైసీ పేరిట కొంత మంది గ్రామాల్లో వసూళ్లకు పాల్పడుతున్నారు. రేషన్, ఇతర సంక్షేమ పథకాలు ఈకేవైసీతో ముడిపెట్టడంతో కొంత మంది దండుకుంటున్నారు. రేషన్ డీలర్లు, గ్యాస్ డీలర్ల పేరిట ఈకేవైసీ చేయిస్తామని కార్డుదారులకు ఫోన్ చేస్తున్నారు. తాము మీకు దగ్గర్లో ఉన్నామని, రేషన్ కార్డు, ఆధార్ కార్డు పట్టుకుని రావాలని, అలాగే వచ్చేటప్పుడు డబ్బులు కూడా పట్టుకొని రావాలని ఫోన్లో చెప్తున్నారు. దీంతో ఉచితంగా చేయాల్సిన ఈకేవైసీ కొన్ని గ్రామాల్లో డబ్బులు తీసుకుని చేస్తున్నట్లు సమాచారం. ఇతర ప్రాంతాల్లో ఉన్న చిరు ఉద్యోగులు, కూలీ పనులకు వెళ్లిన వారు ఇంటి బాట పడుతున్నారు. గ్యాస్ సబ్సిడీ కూడా ఈకేవైసీ అడ్డంగా నిలిచింది. రేషన్ కార్డు దారులకు ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తుంది. తొలి విడతగా మార్చి31వ తేదీ లోగా జిల్లాలో అన్ని కేటగిరిలలో గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోగా ఇంకా కొంత మందికి ఈకేవైసీ కాకపోవడం, ఇతర సాంకేతిక సమస్యల వల్ల సబ్సిడీ డబ్బులు పడలేదు. రేషన్ కార్డుల్లో ఉన్న సభ్యులంతా ఈనెల 30వ తేదీ లోగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి, ప్రతి రేషన్ డిపోలో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేశామని, ఐదు సంవత్సరాలు లోపు, 80 సంవత్సరాలు దాటిన వాళ్ళకు ఈకేవైసీ అవసరం లేదని జిల్లా పౌరసరఫరాల అధికారులు చెప్తున్నారు. 6 నుంచి 60 సంవత్సరాల లోపు గల కార్డు సభ్యులు రేషన్ డీలర్ వద్ద నమోదు చేసుకోవాలి, డీలర్లు అందుబాటులో లేకపోతే సచివాలయ వీఆర్వో, లేదా తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోను సంప్రదించాలి. సమీపంలోని ఏఎస్‌ఓ కార్యాలయంలోనూ సంప్రదించవచ్చు.




# అన్నివర్గాల అభ్యున్నతికి బ్యాంకర్లు తోడ్పాటు అందించాలి





- జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా

**ఒంగోలు, ప్రభాతవార్త**

బిసి, ఈబీసీ, కాపు యాక్షన్ ప్లాన్ కింద బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసి ఆయా వర్గాల ప్రజల అభ్యున్నతికి తమ వంతు ఆర్థిక తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా, బ్యాంకర్లను కోరారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, బిసి కార్పోరేషన్ అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశమై, బిసి కార్పోరేషన్ ద్వారా బిసి, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఈబిసి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు స్వయం ఉపాధి పథకాల కింద మంజూరు చేసిన వివిధ యూనిట్స్ గ్రౌండింగ్ పురోగతి పై సమీక్షించి పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బిసి, రెడ్డి, క్షత్రియ, కమ్మ, ఈబిసి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, కాపు వర్గాలకు స్వయం ఉపాధి పథకాల కింద 1,864 యూనిట్స్ మంజూరుకు సంబంధించిన దరఖాస్తులను జిల్లాలోని వివిధ బ్యాంకులకు పంపడం జరిగిందన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఈ నెల 9వ తేదీ లోపు సుమారు వెయ్యి యూనిట్స్ గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, బ్యాంకర్లను ఆదేశించారు. ఈ నెల 11వ తేదీన జరిగే మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి రోజున సంబంధిత లబ్దిదారులకు యూనిట్స్ మంజూరు ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, బిసి కార్పోరేషన్ అధికారులను ఆదేశించారు. బ్యాంకర్లు తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేసిన ఆయా పేద వర్గాల ప్రజల అభ్యున్నతికి తమవంతు సహకారం అందించాలన్నారు. ప్రతిబ్యాంకుకు ఇచ్చిన లక్ష్యాల మేరకు పథకాలు మంజూరు చేసి, గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బిసి కార్పోరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, ఎల్.డి.ఎం రమేష్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## ఇంటర్నెట్ మార్పిడి విధానం అధికారిక ఏర్పాటు గురించి ప్రస్తావించిన ఎంపి మాగుంట

**ఒంగోలు టౌన్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



గత ఐదేళ్లలో ఇంటర్నెట్ మార్పిడి విధానాన్ని అధికారికం చేసేందుకు ప్రభుత్వ సర్వే/అధ్యయనం, అభివృద్ధి, అధికారిక నియంత్రణ అథారిటీ ఏర్పాటుకు ట్రాయ్ ప్రతిపాదనల ఆమోదం గురించి పార్లమెంట్ సమావేశాల్లో ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రస్తావించారు. ఇందుకు కేంద్ర సమాచార శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానం ఇస్తూ- డేటా సెంటర్‌లను, కంటెంట్ డెలివరీ నెట్‌వర్క్‌లోను, ఇంటర్నెట్ ఎక్స్చేంజిలను ఏర్పాటు చేయడం ద్వారా ఇంటర్నెట్ మార్పిడి విధానం, డేటా ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించుటకు ఒక నియంత్రణ విధానాన్ని 2022లో, టెలికమ్యూనికేషన్స్ యాక్ట్ క్రింద నెట్‌వర్క్ అధికారాల నిబంధనలు, షరతులపై ఈ ఏడాది ఫిబ్రవరి మాసంలో ట్రాయ్ సిఫార్సు చేసిందని, ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని, పాలసీ విషయం అయినందున నిర్ణీత సమయంలో నిర్ణయించడం కుదరదని తెలిపారు.

# ఖాళీ బిందెలతో నిరసన ర్యాలీ

- మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా
- మౌలిక వసతులపై నిర్లక్ష్యాన్ని విడనాడాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి

**కనిగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



కనిగిరి మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పి.శివకేశవరావు అధ్యక్షతన స్థానిక ప్రజలు, మహిళలు కలిసి ఖాళీ బిందెలతో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బిందెలతో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి,అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీలో 20 వార్డుల ప్రజలు నీటి సమస్య, ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పాలకులు వెంటనే అమలు చేయాలని, అర్హులైన వారందరికి ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే టిడ్కో గృహాలను పూర్తిచేసి లబ్దిదారులకు అప్పగించాలని కోరారు. సీపీఎం కార్యకర్తలు 20 వార్డులలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించి, ప్రజల సమస్యలను సర్వే ద్వారా సేకరించినట్లు కొండారెడ్డి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులకు అందజేస్తామని, వీటి పరిష్కారం కోసం నిర్దిష్టమైన గడువులో చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మున్సిపల్ కమీషనర్ డానియల్ జోసెఫ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించనున్నట్లు పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్‌కే బసీర, ప్రసన్న, నరేంద్ర, పిచ్చయ్య, ఏడుకొండలు, ఆదిలక్ష్మీ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారులు పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి

# సత్వర న్యాయం జరిగేలా చూడాలి

- కొండపి పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ నిర్వహించిన ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్




**కొండపి, ప్రభాతవార్త**

పోలీస్‌స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి కొండేపి పోలీస్‌స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ దామోదర్ తనిఖీచేసారు. ఈ తనిఖీలలో భాగంగా స్టేషన్ పరిసరాలు, వివిధ గదులు, విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరు, డ్యూటీల కేటాయింపు, మహిళా సహాయక కేంద్రం, పలు రికార్డ్స్ పరిశీలించారు. అనంతరం ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ చుట్టూ ఆవరణ పరిశుభ్రంగా, పచ్చదనం ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌ల పరిధిలో లాఅండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరాతీసి పలు సూచనలు చేసారు. పెండింగ్ కేసులలో విచారణ త్వరగతిన పూర్తి చేయాలని, కేసుల విచారణకు చేపట్టవలసిన విధానం గురించి దిశానిర్దేశం చేశారు. ఈ పోలీస్ స్టేషన్ ల పరిధిలో తరుచూ నమోదవుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రధానంగా శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడకూడదని, చెడునడత గలిగిన వారిపై ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా నేరాలు నమోదవుతున్న ప్రాంతాలలో అధికంగా గస్తీ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. దొంగతనాల నివారణకు రాత్రి సమయాల్లో బీట్లు ఏర్పాటు చేసి నియంత్రించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సిబ్బందిని కేటాయించి వాటిని అరికట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఆకస్మిక తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. మహిళా పోలీసులతో మాట్లాడుతూ శక్తి యాప్, మహిళలపై జరిగే నేరాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, రోడ్డు భద్రతా నియమాలు, ఓటిపి ఫ్రాడ్స్, బహుమతుల పేరున జరిగే ఆన్లైన్ మోసాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని మరియు క్రికెట్ బెట్టింగులపై ప్రత్యేక దృష్టిసారించాలి. పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అందరితో మాట్లాడుతూ అందరి యొక్క ఆరోగ్య పరిస్థితులను గూర్చి ఆరాతీశారు. వృత్తిపరంగా, ఆరోగ్యపరంగా, కుటుంబపరంగా ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నది, మొదలైన విషయాలను వారితో ముఖాముఖి మాట్లాడారు. ప్రజలకు సిసి కెమెరాల పట్ల అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. విలేజ్ పోలీస్ అధికారులు తరచు గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతూ ముందస్తు సమాచారాన్ని సేకరించాలన్నారు. క్రికెట్ బెట్టింగ్, శక్తి యాప్, మాదకద్రవ్యాలు, రోడ్డు భద్రత నియమాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, సీసీ కెమెరాల యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియచేసి సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వేసవి కాలం ఆరంభమై ఎండలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో పిర్యాదుదారులకు, పాదచారులు, పట్టణ ప్రజలు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారుల దాహం తీర్చేందుకు కొండేపి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రకాశం జిల్లా ఎస్పీ గారు ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక భాగంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిని మర్యాద పూర్వకముగా చూసి, వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.జిల్లా ఎస్పీ గారు వెంట కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్ బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, కొండేపి సీఐ సోమశేఖర్, కొండేపి ఎస్సై ప్రేమ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.



# ఏపీలో ముస్లిం విద్యార్థులు..

## - కార్పొరేట్ కాలేజీల్లో ఉచితంగా చదువుకోవచ్చు...

**దొనకొండ,ఏఫ్రిల్ 3,ప్రభాతవార్త**

ఏపీ ముస్లిం విద్యార్థులకు ఉచిత విద్యా పథకంఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముస్లిం విద్యార్థులకు ఒక కొత్త పథకాన్ని తీసుకురానుంది. ముస్లిం విద్యార్థులు కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్మీడియట్‌తో పాటుగా రినిని, వినినిగి కోచింగ్ ఉచితంగా చదువుకుంటారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ పథకం అమలు చేయనున్నరు. ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది పదో తరగతి పాసైన విద్యార్థులకు ఒక టాలెంట్ టెస్ట్ నిర్వహించి. అందులో మంచి మార్కులు వచ్చిన విద్యార్థులను ఎంపిక చేసి.. వారికి నచ్చిన కార్పొరేట్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివే అవకాశం కల్పిస్తారు. వారికి రినిని, వినినిగి కోచింగ్ కూడా ఉచితంగా ఇస్తారు.. ఆ ఖర్చు మొత్తాన్ని వక్ఫ్ బోర్డు భరిస్తుంది. దీనికి సంబంధించి కాలేజీల యాజమాన్యాలతో ఇప్పటికే అధికారులు మాట్లాడారు. ఈ పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తారు.. ప్రభుత్వం నిర్వహించే టాలెంట్ టెస్ట్‌లో మంచి మార్కులు తెచ్చుకుంటే చాలు..కార్పొరేటర్ కాలేజీల్లో ఉచితంగాచదువుకునే అవకాశం లభిస్తుంది.

## గ్రామాల్లో రైతులు కందులని దళారులకి అమ్ముకోవద్దు ..



**దొనకొండ,ఏఫ్రిల్ 3,ప్రభాతవార్త**

రైతు సోదరులు తాము పండించిన కందులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మద్దతు ధరకు 7550/కి అమ్ముకోవాలని దళారులకి అమ్ముకోవద్దని మండల వ్యవసాయధికారి వి.లక్ష్మి ్మ నారాయణ కోరారు.కొనుగోలు కేంద్రంలో అమ్ముకున్నట్టితే మంచి ధరతో పాటు డబ్బులు కూడా వెంటనే రెండు రోజుల్లో రైతు బ్యాంకు ఖాతాకు జమ అవుతాయని తెలిపారు. దళారులకి అమ్మి మోసపోవద్దని కోరారు.ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, పడమర కంబం పాడు వారి ద్వారా ఆరవెల్లిపాడు గ్రామం లో ప్రభ్నత్వ తరుపున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కందులు అమ్ముకోవడానికి గతంలో ఈ పంట నమోదు చేసుకున్న రైతులు ఆధార్ కార్డు తీస్కొని వెళ్లి వ్యవసాయ సహాయకులని సంప్రదించాలని కోరారు. ఈ ఖరీఫ్ సీజన్లో 2391 మంది రైతులు 5515 ఎకరాల్లో కంది పంటని సాగు చేశారన్నారు.ఇప్పటివరకు 16 మంది రైతులనుండి 250 క్వింటాలు కందులని కొన్నట్టు కేంద్రం నిర్వాహకులు ఆచారి తెలిపారు. పేర్లు నమోదు చేసుకోక పోతే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి వీలు కాదని తెలిపారు.

## నేటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ ప్రత్యేక క్యాంపులు..

**దొనకొండ,ఏఫ్రిల్ 3,ప్రభాతవార్త**

రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మరలా 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది.పెండింగ్‌లో ఉన్న 06 సంవత్సరాల వయసు గల చిన్నారులందరూ ఈ సదావకాశాన్ని వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 సంవత్సరాల వయసు గల చిన్నారుల్లో 1,95,735 మందికి జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఉండగా, వీరందరూ ఇప్పటి వరకు ఆధార్ నమోదు చేయించుకోలేదు. ఆధార్ నమోదు చేయించుకోని చిన్నారుల్లో అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 12,218 మంది, అత్యల్పంగా అన్నమయ్య జిల్లాలో 4,001 మంది చిన్నారులున్నారు. ఆధార్ క్యాంపులను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయాలని శివప్రసాద్ పిలుపునిచ్చారు.

## రీ సర్వే రెండో విడత అవగాహన ర్యాలీ



**గిద్దలూరు,ఏఫ్రిల్ 3,ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం, సంజీవరావుపేట, ఓబుళాపురం గ్రామములలో ఈరోజు రీ సర్వే రెండో విడత అవగాహన ర్యాలీ మరియు గ్రామ సభ నిర్వహించడం జరిగినది. ఈ యొక్క గ్రామ సభకి మండల తహశీల్దార్ ఆంజనేయ రెడ్డి, మండల సర్వేయర్, వి.ఆర్.ఓలు, గ్రామ సర్వేయర్లుతెలుగుదేశం పార్టీ నాయకులుబుడతమధుసూదన్( జడ్పిటిసి)మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగినది.

## గిద్దలూరులో క్రైస్తవ నిరసన ర్యాలీ

**గిద్దలూరు,ఏఫ్రిల్ 3,ప్రభాతవార్త**




గిద్దలూరు పట్టణంలో పాస్టర్ ప్రవీణ్ మరణంపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని పాస్టర్లు క్రైస్తవ సోదరులు ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పగడాల ప్రవీణ్ కేసులో సరైన దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని పాస్టర్‌ను చంపిన వారికి వెంటనే శిక్షించాలి అని అన్నారు ఈ కార్యక్రమంలో క్రైస్తవ పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

## ఈ నెల 7న మండల సర్వసభ్య సమావేశం

### - ఎంపీడీవో వెంకటరామిరెడ్డి



**రాచర్ల ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

ఈ నెల 7వ తేదీ (సోమవారం) ఉదయం 10:30 గంటలకు మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశం హాలులో మండల ఎంపీపీ షేక్ ఖాసింబి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల ఎంపీడీవో ఎస్ వెంకట్రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సమావేశం ఈనెల 2వ తేదీనే నిర్వహించాల్సి ఉందని కొన్ని అనివార్య కారణాలవల్ల 7వ తేదీకి మార్చవలసి వచ్చిందని అన్నారు 7వ తేదీన జరిగే సర్వసభ్య సమావేశానికి మండల జడ్పిటిసి కో ఆప్షన్ సభ్యులు మరియు ఎంపిటీసీలు సర్పంచులు అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆయన తెలిపారు అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన తెలిపారు. ప్రజా ప్రతినిధులు అడిగే ప్రశ్నలకు కొన్ని శాఖల అధికారులు సరైన సమాధానాలు చెప్పడం లేదని అందుకు కారణం సమావేశానికి క్రింది స్థాయి ఉద్యోగులు రావడమేనని అన్నారు క్రింది స్థాయి ఉద్యోగులకు ఆ శాఖకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియకపోవడం అవగాహన లేకపోవడంతో వారు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్నారని తద్వారా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కాబట్టి ఈ విషయంపై అధికారులు ఆలోచించి తగు నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు సమావేశానికి ప్రతి శాఖకు సంబంధించిన అధికారి తప్పకుండా సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు .

## నేడు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన వివరాలు



**బల్లికురవ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం బల్లికురవ, అద్దంకి పట్టణాలలో పర్యటించనున్నారు. ఉదయం 8.45 గంటలకు, వేమవరం పారిశ్రామికవాడలో హరిబాలాజీ గ్రానైట్స్‌ను ప్రారంబించనున్నారు. ఉదయం 9.30గంటలకు అద్దంకి పట్టణంలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సైకిళ్ళు పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఉదయం 10.30గంటలకు మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం



**తాళ్లూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేతో గ్రామాల్లో ఎన్నో దశాబ్దాల నుంచి ఉన్న భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహశీల్దార్ కొల్లిబోయిన సంజీవరావు అన్నారు. గురువారం వితలాపురం, బెల్లంకొండవారిపాలెం గ్రామాల్లో రీ సర్వేపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. తహశీల్దార్ సంజీవరావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రెండో విడత రీ సర్వేకు మండల పరిధిలో వితలాపురం, బెల్లంకొండవారిపాలెం గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. రైతులు రెవెన్యూ అధికారులకు పట్టాదార్ పాస్ పుస్తకంతో పాటు రికార్డులను చూపించాలని తహశీల్దార్ సూచించారు. సరిహద్దు భూముల రైతులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.జాయింట్ ఎల్‌పీఎంలు కేటాయించవద్దన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి,రీసర్వే డీటీ ప్రశాంత్,మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, వీఆర్వో రమణారెడ్డి, విలేజ్ సర్వేయర్లు, నాయకులు కోట వెంకట రామిరెడ్డి, గూడా ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలి



**తాళ్లూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

వివిధ స్థాయిలో నిర్మాణంలో ఉన్న గృహాలను లబ్దిదారులతో త్వరితగతిన పూర్తి చేయించాలని హౌసింగ్ పీడీ శ్రీనివాసప్రసాద్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం ఆయన గృహ నిర్మాణ శాఖ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గతంలో మంజూరై బేస్మెంట్, రూఫ్, స్లాబ్ స్థాయిల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకొనేందుకు ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. ఎస్సీ, బీసీ లబ్దిదారులకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ఆర్థిక సాయం ఇస్తుందన్నారు. సమావేశంలో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో దారా హనుమంతరావు, హౌసింగ్ ఏఈ హనుమంతరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## దొనకొండలో భారీ వర్షం



**దొనకొండ ,ఏఫ్రిల్ 3,ప్రభాతవార్త**

దొనకొండ మండలంలో గురువారం ఈదురు గాలులతో ,మెరుపులు,ఉరుములతో భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో వాగులు ,కుంటలు నీటితో కళకళలాడు తున్నాయి. ఈ వర్షం ప్రభావంతో రైతులు ఆనంద వ్యక్తం చేశారు. వేసవి కాలం మొదలై వేడు గాలులు ,నీరు లేక పశువుల మేత సరిగా లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో ఈ వర్షప్రభావంతో పశువులకు నీటికి ,పశుమేతకు ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఈ నెల 12 నుండి రంగస్వామి బ్రహ్మోత్సవాలు

### - ఆలయ ఈవో నాగయ్య





**రాచర్ల ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

మండలంలోని జేపీ చెరువు గ్రామానికి పడమటి దిక్కున 9 కిలోమీటర్ల దూరంలో నల్లమల అటవీ ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలో ఈనెల 12వ తేదీ నుండి శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగు తుందని ఆలయ ఈవో (కార్య నిర్వహణ అధికారి) మల్లవరపు నాగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈనెల 12వ తేదీ నుండి 14వ తేదీ వరకు అనగా మూడు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన అన్నారు 12వ తేదీ శనివారం అంకురార్పణ ధ్వజారోహణం శేష వాహనం హనుమంత వాహనం 13వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు శ్రీ స్వామి వారి కళ్యాణం రాత్రి 10 గంటలకు గరుడోత్సవం 14వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీ స్వామివారి తెప్పోత్సవం సాయంత్రం నాలుగు గంటలకు స్వామి వారి దివ్య రథోత్సవం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్ల ప్రక్రియ చురుగ్గా సాగుతోందని త్వరగా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఆయన అన్నారు వేసవి కాలమైనందున ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఆ ప్రభావం తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు భక్తులకు త్రాగునీరు ఆలయంలోని అన్ని సత్రాల్లో భోజన వసతితోపాటు ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులను ఆహ్లాదపరిచేందుకు ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల సాంస్కృతి కార్యక్రమాలు నాటక ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందన్నారు అత్యంత వైభవంగా జరిగే ఈ బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు మన జిల్లా, రాష్ట్రం నుండే కాకుండా ఇతర జిల్లాలు ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా ప్రత్యేక ఏర్పాట్లకు శ్రీకరం చుట్టామని అన్నారు 13వ తేదీ ఆదివారం జరిగే స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనే దంపతులు ఆరోజు ఉదయం 9 గంటల లోపు ఆలయ నిబంధనల ప్రకారం అధికారులు నిర్దేశించిన రుసుం చెల్లించి ఆలయ ఈవో వద్ద రసీదు పొంది కల్యాణంలో కూర్చోవలసి ఉంటుందన్నారు బ్రహ్మోత్సవాల విజయవంతనికి భక్తులు ప్రజలు అధికారులు ప్రజాప్రతినిధులు సంపూర్ణ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఆలయ ప్రాంగణంలో మరియు పరిసరాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసుల నిఘా ఆలయ ప్రాంగణం మరియు పరిసరాల్లో నిత్యం ఉంటుందని తెలిపారు బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ యాజమాన్యం గిద్దలూరు కంభం మార్కాపురం తదితర డిపోల నుండి ప్రత్యేక బస్సు సౌకర్యాలు కల్పించిందని ఆయన తెలిపారు .

## పంచాయతీ వార్డు మెంబర్‌కి రాజీనామా

**తాళ్లూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార**



మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామ పంచాయతీ ఒకటవ వార్డు మెంబర్‌కి కొర్రపాటి వెంకట్రావు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ దారా హనుమంతరావుకి అందజేశారు. సర్పంచ్ కొర్రపాటి శ్రీదేవి ఏకపక్ష నిర్ణయాలతో రాజీనామా లేఖలో పేర్కొన్నారు.

## నూతనంగా నిర్మిస్తున్న పోలీసు స్టేషన్‌ను సందర్శించిన

### జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్



**హనుమంతునిపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

నూతనంగా నిర్మిస్తున్న హనుమంతునిపాడు పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ సందర్శించి, ఇప్పటి వరకు పూర్తి అయిన పనులను పరిశీలించి మిగిలిన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. పోలీసు స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన ప్లానింగ్‌ను పరిశీలించి, పోలీసు స్టేషన్ యొక్క నమూనాలో అవసరం మేరకు చేయాల్సిన మార్పులను గురించి ఎస్పీ తెలియజేశారు. జిల్లా ఎస్పీ వెంట కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, కనిగిరి సీఐ ఖాజా వలి, కనిగిరి, హెచ్‌ఎంపాడు ఎస్సై మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

**హనుమంతునిపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

హనుమంతునిపాడు పోలీసు స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేసి కేసుల వివరాలను నేరనివారణకు తీసుకుంటున్న చర్య శాంతి భద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు . అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసు స్టేషన్ నందు కేసుల దర్యాప్తు చేసి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని అదే విధంగా మహిళల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలనిమహిళలు, పిల్లలపై జరిగే ఆకృత్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది వివరాలు విధులపై పలు సూచనలు చేస్తూ రాత్రి వేళల్లో గస్తీ విధులు నిర్వహించి పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని రోడ్డు భద్రత, హెల్మెట్ ధరించడం ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన, కల్పించాలని అదేవిధంగా గ్రామాల్లో సీసీటీవీ ఏర్పాటు, శక్తి యాప్, సైబర్ క్రైమ్, డయల్ 112 వినియోగంపై ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని స్టేషన్‌కు వచ్చు ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా వ్యవహారించి సత్వర న్యాయం జరిగేలా చూసి పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, కనిగిరి సీఐ ఖాజావలి, కనిగిరి, హెచ్‌ఎంపాడు ఎస్సై మాధవరావు, సిబ్బంది ఉన్నారు.




## శాంతిభద్రతలపై తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసిన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

**పొన్నలూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

పోలీసు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలపై తీసుకుంటున్న చర్యలపై జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆరా తీశారు. సాధారణ తనిఖీలో భాగంగా గురువారం నాడు పొన్నలూరు పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ స్థితిగతులు, క్షేత్ర స్థాయిలో పోలీసు సిబ్బంది పనితీరును పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా స్టేషన్ పరిసరాలు, విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరు, డ్యూటీల కేటాయింపు, మహిళా సహాయక కేంద్రం, పలు రికార్డులు పరిశీలించారు. స్టేషన్ ఆవరణం పరిశుభ్రంగా, పచ్చదనం, ఆహ్లాదకరంగా ఉండేలా చూడాలని ఆయన సూచించారు. పెండింగ్ కేసులలో విచారణ త్వరగా పూర్తి చేయాలని, కేసుల విచారణ చేపట్టాల్సిన విధానం గురించి ఆయన పోలీసు సిబ్బందికి వివరించారు. పోలీసు స్టేషన్ పరిధిలో తరచూ నమోదు అవుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. స్టేషన్ పరిధిలో ఎక్కువ నేరాలు నమోదవుతున్న ప్రాంతాలలో అధికంగా గస్తీ నిర్వహిస్తూ, నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆకస్మిక తనీఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు తరచూ నిర్వహించాలని ఆయన అన్నారు. మహిళా పోలీసులతో మాట్లాడుతూ శక్తి యాప్, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఓటీపీ ఫ్రాండ్స్, ఆన్‌లైన్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది కుటుంబం, ఆరోగ్యం వంటి విషయాలు ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సీసీ కెమెరాలు పట్ల అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను తెలియజేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని ఆయన అన్నారు. గ్రామ పోలీసులు తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని ఎస్పీ దామోదర్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో ఎస్పీ దామోదర్ మొక్కలు నాటారు. ఎస్పీ దామోదర్‌ను స్థానిక టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు మర్యాద పూర్వకంగాకలిశారు. తనిఖీ సమయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ వెంట కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, కొండపి సీఐ సోమశేఖర్, పొన్నలూరు ఎస్సై కే.అనుక్, సిబ్బంది పాల్గొన్నారు.





# శాంతి భద్రతల విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

**- ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్**






**వెలిగండ్ల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
శాంతి భద్రతల విషయంలో పోలీసులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. గురువారం వెలిగండ్ల పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించి అనంతరం స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి కేసుల నమోదు వాటి యొక్క స్థితి గతులను తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, పోలీసుల మధ్య స్నేహబంధం పెంపొందించుకోవాని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పోలీసు శాఖపై మరింత నమ్మకం పెంపొందించేలా ఉత్తమ సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతే కాకుండా చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టి వాటిని చాకచక్యంగా నివారించాలని అన్నారు. ముఖ్యంగా యువత ఎక్కువగా బెట్టింగ్‌కు అలవాటు పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అలాంటివి జరగకుండా వారిపై నిఘా పెట్టడమే కాకుండా వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు జరుగుతాయి, ఎంత మంది చెడు నడతగలిగిన వారు ఉన్నారు. స్టేషన్ సిబ్బంది మొదలైన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని రోడ్డు ప్రమాదాల నివారనకు ముందస్తు చర్యలు తీసుకోవాలని నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు సీసీ కెమెరాల పట్ల అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. విలేజ్ పోలీసు అధికారులు తరచు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతూ ముందస్తు సమాచారాన్ని సేకరించాలని అన్నారు. ప్రజలకు చట్టాల మీద, శక్తి యాప్, క్రికెట్ బెట్టింగ్, సైబర్ నేరాల భారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది కృషి చేయాలన్నారు. స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బందితో విధి నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉన్నది, కుటుంబ నేపథ్యం అనారోగ్య సమస్యలు ఏదైనా ఉన్నది అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బందికి హెల్మెట్‌లను అందజేశారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు.

# విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని భవిష్యత్తులో

**ఎన్నో విజయాలు సాధిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలి :**

అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలోని విద్యార్థినీలతో ఎస్పీ దామోదర్ సమావేశమై వారితో మాట్లాడుతూ ఇళ్ళల్లో, పాఠశాలల్లో, వీధుల్లో పొరుగువారితో ఎదురయ్యే వేదింపులు అసభ్యప్రవర్తన గురించి నిర్భయంగా తల్లిదండ్రులకు తెలియచెప్పి వారి నుండి మొదట రక్షణ పొందాలని తెలిపారు. ఎలాంటి ఆపద వచ్చినా నేరుగా పరిగణిస్తాము, ఎదుటి వారు మనతో మెలిగే విధానం బట్టి గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంటే ఏమిటి, నేర ప్రవృత్తి కలిగి మనతో మెలుగుతున్నారా లేదా మంచి ఆలోచనతో మనతో ఉంటున్నారా ఏ విధంగా వ్యవహరిస్తున్నారు అని బట్టి అంచనా వేయవచ్చు అనే దానిపై వివరంగా తెలియజేశారు. అంతే కాకుండా చదువుకునే ప్రాంతంలో బంధువుల ఇళ్ల వద్ద, మన చుట్టు పక్కల ప్రాంతాలలో మనతో అసభ్యంగా ప్రవర్తించేవారు ఎవరు, వారి నుండి మనల్ని మనం ఏ విధంగా రక్షించుకోవాలి, అలా ఎవరైనా మనపై దాడికి పాల్పడితే పోలీసుల నుండి రక్షణ ఏ విధంగా పొందాలి అనే అంశాలపై జిల్లా ఎస్పీ అవగాహన కల్పించారు. మీరు ఎదుర్కొంటున్న సమస్యను ధైర్యంగా చెప్పినప్పుడే పూర్తి భద్రత అందించగలమని విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపారు. సామాజిక మాధ్యమాల వినియోగం పెరుగుతున్న కొద్ది అంత వేగంగా సైబర్ నేరాల వల్లో చిక్కుకుంటున్నారన్నారు. సమస్య వస్తే కుంగిపోకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని సమస్య చిన్నదైనప్పటికి తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ, వారి యొక్క సహాయం తీసుకోవాలని, దుర్వ్యసనాలకు కటువ మాటలు చెప్పి, అవకాశం తీసుకునే వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, మాటల ప్రలోభాలకు గురి కాకుండా చదువుపై దృష్టి కేంద్రీకరించాలని, క్రీడలలో కూడా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. స్పోర్ట్స్ విద్యార్థినీలకు స్పోర్ట్స్ డ్రెస్సు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ఈయన వెంట కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఎస్బీ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, పామూరు సీఐ భీమానాయక్, సీఎస్‌పురం ఎస్సై సుమన్, వెలిగండ్ల ఎస్సై షేక్ జీలాని భాష, కస్తూర్బా గాంధీ బాలికల ప్రిన్సిపాల్ సుశీల, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

# కొప్పెరపాలెంలో రీ సర్వే అవగాహన ర్యాలీ

**బల్లికురవ, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మండలంలోని కొప్పెరపాలెం గ్రామంలో గురువారం భూములరీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెండవ ఫేస్ రీ సర్వేలో భాగంగా మండలంలోని కొప్పెరపాలెం, గొరిజెపాడు గ్రామాలలో భూముల రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ రవి నాయక్ తెలియజేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ, ప్రజలందరికి రీ సర్వే పట్ల అవగాహన కల్పించారు. భూములలో రీ సర్వే జరిగే సమయంలో సంబంధిత రైతులంతా చేరుకొని, అధికారులకు తమ వంతు సహకారం అందజేస్తే రీ సర్వే పారదర్శకంగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రహర్ష, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# విద్యార్థుల దేశభక్తి, క్రమశిక్షణకు రాచ మార్గం స్కౌట్ అండ్ గైడ్స్

**- ఏల్చూరు జడ్పీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దారా బాలయ్య**



**అద్దంకిరూరల్ (సంతమాగులూరు)ఏప్రిల్ 3 ,ప్రభాతవార్త**
విద్యార్థుల దేశభక్తి, క్రమశిక్షణ, నీతి నిజాయితీతో కూడిన సత్ప్రవర్తనకు రాచ మార్గం స్కౌట్ అండ్ గైడ్స్‌లో పనిచేయడం ద్వారా ప్రతి ఒక్కరికి అలవడుతుందని ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దారాబాలయ్య పేర్కొన్నారు. ఏల్చూరు జడ్పీహెచ్ పాఠశాలలో గురువారం నూతనంగా స్కౌట్స్ మరియు గైడ్స్ యూనిట్‌ను 26 మంది విద్యార్థులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కౌట్స్ వ్యవస్థాపకులు బెడెన్ పావెల్ సేవలను ,స్కౌట్స్ అండ్ గైడ్స్‌ప్రాముఖ్యతనువివరించారు. ఈ సందర్భంగా స్కౌట్స్‌లో చేరిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దార ఆబాలయ్య యూనిఫాం దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దారా బాలయ్యతో పాటు పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ బల్లెం వెంకటేశ్వర్లు, స్కౌట్స్ బోదకులు పాఠశాల క్రీడా ఉపాధ్యాయులుఎన్. వీరేంద్ర, సీనియర ఉపాధ్యాయులు పరిమి కోటేశ్వరరావు, ముత్తయ్య, కె. వెంకటేశ్వర్లు, జి. గోపీనాద్, సీహెచ్. శ్రీనివాసరావు, షేక్ కరిమునిషా, వీరకుమారి, పద్మ, బోదన, బోదనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలలో సమయ పాలన తప్పని సరి - సీడీపీఓ సుధ

**- సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అంగన్వాడీ ఆయాల సమావేశం**

**అద్దంకి రూరల్ (సంతమాగులూరు )ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
అంగన్వాడీ కేంద్రాలలో సమయ పాలన తప్పని సరిగా పాటించాలని సంతమాగులూరు ఐసీడీఎస్ సీడీపీఓ సుధ స్పష్టం చేశారు. సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం అంగన్వాడీ ఆయాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీడీపీఓ సుధ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు ఉదయం 8.0 గంటల నుండి మధ్యాహ్నాం 12 గంటలవరకు ఆయాలు కేంద్ర నిర్వహణ చూసుకోవాలన్నారు. కూంద్రాలలో పిల్లల సంరక్షణ కొరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫినాయిల్, చాకులు, మందులు వంటి ప్రమాదకర వస్తులు పిల్లలకు అందుబాటులో లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాల సంజీవని యాప్ లో ప్రతి రోజూ బాల బాలికల ఇన్ అవుట్ హాజరు తప్పకుండా వేయాలన్నారు. పిల్లలకు అందించే పౌష్టికాహారం తగిన మోతాదులో క్రమం తప్పకుండా మెనూ ప్రకారం అందించాలన్నారు. గుడ్డు తగిన సమయం వరకు ఉడక బెట్టడం పోషక విలువలు తగ్గకుండా చిన్నారులకు అందించడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపవ్ వైజర్స్ చస్కె. మీరాబి, సుష్మారాణి, ప్రమీల , విజయనిర్మల తదితరులు సంతమాగులూరు ,బల్లికురవ మండలాల పరిధిలోని ఆయాలు పాల్గొన్నారు.



# నూతన పే కమీషన్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి



**మార్కాపురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
పెన్షనర్స్‌కు తీవ్రనష్టం కలిగించే విధంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పే కమీషన్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతు అఖిల భారత బీఎస్ఎన్ఎల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేసన్ నాయకులు కే. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పదవి విరమణ పొందిన ఉద్యోగుల పట్ల కేంద్ర ప్రభుత్వం పక్షపాత దోరణితో వ్యవహరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడు లేని విధంగా నూతన కమీషన్ బిల్లులో విశ్రాంత ఉద్యోగులకు వేతనాలకు సంబంధించి సవరణ లేకుండా చేయడం చాలా బాధాకరమని ఆయన అన్నారు. బీఎస్ఎన్ఎల్ అభివృద్ధి కోసం నాలుగు దశాబ్దాల పాటు నిస్వార్ధంతో సేవలు అందించి పదవి విరమణ చేసిన ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వం గౌరవించాల్సింది పోయి మరో వైపు మా హక్కులను కాల రాసే విధంగా చట్టాలను తీసుకొని రావడం ఆందోళనను గురి చేసే విషయమని అన్నారు. ఈ నూతన పే కమీషన్ వలన దేశంలో ఉండే లక్షలాది మంది పెన్షనర్స్ భవిష్యత్తులో అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో పే కమీషన్ రివిజన్ అయినప్పుడు ఆటోమేటిక్‌గా పదవి విరమణ పొందిన ఉద్యోగులకు కూడా వేతనాలు సంబంధించి పెరుగుదల ఉండేదని ఆయన గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విభజించు పాలించు సూత్రాన్ని పాటిస్తూ పదవి విరమణ పొందిన ప్రస్తుత ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారి మధ్య విఘాతాన్ని సృష్టించే విధంగా వ్యవహారిస్తుందని ఆయన అన్నారు పెన్షనర్స్‌కు సంబంధించి సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వన్ ర్యాంకు వన్ పెన్షన్ అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని ఆయన డిమాండ్ చేశారు. 8వ పే కమీషన్‌లో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు పెన్షన్ రివిజన్ చేర్చాలని అఖిల భారత బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కే. శ్రీనివాసరెడ్డి కేంద్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ఎం. కృష్ణారావు మాట్లాడుతూ అనేక సంవత్సరాలు పాటు కష్టపడి బీఎస్ఎన్ఎల్ అభివృద్ధి కోసం పాటుపడ్డ తమకు ఎవరి దయాదక్షిణాలు అవసరం లేదని, మాకు హక్కులు ఉన్నాయని, అందుకు అనుగుణంగా పోరాటం చేస్తామని ఆయన అన్నారు. పెన్షనర్స్‌ను అవమానించే విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడంతో పాటు తమకు రాజ్యాంగ బద్దంగా రావాల్సిన వేతనాలు మంజూరు చేయాలని యూనియన్ నాయకులు ఎం. కృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐ బీడీపీఏఎస్, ఎన్‌పీడబ్ల్యూఏ, ఏఐబీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘాలకు చెందిన ప్రతినిధులు ఎస్‌కే ఇమామ్, ఎం. ఉస్మాన్ బేగర్, ఎస్ఏ సలీం, పి. శంకరరావు, సీఐటీయు జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, ఏఐటీయుసీ జిల్లా నాయకులు అందేనాసరయ్య, ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే కాశీం, తదితరులు పాల్గొన్నారు.

# ఫేజ్ - 2 రీ సర్వే పై అవగాహన ర్యాలీ




**కురిచేడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మండల రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఫేజ్2 రీ సర్వే అవగాహన ర్యాలీ గురువారం నాడు మండలంలోని దేకనకొండలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తహశీల్దార్ రజని కుమారి హాజరయ్యారు. రీ సర్వే ఎంతో సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించడం జరుగుతుందని, ప్రతి రైతు సహకరించి తమ భూములను రీ సర్వే చేయించుకోవాలని తెలిపారు. గతంలో రీ సర్వే పక్రియలో కొన్ని పొరపాట్లు, సాంకేతిక సమస్యలు జరిగినప్పటికి ప్రస్తుతం అలాంటి ఇబ్బందులు ఏమి లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలు, నాయకులు బెల్లం సత్యనారాయణ, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం





**మార్కాపురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబందించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం గురువారం ఎంపీడీఓ శ్రీనివాసులు అధ్యక్షతన 16వ సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలం పరిధిలో ఉన్న పంచాయతీలకు సంబంధించి తనిఖీ నివేదిక సభ్యులు జిల్లా అధికారుల దృష్టికి వారు గుర్తించిన చిన్న చిన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సామాజిక ప్రజా తనిఖీ బృందం మండల పరిధిలో మాస్టర్లలో ఒకటి, రెండు , సంతకాలు లేకపోవడం, కొలతల్లో చిన్న చిన్న వ్యత్యాసాలు ఉండడం, అలాగే వాలంటీర్లు పనికి వెళ్లినట్లు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వాటిపై ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారులకు వివరణ ఇవ్వడం జరిగిందని, అలాగే వర్షధారణ లేకపోవడం వలన మొక్కలు ఎండిపోయినట్లు రైతులు సూచిస్తున్నారు. వాటిని హార్టికల్చర్ వారి రిపోర్టు ద్వారా పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తున్నామని, ఈ సందర్భంగా చిన్న చిన్న సమస్యలు తప్ప ప్రశాంతంగా సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం కొనసాగిందని పీడీ జోసఫ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.వండర్ మ్యాన్, డిస్ట్రిక్ విజిలెన్స్ ఆఫీసర్, ఎంపీడీఓ శ్రీనివాసులు మూర్తి, స్టేట్ రిసోర్స్ పర్సన్, హార్టికల్చర్ అధికారి రమేష్, ఏపీవో జీవరత్నం, టెక్నికల్ అసిస్టెంట్లు, ప్రజా తనిఖీ వేదిక అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# మహిళలంతా విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలి

**- డాక్టర్ ఎన్.ఉదయిని**



**సంతనూతలపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మహిళలంతా భాగా చదివి చైతన్యవంతులై ఆర్థికంగా ముందంజలో నిలవాలని ఒంగోలు బెతూన్ నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ ఎన్. ఉదయిని పేర్కొన్నారు. మహిళా ఉద్యమ నాయకురాలు మోటూరు ఉదయం 23వ వర్ధంతి సందర్భంగా మోటూరు ఉదయం ట్రస్టు, ఐద్వా ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యం ఎలిమెంటరీ స్కూల్ నందు గురువారం సాయంత్రం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న డాక్టర్ ఉదయిని మాట్లాడుతూ మోటూరు ఉదయం చాలా ధైర్యవంతురాలని మహిళల సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేశారని పేర్కొన్నారు. నేటికి సమాజంలో మహిళలు అన్యాయాలకు గురవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలంతా చదువుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. తమ అమ్మమ్మ మోటూరు ఉదయం సుమారు 80 సంవత్సరాల క్రితమే మహిళలను బయటకు రానీయని ఆనాటి రోజుల్లోనే సైకిల్‌పై తిరుగుతూ మహిళా హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఉదయం తన పిల్లలైనా టాన్య, ఉషలను డాక్టర్లుగా చదివించి సమాజానికి వైద్య సేవలు అందించేందుకు కృషి చేశారని అన్నారు. ఉదయం స్ఫూర్తితోనే నేడు తమ హాస్పిటల్‌లో వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా 100 మందికి చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా ఉద్యమాన్ని నిర్మించడంలో మహిళలను చైతన్యపరుస్తూ వారి హక్కుల కోసం పోరాటాలు నిర్వహించడంలో ఉదయం కృషి మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముందుగా మోటూరు ఉదయం చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ ఎన్. ఉదయిని, డాక్టర్ ఎస్. సందీప్ ప్రకాష్, వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమానికి ఐద్వా మండల అధ్యక్షురాలు బంకా పద్మ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు షేక్ నాగూర్ బి, కే. రాజేశ్వరి, షేక్ మస్తాన్ బి. ఫరీదా, పి. లక్ష్మీ మస్తాన్‌బి, సీఐటీయు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు షేక్ కాలేషా, కే. రామకృష్ణారెడ్డి, నూర్ మహమ్మద్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

# అంజమ్మకు నివాళులర్పించిన ఏలూరి, నూకసాని

**మార్టూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
ఇంకొల్లు మాజీ జడ్పీటీసీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుంజి వెంకటరావు మాతృమూర్తి అంజమ్మ చిత్రపటానికి పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు, ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



# నేడు నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి వార్షిక తిరునాళ్ల

**కురిచేడు, ఏప్రిల్3, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన కురిచేడు ఎన్నెస్పీ కెనాల్ పక్కనే వెలసిన శ్రీ నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి వార్షిక తిరునాళ్ల శుక్రవారం జరగనున్నట్లు తెలిపారు. ఉదయమే సుప్రభాత సేవ మొదలుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నాం భారీ ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం అమ్మవారి గుండప్రవేశ కార్యక్రమం సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా నిర్వాహకులు కోరుతున్నారు.

# ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు



**సంతనూతలపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిస్తే ఒకపక్క ఖర్చు తక్కువ మరొక పక్కా నాణ్యమైన అధిక దిగుబడులు లభిస్తాయని సంతనూతలపాడు మండల వ్యవసాయాది. కారిణి పి.పావని కోరారు. సంతనూతలపాడు లోని వెలుగు కార్యాలయంలో గురువారం నాడు ముగిసిన మైనంపాడు క్లస్టర్ వీఓఏలు, ఎన్యుమరేటర్స్, గ్రామాల వ్యవసాయ సహాయకులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జీవనోపాదుల ప్రణాళిక శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మండల వెలుగు ఏపీఎం టి.బాబురావు అధ్యక్షత వహించారు. దీనిపై రైతులను మరింతగా చైతన్య పరచాలని ఏవో పావని పేర్కొన్నారు. అంతే కాకుండా అధికంగా ఎరువులు పురుగు మందులను వాడరాదు అన్నారు. సేంద్రపదియ ఎరువులను వాడాలన్నారు. తద్వారా ఆరోగ్య సంరక్షణ కలుగును అని తెలిపారు. జీవనోపాధుల ప్రణాళిక సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని మండల వెలుగు ఏపీఎం టి.బాబురావు కోరారు. ఎస్‌హెచ్‌జీ సభ్యుల నుండి దీనికి సంబంధించి రుణ అవసరాల ప్రణాళికను కొత్త మొబైల్లో ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. వీఓఏలు, ఎన్యుమరేటర్స్ ఈ సర్వేని పగడ్బందీగా నిర్వహించాలని ఏపీఎం బాబురావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ రజిత, ప్రకృతి వ్యవసాయం మండల యూనిట్ ఇన్‌ఛార్జీ శేషమ్మ, సీఆర్పీలు నాగలక్ష్మీ, రేణుక, ఏఈఓలు సుబ్బారెడ్డి, వెంకటరావు, సీసీలు, రామాంజనేయులు, చెంచులక్ష్మీ, సీహెచ్ శ్రీనివాసులు, వి. శ్రీనివాసులు, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు పి. మేరిమ్మ, సెక్రటరీ కే. పద్మావతి, ఎన్యుమరేటర్స్, వీఓఏలు, గ్రామాల వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌ను కలిసిన ఏలూరి రామచంద్రారెడ్డి



**మార్కాపురం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మా పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చాలని గురువారం అమరావతిలోని కార్యాలయం నందు లంకా దినకర్‌ను బీజేపీ రాష్ట్రనాయకులు డాక్టర్ ఏలూరి రామచంద్రా రెడ్డి కలిసి వినతిపత్రం అందజేయటం జరిగింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండా జాతికి అంకితం చేసి ప్రజలను, రైతులను అవమానించారు. ఈ కారణంగా వారు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించి, తక్షణమే పెండింగ్ పనులు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విడుదల చేసి కరువు ప్రాంతాలు అయినటువంటి మార్కాపురం, కనిగిరి, దర్శి, గిద్దలూరు, యర్రగొండపాలెం, కడప, నెల్లూరు ఉమ్మడి జిల్లాలోని 32 మండలాల్లోని ఆయా ప్రాంతాల రైతాంగాన్ని, ప్రజల్ని ఆదుకోవాలని కోరారు. ఈ విషయాన్ని తమరు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులా దృష్టికి అలాగే అవసరమైన కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని భావిస్తున్నాం. అంతే కాకుండా తమరు ఈ ప్రాంత వాసి కనుక వెలిగొండ ప్రాజెక్టు యొక్క స్వరూప స్వభావం మీకు తెలుసు, గతంలో మీరు ఈ ప్రాజెక్టు కోసం పలు విధాలుగా పోరాటాలు చేసి ఉన్నారు. ఈ ఏడాది మార్చి 8వ తేదీ మహిళా దినోత్సవం సందర్భంగా మార్కాపురానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నధుల అనుసంధానం గురించి ప్రస్తావిస్తూ ఏటా సముద్రంలోకి వృధాగా పోతున్న వరద జలాలను ఒడిసిపట్టి గోదావరి బనకచర్ల ప్రాజెక్టు ద్వారా వెలిగొండ ప్రాజెక్టుకు కేటాయించిన 45 టీఎంసీల నీటిని కొరత లేకుండా అందిస్తామని చెప్పడం సంతోషించదగ్గ విషయం. ఈ విషయాన్ని కూడా వారి దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా కోరుచున్నాము. కరువు కాటకాలతో సతమతమవుతున్న పశ్చిమ ప్రకాశానికి వెలుగులు నింపే ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి మీ సహాయ సహకారాలు అందించాలని ఉన్నతాధికారులు కూడా సత్వర చర్యలు తీసుకునే విధంగా మీరు కృషి చేయాల్సిందిగా కోరుచున్నాము.

# నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం




**పొన్నలూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షుడు కొండబత్తిన మాధవరావు ఆదేశాల మేరకు మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డాక్టర్ పి. సుజాత తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ సుజాత కోరారు.

# జన్మించిన ఊరు, చదువుకున్న పాఠశాలను మరవరాదు

**- పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ**

**పెద్దదోర్నాల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**
మన జీవిత ప్రయాణంలో ఎన్నో అనుభవాలు ఉంటాయి. మనం పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాల ఈ రెండు మనకు మాతృభూమి, మాతృదేవతలతో సమానం. ఇవి మనకు బుద్దిని, విలువలను వ్యక్తిత్వాన్ని అందించిన ఆధారాలు. మన ఊరు అనేది మన జ్ఞాపకాల నిలయం. అక్కడ మన బాల్యం గడిచింది. తొలి అడుగులు వేసిన ప్రదేశం. మన పాఠశాల మన బుద్దిని మెరుగుపరిచిన ఆలయం. ఆ పాఠశాలలో గురువులు, జన్మించిన ఊరు ప్రధాన కారణం. అందుకే జన్మించిన ఊరును చదువుకున్న పాఠశాలను మరిచిపోకూడదు. మనం ఏ హోదాలో ఉన్న, ఏ ఉద్యోగం లేదా ఏ పదవులలో ఉన్న జన్మించిన ఊరు, చదువుకున్న పాఠశాలకు ఏదో ఒక మంచి చేయాలి. తాము ఎక్కడున్నా, ఏ స్థితిలో ఉన్న తాము చదువుకున్న పాఠశాలను మరువలేదని పూర్వ విద్యార్థులు తమ చదువుకున్న పాఠశాలకు రెండు బీరువాలను బహుకరించి తమ విధేయతను, కృతజ్ఞతలు చాటుకున్నారు. పెద్దదోర్నాలలో 1981-82 బ్యాచ్ చెందిన విద్యార్థులు గురువారం పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రెండు బీరువాలను బహుకరించారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురభి అనసూయ దేవిని సన్మానించి బీరువాలు బహుకరించి విధేయత చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో 1981- 82 పూర్వ విద్యార్థులు రావి క్రింది సత్యనారాయణ, గ్రందే ఎం. సుదర్శనం, ఈదర పెద్ద ఆంజనేయులు, నీరూరి కాశయ్య, షేక్ కాశీం, పెరుమాళ్ళ సత్యనారాయణ, పెరుమాళ్ళ సుబ్రహ్మం, రావిక్రింది మోహన్‌రావు, కాటే చెన్నయ్య, గాదె బ్రహ్మారెడ్డి, బొద్దొజు శ్రీనివాస చారి, పాఠశాల ఉపాధ్యాయులు వడ్లమాని నాగమూర్తి, రామ నాయక్, పీఎస్ చంద్రమౌళి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## నవోదయ సీట్ సాధించిన మోటుమాల కేజీబీవీ విద్యార్థిని

**కొత్తపట్నం, ఏప్రిల్ 3. ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామంలోని కేజీబీవీ స్కూల్ నందు 8వ తరగతి చదువుతున్న టంగుటూరు మండలం కొణిజేడు గ్రామానికి చెందిన తుమ్మలపూడి మహేష్, విజయలక్ష్మిల కుమార్తె లక్ష్మిలాస్య నవోదయ ఎంట్రన్స్ ఎగ్జామ్ నందు మంచిర్యాంకు సాధించినందుకు నవోదయ స్కూలుకు 9వ తరగతి సీటు సాధించినట్లు కేజీబీవీ ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఎస్. అరుణ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మిలాస్య మోటుమాల కేజీబీవీ స్కూలుకు మంచి పేరు తీసుకొచ్చిందని తెలియజేశారు, అలాగే ప్రతి ఒక్క విద్యార్థి చదువులో ముందు ఉండి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని తెలియజేశారు. ఇలాంటి విజయాలు సాధించినప్పుడు తల్లిదండ్రులకు ఎనలేని సంతోషం కలుగుతుందని ఆమె అన్నారు. సీటు సాధించిన లక్ష్మీ ప్రిన్సిపాల్ మరియు పాఠశాల సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది. తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## పోషక విలువలు పెంచేందుకే పోర్ట్ ఫైడ్ రైస్

**కొత్తపట్నం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



విద్యార్థుల్లో పోషక విలువలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోర్ట్ ఫైడ్ రైస్‌ను మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్నదని టీ రంగారావు తెలిపారు. గురువారం కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించడం జరిగింది. ఫోర్టిఫైడ్ రైస్‌ను, మెనూ విద్యార్థుల యొక్క పోషక విలువలు పెంచుటకు ఏర్పాటు చేశారని విద్యార్థులు అందరిని తల్లిదండ్రులను కూడా ప్రోత్సహించి అందరూ మధ్యాహ్న భోజనం తినే విధంగా చూడాలని సూచించారు. ఫోర్టిఫైడ్ బియ్యం ని కడిగి వండే విధానాన్ని గురించి కుకింగ్ ఆయాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిని 2 పద్మావతి, ప్రధానోపాధ్యాయురాలు ఎం శ్రీదేవి, తో కలిసి భోజనం చేయడం కూడా జరిగింది. భోజనం చాలా రుచిగా ఉందని సంతృప్తిని తెలియజేశారు.

## ముగిసిన డవలప్‌మెంట్ క్లాసులు

**టంగుటూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**




మండల కేంద్రమైన టంగుటూరులోని వెలుగు కార్యాలయంలో గత వారం రోజుల నుండి వీఓఏలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్పెషల్ అధికారి కృష్ణకుమారి పాల్గొని మాట్లాడుతూ గతంలో పనులు గురించి డవలప్‌మెంట్ గురించి, ఇప్పుడు చేయాల్సిన విధానాల గురించి ఈ సమావేశంలో తెలియజేశారు. ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ దీని వల్ల ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీసీలు కసుకుర్తి శ్రీను, వెంకటరావు, వీఓఏలు పాల్గొన్నారు.

## ఈకేవైసీ నమోదుకు గడువు పొడిగింపు

**టంగుటూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



ఈకేవైసీ నమోదుకు గడువు పొడిగించినట్లు తహశీల్దార్ ఆంజనేయులు తెలిపారు. గురువారం తహశీల్దార్ వీఆర్వోలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈకేవైసీ సమస్యలు, రేషన్ కార్డులు సర్వేలు పరిశీలించాల్సిందిగా తెలియజేశారు. ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని, ఇది గమనించుకొని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శ్రీనాథ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

## పరిశుభ్రత పాటించాలి

**టంగుటూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈవోపీఆర్డీ ఏవీ రామసుబ్బారావు తెలిపారు. టంగుటూరు మండలంలోని జమ్ములపాలెం గ్రామంలో పొడి, చెత్త తడి కార్యక్రమం నిర్వహించారు. చెత్త డబ్బాలను అందజేశారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ జమ్ములపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో గల ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌లో వర్మీ ప్రాసెసింగ్ పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. సేకరించిన తడి, పొడి చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా వీధిలోకి వచ్చే చెత్త వాహనాల్లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, విస్తరణ అధికారి డి.వెంకటరావు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం


**చీరాల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



మదర్ సర్వీస్ సొసైటీ, ఆలమూరి చారిటబుల్ ట్రస్టు, చీరాల వారి ఆధ్వర్యంలో విశ్వావసు నామ తెలుగు ఉగాది వేడుకలు చీరాలలోని మహిళా మండలి ప్రాంగణంలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం, ఉగాది పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఉగాది ప్రత్యేకతను తెలియజేసి కవితలను కవులు చదివి ఆహుతులని ఆలరింపచేశారు. విశిష్ట అతిధులుగా చీరాల వన్ సీఐ ఎం.శ్రీనివాసరావు, బి.సుబ్బారావు, రాజు, శ్రీనివాసరెడ్డి, బత్తుల బ్రహ్మారెడ్డి, డాక్టర్ ఎం.అబ్రహం బ్లెస్సీ, డాక్టర్ ఎం.సజ్నా అబ్రహం బ్లెస్సీ తదితరులు పాల్గొనగా సభా సమన్వయం వడలి రాధాకృష్ణ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు గోనెళ్ళ శేష వరలక్ష్మీ పవని భానుచంద్రమూర్తిలతో పాటుగా చైతన్య బారతి కాలేజీ ప్రిన్సిపాల్ నార్ని సోమేశ్వరరావు, రాజు, వెంకటేశ్వరరెడ్డి, వంగర శ్రీధర్, అంగలకుదిటి నాగవీరభద్రాచారి, సజ్జా వెంకటేశ్వర్లు, బందా వెంకట కృష్ణ, శక్తిధర్, చిలకపాటి శ్రీనివాసాచార్యులు, మంగళగిరి పిచ్చయ చార్యులు, కర్ల సుబ్బారావు, మంత్రిప్రగడ లీలాకృష్ణ చైతన్య, ఆకురాతి దాక్షాయణిలకు ఉగాది పుష్కారాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలమూరి నాగేశ్వరరావు, మున్నంగి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం:ఎస్సై పవన్


**చీరాల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**




వేసవి కాలం రావడంతో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని ట్రాఫిక్ ఎస్సై పవన్ కుమార్ అన్నారు. గురువారం చీరాల పట్టణం లో ప్రజల అవసరార్థం సేవా కార్యక్రమంలో భాగంగా ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలకు చల్లని మజ్జిగ అందించడంతో పాటు దాహార్తిని తీర్చడమే తమ లక్ష్యమని తెలిపారు. ఉచితంగా మజ్జిగ పంపిణీతో కూలీలకు, వాహనదారులకు ఎండ తీవ్రత నుంచి బయటపడేందుకు దోహదం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ నాయకులు చీరాల నియోజకవర్గ అధ్యక్షుడు డి.నాగేశ్వరరావు, నాయకులు బాసి పైదయ్య, సైకం రాజశేఖర్, ఆచ్యుతుని బాబురావు, బీసీ ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్స్ నాయకులు గాదె హరిహరరావు, ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి భాను ప్రకాష్, కరిముల్లా, నాగేశ్వరరావు, రవికిరణ్, సుబ్బారావు, నరేంద్ర, కొండబాబు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## యక్కల ఆంజనేయులు మృతి - నేత్రదానం

**మార్టూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



ప్రముఖ వ్యాపారవేత్త యక్కల ఆంజనేయులు(88) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మార్టూరు గ్రామస్తులకు సుపరిచితుడు. ఆయన గతంలో పోలిశెట్టి సోమ సుందరం పొగాకు కంపెనీలో 40 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. అనంతరం తన కుమారునితో కలిసి వ్యాపారం ప్రారంభించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మృతి చెందారు. మృతుని కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను శంకర్ కంటి హాస్పిటల్‌కు డొనేట్ చేశారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు. పలువురు గ్రామస్తులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీ ప్రకటించాలి

**- డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య**

**దర్శి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**




రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యం వహిస్తుందని పరీక్షల తేదీ ప్రకటించకుంటే నిరుద్యోగుల పక్షాన డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఛలో విజయవాడకి పిలుపునిస్తామని జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య తెలిపారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీ ప్రకటించాలని కోరుతూ దర్శిలోని స్థానిక సుందరయ్య భవనంలో డీవైఎఫ్ఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేవీ పిచ్చయ్య మాట్లాడుతూ కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహారిస్తుందని, అభ్యర్థులకు అరచేతిలో వైకుంఠం చూపిస్తుందని అన్నారు. గతప్రభుత్వం హయాంలో 2022లో నోటీఫికేషన్ ఇచ్చి మూడు సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహించి పోస్టులు భర్తీ చేయలేదని అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా యువగళంలో నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలో కోర్టు కేసులు క్లియర్ చేసి పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ఇంత వరకు అతీగతీ లేదన్నారు. మాది మంచి ప్రభుత్వమని, కార్యక్రమాలు చేసుకోవడం కాదని నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చినప్పుడే మంచి ప్రభుత్వం అవుతుందని లేకుంటే ముంచే ప్రభుత్వం అవుతుందని అన్నారు. తక్షణమే సుప్రీం కోర్టులో ఉన్న కేసులు పరిష్కరించి పాత పద్దతిలో రిజర్వేషన్ నిర్వహించి కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీని ప్రకటించాలని లేకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసి ఛలో విజయవాడ సైతం పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షులు ఆర్ జెసిపాల్, మండల నాయకులు షేక్ పీరా సాహెబ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

## దళితులు సాగుచేసుకునే భూములను కాజేసిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి

**దర్శి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



దళితుల సాగుచేసుకునే భూములను కాజేసిన పెత్తందారులపై చర్యలు తీసుకొని, సంభదిత భూములను దళితులకు అప్పగించాలని దళితనేత ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఇందుకు సంబంధించి స్తానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ దర్శి మండలంలోని తూర్పు చౌటపాలెం ఎస్సీ గ్రామానికి చెందిన దాసరి పాపయ్య ఏలియా సంబంధించి ప్రభుత్వ సాగుభూమిని సుమారు 50 సంవత్సరాల నుండి గ్రామ సర్వే నెంబరు 60/6 25 సెంట్లు భూమిని అదే గ్రామానికి చెందిన పెత్తం దారుడు ఆక్రమించి కబ్జా చేయడం జరిగింది. దళితులు భూములు ఆక్రమించిన పెత్తం దారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత సేన నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాచపూడి మోషే, కంభంపాటి సన్నీబాబు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేపై అవగాహన ర్యాలీ - తహశీల్దార్ లక్ష్మీ నారాయణ

**ముండ్లమూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**




మండలంలోని కంభంపాడు గ్రామంలో రీ సర్వే పై అవగాహన ర్యాలీ రెవెన్యూ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న తహశీల్దార్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో రీ సర్వే నిర్వహించడం జరుగుతుందని, రైతులు తమ పొలాలకు సంబంధించి స్థలాలకు సంబందించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయాలని అదే విధంగా పలు అంశాలపై ర్యాలీ నిర్వహించి అనంతరం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కోటమరాజు, వీఆర్వో సుజాత, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, గ్రామ రైతులు, ప్రజలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రుద్రసముద్రం గ్రామంలో అక్రమ మద్యం స్వాధీనం

**దర్శి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



దొనకొండ మండలం రుద్రసముద్రం గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం సీసాలను దర్శి ఎక్సైజ్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో దాడులు నిర్వహిస్తుండగా చిన్న చెంచయ్య అనే వ్యక్తి వద్ద నుండి 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే.శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై సత్యనారాయణ, సిబ్బంది కాశీం పీరా, నాగరాజు, ఎస్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఐదు మంది పేకాట రాయుళ్లు అరెస్టు

**ముండ్లమూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన పేకాట ఆడుతున్న ఐదు మందిని గురువారం అరెస్టు చేయడం జరిగింది. పసుపుగల్లు గ్రామా పొలాల్లో కోతముక్క పేకాట ఆడుతున్న ఐదు మందిని ముండ్లమూరు పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి ఐదు మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.3వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది వెంకటేశ్వర్లు, మరియబాబు ఉన్నారు.

## ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ.. ఇరువురికి గాయాలు

**నాగులుప్పలపాడు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఇరువురికి గాయాలైన సంఘటన గురువారం నాగులుప్పలపాడు మండలంలోని మద్ది రాలపాడులో గల 216 జాతీయ రహదారిపై జరిగింది. వివరాల మేరకు తిమ్మసముద్రం గ్రామానికి చెందిన ధాన్యం బస్తాలతో ట్రాక్టర్ ఒంగోలు వైపు వస్తుంది. అదే క్రమంలో మద్దిరాలపాడు సమీపంలోని ఇనమనమెల్లూరు రోడ్డు వద్ద ఒంగోలు వస్తున్న లారీ వెనుక నుండి ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ట్రక్కులోధాన్యం బస్తాలపై కూర్చున్న తిమ్మసముద్రం గ్రామానికి చెందిన ఐ.అంకమ్మరావు, డి.వంశీలు ఎగిరి క్రింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

## కనిగిరి పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ దామోదర్


**కనిగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం కనిగిరి పోలీసు స్టేషన్‌ను సందర్శించి అక్కడి కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించడం, మహిళా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యతగా ఎస్పీ పేర్కొన్నారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ప్రాముఖ్యతనిచ్చి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నేరాల కట్టడి, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి నేరాల నియంత్రణకు పోలీసు శాఖ మరింత కృషి చేయాలని, ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కఠిన చర్యలు అమలు చేయాలని ఎస్పీ అన్నారు. ట్రాఫిక్ నియమాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని సూచించారు. టెక్నాలజీ వినియోగం, వృత్తి నైపుణ్య అభివృద్ధి పోలీసు శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం అవసరమని ఎస్పీ దామోదర్ పేర్కొన్నారు. ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంచుకుని, దాని ద్వారా నేర పరిశోధనను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఉత్తమ సేవలు పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను అర్థం చేసుకుని సమర్థంగా పరిష్కరించేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని ఎస్పీ దామోదర్ అధికారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, కనిగిరి పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**టంగుటూరు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరులో 16 నెంబరు జాతీయ రహదారి పక్కన టోల్ ప్లాజా ఉత్తరం వైపు సుమారు 500 మీటర్ల దూరంలో రోడ్డు ప్రమాదంలో సుమారు తొమ్మిది గంటల సమయంలో టంగుటూరు పోలీసు వారు గుర్తించడం జరిగింది. స్తానిక ఎస్సై మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం బన్నీని వేసుకొని ఉన్నాడు. తలకు గాయం తగిలినట్లుగా గుర్తించడం జరిగిందని తలెఇపారు. ఎవరైనా తెలిసినట్లయితే టంగుటూరు సింగరాయకొండ ఈ నెంబర్లుకు ఫోన్ 9121102137, 9121102135 ద్వారా సంప్రదించాలని తెలియజేశారు.

## కనిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

**కనిగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సర ఇంటర్మీడియట్ విద్యార్థుల తరగతులు ఏప్రిల్ 1వ తేదీ నుండి ప్రారంభమయ్యాయి. ఇక మొదటి సంవత్సరం చేరబోయే విద్యార్థుల అడ్మిషన్లు ఏప్రిల్ 7వ తేదీ నుండి ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ పి.రమణారెడ్డి తెలిపారు. కళాశాలలో ప్రవేశం పొందే విద్యార్థులకు హాస్టల్ సదుపాయం అందుబాటులో ఉంది. బాలికల కోసం కళాశాల క్యాంపస్‌లో ప్రత్యేక హాస్టల్ ఉండగా, బీసీ, ఎస్సీ విద్యార్థులకు వేర్వేరు హాస్టల్ సదుపాయాలు అందించబడుతున్నాయి. ఆధునిక విద్యా సౌకర్యాలు కళాశాలలో విశాలమైన తరగతి గదులు, డిజిటల్ బోధన సౌకర్యాలు, మెరుగైన ల్యాబ్ సదుపాయాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం ఎం బైపీసీ(ఎంపీసీ+బైపీసీ) గ్రూపును కొత్తగా ప్రవేశపెట్టింది. విద్యార్థులకు ఉచిత సదుపాయాలు కళాశాలలో చేరిన విద్యార్థులకు ఉచిత పాఠ్యాపుస్తకాలు, నోట్ బుక్స్, ల్యాబ్ రికార్డ్స్, స్టడీ మెటీరియల్, బ్యాగ్‌లు అందించనున్నారు. అదనంగా ప్రభుత్వ డొక్కా సీతమ్మమధ్యాహ్న భోజనం పథకం ద్వారా కళాశాలలో మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేయబడుతుంది. కావున కనిగిరి పరిసర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.రమణారెడ్డి సూచించారు.

## ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి విరాళం అందజేసిన రాచగుండ్ల మోహన్

**కనిగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



స్థానిక ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి తన వంతు సహాయంగా కనిగిరి మున్సిపాలిటీ 20వ వార్డుకు చెందిన రాచగుండ్ల మోహన్(సామిల్ యాజమాని) బుధవారం రూ.50వేలు విరాళానిన నఅందజేశారు. ఈ మొత్తాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి స్వయంగా అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తెలుగు యువత నాయకుడు షేక్ ఫిరోజ్, ఎల్‌వీఆర్, అంజినాయుడు తదితరులు పాల్గొన్నారు. సామాజిక సేవలో ముందుండే రాచగుండ్ల మోహన్‌కు స్థానికులు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం మరింత మంది ఉదారంగా ముందుకు రావాలని నాయకులు ఆకాంక్షించారు.

## అన్నా క్యాంటీన్‌లో మందుబాబుల ఆగడాలు

**- భోజనం చేసేవారు, సిబ్బంది బేజారు**

**కనిగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

పేద ప్రజలకు ఉచిత భోజనాన్ని అందించే అన్నా క్యాంటీన్ ఇటీవల మందుబాబుల తాకిడికి గురవుతోంది. మద్యం మత్తులో ఉన్న వారు క్యాంటీన్‌కు వచ్చి భోజనం చేసే వారిని, సిబ్బందిని వేధిస్తున్నారు. టోకెన్లు లేకుండానే భోజనం డిమాండ్ చేయడం, నిరాకరిస్తే సిబ్బందిని దుర్భాషలాడడం, మెనూలో లేని వంటలు అడగటం భయపెట్టడం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నట్లు సమాచారం. గురువారం మధ్యాహ్నం ఓ మందుబాబు క్యాంటీన్‌లో గంటసేపు హంగామ చేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. క్యాంటీన్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వగానే అతను అక్కడి నుంచి పారిపోయాడు. ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నప్పటికి క్యాంటీన్ సిబ్బంది, బాధితులు బయటకు చెప్పకోలేక మౌనంగా భరించాల్సిన పరిస్థితి నెలకొంది. క్యాంటీన్ సేవలకు ఆటంకం కలిగించే ఇలాంటిసంఘటనలను అరికట్టేందుకు ఆహారం పంపిణీ సమయంలో పోలీసుల నిఘా అవసరం అని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు, పాలకులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సాయినాధుని సన్నిధిలో దారపనేని చంద్రశేఖర్

**కనిగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ గురువారం వరికుంటపాడు గ్రామంలోని శ్రీసాయిబాబా దేవస్థానాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర చైత్ర మాసం షష్టి గురువారం సందర్భంగా బాబా సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దారపనేని చంద్రశేఖర్ మాట్లాడుతూ గురువారం బాబా దర్శనం ద్వారా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్దిస్తాయని భక్తుల నమ్మకం ఉందని పేర్కొన్నారు. భక్తుల అచంచల విశ్వాసానికి ప్రతీకగా సాయినాధుని సన్నిధిలో ఆరాధన చేసుకోవడం ఆధ్యాత్మిక ఆనందాన్ని అందిస్తుందని అన్నారు. దేవస్థానం ప్రధాన అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం బాబా తీర్థ ప్రసాదాలను దారపనేని చంద్రశేఖర్‌కు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోలాహలం నెలకొంది.

## కార్యకర్తలకు అండగా నిలుస్తున్న దద్దాల నారాయణయాదవ్

**కనిగిరి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



కనిగిరి నియోజకవర్గంలోని వైసీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ మరోసారి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో ఒంగోలు ప్రకాశం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కనిగిరి వైసీపీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు మర్రి రాజు సతీమణి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న నారాయణ యాదవ్ వెంటనే ఫోన్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అన్ని విధాలుగా సహాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఆర్థిక సహాయం అందజేసి, ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దద్దాల నారాయణయాదవ్ సహకారం పట్ల మర్రి రాజు కృతజ్ఞతలు తెలియజేస్తూ.. అన్న ఎప్పుడూ నాకు అండగా ఉంటున్నారు. నా జీవితాంతం ఆయనకు రుణడి ఉంటాను ఆయన గెలుపు కోసం నా శక్తికి మించి కృషి చేస్తానని అన్నారు. నాయకత్వానికి విశ్వాసంగా, కార్యకర్తలకు అండగా నిలుస్తున్న దద్దాల నారాయణయాదవ్‌పై నియోజకవర్గంలో ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

## జూదంపై ఉక్కుపాదం - ఎస్సై వెంకటేశ్వర్లు

**వేటపాలెం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



వేటపాలెం మండలం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో సాధారణ విధులలో భాగంగా గురువారం నాడు అక్కయ్యపాలెం ఊరు శివారులో జూదం ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో వేటపాలెం ఎస్సై, వారి సిబ్బంది అక్కయ్యపాలెం గ్రామ శివారులో దాడి నిర్వహించగా పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుంచి రూ.17,080 లను స్వాదీనం చేసుకుని వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు తెలియజేశారు.

## తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి వదిలిన అధికారులు

**- పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య**

**చీరాల రూరల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



రామాపురం సముద్ర తీరంలో 300 పైగా తాబేలు పిల్లలను చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చేతుల మీదుగా విడిచిపెట్టారు. ఇసుక తేనెల్లో ఆలివ్ రిడ్లే తాబేళ్లు పెట్టిన గుడ్లను ప్రత్యేకంగా పొదిగించి అనంతరం పిల్లల్ని డిస్ట్రిక్ కోఆర్డినేటర్ చంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, సిబ్బంది గంపల్లో తీసుకెళ్లి కూర్చోబెట్టారు. అవి నెమ్మదిగా నీటిలోకి వెళ్లిపోయాయి. ఆలివ్ రిడ్లే జాతికి చెందిన ఈ తాబేళ్లు ఆహార అన్వేషన్ గుడ్లు పెట్టడం సంతానం ఉత్పత్తి కోసం వేలాది కిలోమీటర్లు ప్రయాణించి ఇక్కడికి వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,తాబేళ్ల సంరక్షణ పునరుత్పత్తి కేంద్రంలో పని చేసే సిబ్బంది పాల్గొన్నారు.

## సీయోను ప్రార్థన మందిరంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ చర్చి కౌన్సిల్ ప్రత్యేక సమావేశ కార్యక్రమం

**దర్శి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

ఆల్ ఇండియా క్రిస్టియన్ చర్చి కౌన్సిల్ ప్రత్యేక సలహా సమావేశం దర్శిలోని సీయోను ప్రార్థన మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీసీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ డాక్టర్ బి.మోహన్ దాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యే ప్రార్థన కార్యక్రమంలో మోహన్ దాస్ సువార్తను అందించారు. ప్రార్థనల అనంతరం ఆల్ ఇండియా క్రిస్టియన్ చర్చ్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ నూతన కమిటీను ఎన్నుకున్నారు. ఏపీ స్టేట్‌కోఆర్డినేటర్‌గా యెండ్లూరి ఆదామ్‌బాబును, స్టేట్ యూత్ సెక్రటరీగా బలభద్ర సురేష్‌ను జాతీయ అధ్యక్షులు మోహన్‌దాస్ నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 25 వేల సంఘాలకు పైగా ఉన్నాయని క్రైస్తవుల అభివృద్ధి సంక్షేమం కొరకు రాయితీలను ప్రకటించాలని, క్రైస్తవ సంఘాలు ఏర్పాటుకు కావాల్సిన స్థలాల పట్టాలను ఇవ్వాలని, సంఘాల అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలన్నారు. కమిటీ సభ్యులు సురేష్, ఆదాంబాబులు మాట్లాడుతూ సంఘాల అభివృద్ధి కోసం, క్రైస్తవ సోదరుల రక్షణ కోసం కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు గొంగటి జాన్, ఏ.దేవదానం, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

04-4Pg5.qxd:04-4Pg5.qxd 01/01/01 8:38 AM Page 1



# బెంగాల్‌లో 25 వేల టీచర్ల నియామకాలు రద్దు

## మమతాబెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు షాక్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** పశ్చిమ బెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో మమతా బెనర్జీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో దాఖలైన పిటిషన్లపై దర్యాప్తు చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ 25 వేల టీచర్ల నియామకాలు చెల్లవని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఆ నియామకాలను రద్దు చేస్తూ గతంలో కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును సిజెఐ జస్టిస్ సంజీవ్‌ఖన్నా ధర్మాసనం సమర్థించింది. ఈ కుంభకోణంపై గతేడాది ఏప్రిల్‌లో కోల్‌కతా హైకోర్టు సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. 2016 నాటి స్టేట్ లెవల్ సెలక్షన్ టెస్ట్ (ఎస్‌ఎల్‌ఎస్‌టి) టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామక ప్రక్రియ చెల్లదని స్పష్టం చేసింది. ఆ పరీక్షతో జరిపిన నియామకాలను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించింది. అంతేగాక, దీనికింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు తమ వేతనాన్ని తిరిగి ఇచ్చేయాలని వెల్లడించింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

దీనిపై విచారణ జరిపిన సిజెఐ ధర్మాసనం ఫిబ్రవరి 10న తీర్పును రిజర్వులో పెట్టింది. తాజాగా తీర్పును వెలువరించింది. ఆ నియామక ప్రక్రియను కలుషితమైనది, కళంకమైనదిగా అభివర్ణించింది. హైకోర్టు తీర్పుపై జోక్యం చేసుకునేందుకు సరైన కారణాలు లేవని పేర్కొంది. ఆ నియామకాలు చెల్లవని స్పష్టం చేసింది. అయితే, ప్రభావిత ఉపాధ్యాయులకు కాస్త ఊరట కల్పించింది. ఈ నియామక ప్రక్రియ కింద ఉద్యోగాలు సాధించిన టీచర్లు అప్పటివరకు అందుకున్న వేతనాలు, ఇతర భత్యాలను తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదని వెల్లడించింది.

ఇక, మూడు నెలల్లో కొత్తగా టీచర్ల నియామకాలు పూర్తి చేయాలని సుప్రీంకోర్టు బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే, దివ్యాంగ ఉపాధ్యాయులకు మానవతా కోణంలో ఊరట కల్పించింది. వారి విధుల్లో కొనసాగొచ్చని స్పష్టం చేసింది.

ఇక, ఈ కుంభకోణం వ్యవహారంపై మరింత సమగ్ర దర్యాప్తు జరపాలని గతంలో హైకోర్టు సిబిఐని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ దీదీ సర్కారు దాఖలు చేసిన పిటిషన్‌పై ఏప్రిల్ 4న విచారణ జరుపుతామని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ ప్రయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కారు రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీకోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షకు 23లక్షల మందికిపైగా హాజరయ్యారు. తర్వాత ఇందులో ఎంపిక ప్రక్రియ చేపట్టి 25,753 మందికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు.

ఈ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. కుంభకోణానికి సంబంధించిన కేసులో మాజీ విద్యాశాఖ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత పార్థా ఛటర్జీని ఇడి అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.



# ట్రంప్ సుంకాలపై కేంద్ర సర్కారు స్పందనేమిటి?

## లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ దిగుమతులపై సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఈ టారిఫ్‌లపై కేంద్ర సర్కారు స్పందన తెలియజేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభలో మాట్లాడిన రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధించిన సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తాయన్నారు. దీనిపై కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈసందర్భంగా భారత్–చైనా వివాదాన్ని ఆయన ప్రస్తావిస్తూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. 'చైనా భారత్‌కు చెందిన 4 వేల కి.మీ.పైగా భూభాగాన్ని ఆక్రమించింది. దీనిపై ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము బీజింగ్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసింది. అక్కడి రాయబారి ద్వారా ఈ విషయం బయటపడింది. దాన్ని తిరిగి తీసుకోవాలి' అని రాహుల్ పేర్కొన్నారు.

ఇక, రాహుల్ వ్యాఖ్యలకు బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్ గట్టిగా బదులిచ్చారు. ఎవరి హయాంలో చైనా ఈ ప్రాంతాన్ని అధీనంలోకి తీసుకుందో అందరికీ తెలుసన్నారు. ధోక్లాపై ప్రతిష్ఠంభన జరుగుతున్న సమయంలో బీజింగ్ అధికారులతో కలిసి సూప్ ఎవరుతాగారో తెలుసని రాహుల్‌పై విమర్శలు చేశారు. ఇలాంటి అంశంపై రాజకీయాలు చేయడంవల్ల ఏఫలితం ఉండదన్నారు. గతంలో జరిగిన తప్పిదాలకు వారి (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) సమాధానం చెప్పాలన్నారు.

అమెరికా ఉత్పత్తులపై ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌లతో పోలిస్తే.. తాము సగం మేర మాత్రమే వసూలు చేయనున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ క్రమంలో భారత్ తమకు వాణిజ్య భాగస్వామి అని చెబుతూనే.. ట్రంప్ సుంకాల బాంబు వేశారు. భారత్ తమ ఉత్పత్తులపై సగటున 52 శాతం సుంకం విధిస్తున్నందున, తాము 27 శాతం సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు.



# తుర్కియేలో చిక్కుకున్న విమానం

## 200 మంది మిలిటరీబేస్ ఎయిర్‌పోర్టులోనే..

**ముంబయి, ఏప్రిల్ 3:** లండన్‌నుంచి ముంబయికి రావాల్సిన విమానం తుర్కియేలో అత్యవసరంగా ల్యాండ్ అయింది. దానితో అక్కడి మారుమూల విమానాశ్రయంలో బుధవారం రాత్రి నుంచి 200మంది భారత ప్రయాణీకులు చిక్కుకు పోయారు. లండన్‌నుంచి వర్జిన్ అట్లాంటిక్ విమానం ముంబయికి బయలుదేరింది. మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా తుర్కియేలోని మారుమూల ప్రాంతంలోని దియార్‌బకిర్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయింది. అయితే ల్యాండ్ అయ్యే సమయంలో సాంకేతిక సమస్య తలెత్తిందని ప్రయాణీకులు చెప్పారు. దాంతో సుమారు 20 గంటలుగా ప్రయాణీకులు అక్కడే చిక్కుకుపోయారు. వారిలో 200 మందికిపైగా భారతీయులున్నారని మీడియా కథనాలు తెలిపాయి. అయితే తిరిగి వారు ఎప్పుడు గమ్యస్థానం చేరతారనే దానిపై స్పష్టతలేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లగురించి విమానయాన సంస్థనుంచి ఎలాంటిప్రకటన రాలేదు. అయితే ప్రస్తుతం ఎదురైన సమస్యను పరిష్కరించేందుకు కావాల్సిన సౌకర్యాలు ఆ విమానాశ్రయంలో లేవని ఒక ప్రయాణీకుడు వాపోయాడు. సాధ్యమైనంత సత్వరమే రవాణా ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులను కోరారు. తమకు విమానాశ్రయంలో తగిన సౌకర్యాలు లేవని అది మిలిటరీ బేస్‌కావడంతో అక్కడినుంచి బయటకు వెళ్లడానికికూడా వీలు లేదని ఆయన వాపోయారు.

# లోక్‌సభలో బుల్‌డోజ్ చేసి వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదించారు

## - సోనియా గాంధీ ధ్వజం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** వక్ఫ్ సవరణల బిల్లును లోక్‌సభలో బుల్‌డోజ్‌చేసారని కాంగ్రెస్ అగ్రనేత్రి సోనియా గాంధీ ఆరోపించారు. వివాదాస్పద పరిస్థితులు, ఉద్రిక్త వాతావరణం మధ్య లోక్‌సభలో వక్ఫ్‌సవరణ బిల్లు 2024 ఆమోదం పొందిందని అన్నారు. వక్ఫ్ బిల్లు విషయంలో తమ పార్టీ వైఖరి స్పష్టంగా ఉందని సోనియా తెలిపారు. ఈ బిల్లును రాజ్యాంగంపై దారుణమైన దాడిగా ఆమె అభివర్ణిఇంచారు. దేశ రాజకీయాల్లో తీవ్ర వివాదానికి కారణమైన వక్ఫ్ సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించిన విషయం తెలిసిందే. నేడు ఈ బిల్లు రాజ్యసభ ముందుకు వచ్చింది ఈ నేపథ్యంలో ఎగువ సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించడానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం అయింది. గురువారం ఉదయం పార్లమెంటు సెంట్రల్ హాలులోజరిగిన సమావేశంలోసోనియా మాట్లాడుతూ లోక్‌సభ ప్రొసీడింగ్స్ మొత్తం బుల్‌డోజ్‌చేసారని ఆరోపించారు. 12 గంటల పాటు చర్చించినప్పటికీ ప్రతిపక్ష సభ్యులకు ఎక్కువ అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. ఈ బిల్లు దేశప్రయోజనాలు, ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మారుతుందంటూ ఆందోళన వ్యక్తంచేసారు. ఈ బిల్లు ఎగువసభకు వెళ్లిందని, అక్కడ వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పార్టీ ఎంపిలకు సూచించారు. ప్రతిపక్ష పార్టీల సమన్వయంతో ఈ బిల్లును తిప్పికొట్టాలన్నారు. రాజ్యాంగాన్ని కేవలం కాగితానికి పరిమితంచేస్తూ మోడీప్రభుత్వం దేశాన్ని అగాథంలోకి నెడుతోందనిరాజ్యాంగాన్ని ధ్వంసం చేయడమే బిజెపి ప్రధాన ఉద్దేశ్యమని సోనియా గాంధీ అన్నారు. కాగా వక్ఫ్‌సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించిన విషయం తెలిసిందే. మధ్యాహ్నం 12 గంటలకు ఈ బిల్లును కేంద్ర న్యాయ మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. 12 గంటలపాటు చర్చలుజరిపి అర్ధరాత్రి 12 వరకూ కొనసాగించారు.

# థాయ్ ప్రజల జీవితంలో రామాయణం ఒకభాగం



## బ్యాంకాక్‌లో ప్రధాని మోడీ

**బ్యాంకాక్, ఏప్రిల్ 2:** థాయిలాండ్‌ప్రజల జీవితాల్లో రామాయణ ఇతిహాసంలోని గాథలు ఒక భాగమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. బిమ్స్‌టెక్‌సదస్సులో పాల్గొనేందుకు ప్రధానిమోడీ థాయిలాండ్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మాట్లాడుతూ థాయిలాండ్ ప్రజలతో భారత్ సంబంధాలు చిరకాలంగా పెనవేసుకుని ఉన్నాయన్నారు. దక్షిణాసియా ఆగ్నేయాసియా ప్రాంతాలకు చెందిన ఏడుదేశాల కూటమి అయిన బంగాళాఖాతప్రాంత బహుళరంగ, సాంకేతియ, ఆర్థిక సహకార కూటమి (బిమ్‌స్టెక్) సదస్సుకోసం రెండురోజులపాటు ప్రధానిమోడీ థాయిలాండ్‌కు వచ్చేసారు. థాయిలాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రతో భేటీ అనంతరం మోడీ మాట్లాడుతూ భారత్ థాయిలాండ్ మధ్య శతాబ్దాలుగా సంబంధాలు కొనసాగుతున్నాయి. సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలతో బలమైన బంధం ఏర్పడింది. బౌద్ధమతం వ్యాప్తి మన ప్రజలను అనుసంధానించింది. అయుతయనుంచి నలందావరకూ మేధావుల రాకపోకలు సాగించారని రామాయణ గాథలు థాయ్‌ప్రజల జీవితాల్లో ఒక భాగం అయ్యాయన్నారు. సంస్కృతి, పాళీ, భాషల ప్రభావం నేటికీ ఇరువురి సాంప్రదాయాల్లో ప్రతిబింబిస్తుందని నా పర్యటన సందర్భంగా 18వ శతాబ్దపు రామాయణ కుడ్యచిత్రాల ఆధారంగా ఒక స్మారక స్టాంపును విడుదలచేసిన థాయిలాండ్ ప్రభుత్వానికి మనసారా కృతజ్ఞతలు చెపుతున్నట్లు మోడీ పేర్కొన్నారు.

భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీ ఇండో పసిఫిక్ విజన్‌లో థాయిలాండ్‌ది కీలక పాత్ర అని మోడీ అన్నారు. తమ రెండుదేశాలు అభివృద్ధి వాదాన్ని సమర్థిస్తాయని విస్తరణ వాదాన్ని కాదని చైనానుద్దేశించి పరోక్ష వ్యాఖ్యలుచేసారు. ప్రస్తుత సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఇటీవల సంభవించిన భూకంపంలో మృతిచెందిన వారికి భారత్ తరపున సంతాపం తెలిపారు. ఈసదస్సుకు హాజరయిన దేశాల్లో థాయిలాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్; మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు కూడా వచ్చారు. బ్యాంకాక్‌పర్యటనలో భాగంగా మోడీ పదవ రామగా కూడా ప్రసిద్ధుడైన థాయ్‌రాజు మహా వజిర లాంగ్‌కోమ్‌ను కూడా కలుసుకున్నారు.

# జనంలేని దీవులపైనా ట్రంప్ ప్రతీకార సుంకాలు

## రష్యా, ఉత్తరకొరియా, బెలారస్‌లకు మినహాయింపులు

**వాషింగ్టన్, ఏప్రిల్ 3:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచదేశాలపై తమ సుంకాలనుప్రకటించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో అంటార్కిటికా దీవులపైనా ఆయన ట్యారిఫ్‌లు ప్రకటించారు. జనసంచారంలేని దీవులపైనా ఆయన సుంకాలు విధించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా ఉంది. ఆస్ట్రేలియా నియంత్రణలోని హియర్డ్, మెక్ డొనాల్డ్ ఐలాండ్‌లపై ట్రంప్ 10శాతం సుంకాలు విదిస్తున్నట్లుప్రకటించారు. ఈ చర్యపై ఆదేశ ప్రధాని ఆంతోని అల్బనీస్ తీవ్రంగ ఆస్పందించారు. ట్రంప్ ట్యారిఫ్‌లనుంచి భూమిపై ఎక్కడా రక్షణలేదని, ఇది స్నేహితుడు చేసే చర్యకాదన్నారు. యుఎస్ దిగుమతులపై తాము పరస్పర సుంకాలు విధించబోమన్నారు. ఈ దీవులు ఆస్ట్రేలియన్ భూభాగంలోనివిగా ఉండటమే ట్యారిఫ్ విధింపునకు కారణమని వైట్‌హౌస్ అధికారి అన్నారు. ఆస్ట్రేలియానుంచి ఈ దీవులకు చేరుకునేందుకు రెండు వారాల సమయం పడుతోంది. అగ్నిపర్వతాల క్రియాశీలక ప్రాంతాలైన ఇక్కడ ఎక్కువగా సీల్స్, పెంగ్విన్‌లు ఇతర పక్షులు ఆవాసం ఉంటాయి. శాశ్వత జనావాసం ఉండదు. ఇదిలా ఉంటే ఆర్కిటిక్ మహాసముద్రంలోని అగ్నిపర్వత ద్వీప్‌జాన్‌మాయెన్‌పైకూడా ట్రంప్ పదిశాతంసుంకం విధించారు. ఇది నార్వేలోని ట్రోమ్సోకు ఉత్తరాన 580మైళ్ల దూరంలో ఉంటుంది. ధృవపు ఎలుగుబంట్లు కూడా ఉంటాయి. పర్యాటకులకు మాత్రమే ఇక్కడ అనుమతి. నార్వే దిగుమతులపైనా ట్రంప్ 15 శాతం సుంకం విధించడం గమనార్హం. ఇప్పటికే చైనాపై 20శాతం అమలుచేస్తుంటే అదనంగా సుంకాల విధింపుతో మొత్తం చైనా దిగుమతులపై 54శాతం సుంకం విధించారు.

అదేవిధంగా రష్యాకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. ఈ దేశానికి అదనపు సుంకాలుప్రతీకార సుంకాలు లేవు. అదేమంటే ఇప్పటికే ఆంక్షలు అమలులో ఉన్నాయని చెపుతున్నారు. అదే విధంగా స్పెయిన్, మెక్సికో, కెనడాలపైనా సుంకాలు ముందునుంచి చెప్పినట్లుగానే విధించారు.

# వాల్‌స్ట్రీట్‌కు సుంకాల ఎఫెక్ట్

**వాషింగ్టన్, ఏప్రిల్ 3:** ప్రపంచదేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల జాబితాతో స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికా వాల్‌స్ట్రీట్ మొత్తం బ్లడ్‌బాత్‌మాదిరిగా తయారయింది. ప్రతీకార సుంకాలమూలంగా వాణిజ్యయుద్ధానికి తెరతీసినట్లుగానే కాకుండా అగ్రరాజ్యం ఆర్థిక మాంద్యంలోకి వెళుతుందన్న భయాలునెలకొన్నాయి. ఇది అక్కడి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనితోప్రధానసూచీలు భారీగా పతనం అయ్యాయి. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10గంటలకు డౌజోన్స్ 1500 పాయింట్లకుపైగా నష్టంతో 40,665 వద్దట్రేడ్‌అయింది. నాస్‌డాక్ సుమారు ఐదుశాతంమేర క్షీణిస్తే ఎస్‌అండ్‌పి 500 నాలుగుశాతం కుదేలయింది. ప్రధానమైన షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తుతున్నాయి. నైకీ 12శాతంమేర పతనం అయితే యాపిల్‌షేర్లు 9శాతం నష్టపోయాయి. ఐఫోన్లకు ప్రధాన సరఫరాదారుగా ఉన్నచైనాపై 54శాతం అమెరికా భారీ సుంకాలు విధించడంతో సప్లయిచెన్‌కు అవరోధంఏర్పడుతుందన్న ఆందోళనలతో ఆ కంపెనీలు షేర్లు భారీగా కుంగిపోయాయి.మరోవైపు చిప్‌తయారీ కంపెనీ ఎన్విడియా విషయంలోనూ ఇదే తరహా భయాలు నెలకొనడంతో ఆకంపెనీషేర్లుకూడా పతనం అవుతున్నాయి.

# ఆస్తులు వెల్లడించడానికి సుప్రీంకోర్టు జడ్జిలు ఓకే



## ఫుల్ కోర్టు సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** న్యాయమూర్తుల ఆస్తులకు సంబంధించిన సర్వోన్నత న్యాయస్థానం కీలక చర్యలు చేపట్టింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ ఆస్తులను బహిర్గతం చేసేలా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇటీవల జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో ఈ ప్రతిపాదనకు న్యాయమూర్తులంతా ఏకగ్రీవంగా అంగీకరించారు. ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్లకట్టల వివాదం నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఏప్రిల్ 1న సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా సమావేశమయ్యారు. అందులో తమ ఆస్తులకు సంబంధించిన వివరాలను కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేందుకు వారంతా సుముఖత వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సహా 30 మంది జడ్జీలు తమ ఆస్తులకు సంబంధించి డిక్లరేషన్లను సమర్పించారు. వీటిని త్వరలోనే సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నారు. అయితే ఇదంతా స్వచ్ఛందంగా జరుగుతున్న ప్రక్రియేనని సుప్రీంకోర్టు వెబ్‌సైట్ వెల్లడించింది.

ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం.. సుప్రీంకోర్టు జడ్జీలు ప్రమాణస్వీకారం చేయగానే తమ ఆస్తుల వివరాలను ప్రధాన న్యాయమూర్తికి సమర్పించాలని ఉంటుంది. అయితే, వాటిని బహిర్గతం చేయాలన్న తప్పనిసరి నిబంధనేదీ లేదు. సుప్రీం వెబ్‌సైట్‌లో న్యాయమూర్తుల ఆస్తుల డిక్లరేషన్ల కోసం ఇప్పటికే ఓ సెక్షన్ ఉంది. కానీ, గత కొన్నేళ్లుగా అందులో ఎలాంటి అప్‌డేట్స్ లేవు. తాజా నిర్ణయంతోనే త్వరలోనే సుప్రీం న్యాయమూర్తుల ఆస్తుల వివరాలు బహిర్గతం కానున్నాయి. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పని చేసిన జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసంలో భారీఎత్తున నోట్ల కట్టలు బయటపడినట్లు వచ్చిన వార్తలు సంచలనం సృష్టించాయి. న్యాయమూర్తి అధికారిక నివాసంలో అగ్ని ప్రమాదం జరగడంతో.. ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందికి అనుకోకుండా అక్కడ భారీగా నోట్ల కట్టలు దర్శనమిచ్చాయి. ఇది వివాదాస్పదం కావడంతో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్‌వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదలీచేస్తూ కేంద్ర న్యాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. మరోవైపు.. ఈ వ్యవహారంపై విచారణకు సుప్రీంకోర్టు కమిటీ ఏర్పాటు చేసింది.

# కర్ణాటకలో ఓలా, ఊబర్, ర్యాపిడోలపై నిషేధం

**బెంగళూరు, ఏప్రిల్ 3:** రాష్ట్రంలో ఓలా, ఊబర్, ర్యాపిడోలకు చెందిన బైక్ ట్యాక్సీ సేవలను నిలిపివేయాలని, ఆరువారాల్లోపు రాష్ట్రప్రభుత్వం ఇందుకు సంబంధించిన కార్యాచరణ అమలుచేయాలని కర్ణాటక హైకోర్టు ఆదేశించింది. ఉబేర్ ఇండియా సిస్టమ్స్, ఎఎన్ఐ టెక్నాలజీస్ (ఓలా), ర్యాపిడో వంటివి రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకున్నాయి. వారి దరఖాస్తులు 2022లోనే దాఖలుచేసాయి. టూవీలర్లను ట్రాన్స్‌పోర్టు వాహనాలుగా పరిగణించాలని దరఖాస్తుచేసాయి. హైకోర్టు జస్టిస్ శ్యామ్‌ప్రసాద్ ఈ దరఖాస్తులన్నింటినీ పరిశీలించి వాటిని డిస్మిస్‌చేసారు. ఓలా, ఉబేర్; రాపిడోలు వారివారి బైక్‌ట్యాక్సీలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వం కూడా వీటికి ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని ఆదేశించింది. ఈ సంస్థలు దాఖలుచేసిన పిటిషన్ల విచారణలో తాత్కాలిక ఉత్తర్వులను పరిగణనలోనికి తీసుకుని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆరువారాలపాటు మాత్రమే అనుమతి ఉంది. ఆ తర్వాత వాటిని రాష్ట్రంలో పూర్తిగా నిషేధించాలిస ఉంటుంది. 1988 మోటారు వాహణచట్టం సెక్షన్ 93 కింద రాష్ట్రప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసేంతవరకూ ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకూడదని హైకోర్టు ఆదేశించింది. బైక్‌ట్యాక్సీలు అక్రమమని వాణిజ్య వాహనాలుగా ఎంతమాత్రం తిరగడానికి వీలులేదని వాదించింది. ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన హైకోర్టు ఆరువారాల్లోపు వీటినినిషేధించాలని ఆదేశాలు జారీచేసింది.

# బొలీవియాపై నిత్యానంద నజర్!

## భూ ఆక్రమణలకు పాల్పడటంతో సర్కారు అప్రమత్తం



**లాపాజ్(బొలీవియా), ఏప్రిల్ 3:** లైంగిక వేధింపులు, చిన్నారుల కిడ్నాప్ వంటి కేసులు ఎదుర్కొంటూ దేశం నుంచి పారిపోయిన నిత్యానంద స్వామి అజ్ఞాతంలోనే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. దక్షిణ అమెరికా దేశం బొలీవియాపై ఇపుడు ఆయన కన్నుపడినట్లు తెలిసింది. అక్కడ భూఆక్రమణకు యత్నిం చిన నితానయనంద సన్నిహితులు స్థానిక తెగలతో భూమి లీజుకు సంబంధించి ఒప్పందాలుచేసుకున్నట్లు తేలింది. ఈ విషయం బహిర్గతం కావడంతో కైలాసతో సంబంధంఉన్న 20మందిని అరెస్టుచేసిన అక్కడి అధికారులు వారి సొంత దేశాలకు పంపించారు. కైలాసతో సంబంధం ఉన్న కొందరు వ్యక్తులు ఇటీవల బొలీవియాలో పర్యటించారు. ఈ క్రమంలో కార్చిచ్చును ఎదుర్కొనడంతో స్థానిక ప్రజలకు సాయపడిన వీరు ఏకంగా అక్కడి భూమిపై కన్నేసారు. వాటి లీజుకోసం స్థానిక తెగలతో ఒప్పందాలుకూడాచేసుకున్నారు. అధనయక్షుడు లూయిస్ ఆర్స్‌తోనూ కైలాస ప్రతి నిధులు ఫోటోలు దిగారు. చివరకు రెండు లక్షల డాలర్లు చెల్లిస్తే ఓప్రాంతాన్ని 25 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు స్థానికతెగ ప్రతినిధి అంగీకరించారు. అయితే కైలాస ప్రతినిదులు మాత్రం వెయ్యిసంవత్సరాల లీజుతోపాటు అక్కడ గగనతల వినియోగం సహజవనరుల తవ్వకం వంటి అంశాలనుప్రతిపాదించారు. వీటిపై బొలీవియా పత్రిక ఒకటి ప్రముఖంగా కథనం ప్రచురించింది. అప్రమత్తం అయిన ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది.కైలాసతో సంబంధం ఉన్న 20 మందిని అరెస్టుచేసింది. ఒప్పందాలను రద్దు చేసింది. ఈ వ్యక్తులను భారత్;చైనా, అమెరికాలకు పంపించివేసింది. వీరు పర్యాటకులుగా అనేకసార్లు బొలీవియాలోకి ప్రవేశించారని, ఈ క్రమంలోనే స్థానికులతో ఒప్పందాలుచేసుకున్నారన్నారు. గతఏడాది నవంబరునుంచికొంత మంది అక్కడే ఉండిపోయారని గుర్తించామన్నారు. బొలీవియా విదేశీ వ్యవహారాల మంత్రి మాట్లాడుతూ వివాదాస్పద యునైటెడ్ స్టేట్స్ ఆఫ్‌కైలాసతో ఎలాంటిదౌత్యసంబంధాలు కొనాస గించడం లేదన్నారు. నిత్యానంద కైలాస అనే ప్రాంతంలో ఆశ్రమం స్థాపించినట్లు వార్తలువచ్చాయి. ఈక్వెడార్ సమీపంలో ఒక చిన్నదీవిని కొనుగోలుచేసి దానికి కైలాసం అని పేరుపెట్టి నట్లు నిత్యానందవెల్లడించారు. ఒకకేసుకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వం కూడా నిత్యానంద ఈక్వెడార్‌లో ఉన్నట్లు హైకోర్టుకు తెలిపింది.

# రన్యారావుకు బులియన్ మర్చంట్ సకారియా జైన్ సాయం!

## గోల్డ్‌స్మగ్లింగ్‌లో వెలుగులోకి వస్తున్న మరికొన్ని నిజాలు



**బెంగళూరు, ఏప్రిల్ 3:** కన్నడ నటి రన్యారావు బంగారం అక్రమరవాణా కేసులో డిఆర్ఐ తన రిమాండ్ రిపోర్టులో మరికొన్ని ఆసక్తికర అంశాలు వెల్లడించింది. ఆభరణాల వ్యాపారి సాహిల్ సకారియా జైన్ కీలకపాత్ర పోషించారు. బంగారం అక్రమ లావాదేవీల విషయంలో ఆమెకు సహకరించడమే కాకుండా హవాలా నగదు బదలీలకూ సాయం చేసినట్లు తెలిపింది. రూ.40 కోట్ల విలువైన 49.6 కిలోల బంగారం అక్రమ లావాదేవీల్లో రన్యారావుకు సహకరించడంలో సాహిల్ కీలకపాత్ర పోషించాడని తెలిపింది.

దుబాయ్‌కు సుమారు 38 కోట్లు, బెంగళూరులోని రన్యాకు రూ.1.73 కోట్ల హవాలా సొమ్మును బదలీచేయడంలో సాయంచేసినట్లు అంగీకరించాడు. మార్చి 4న రన్యా నివాసంలో పట్టుబడిన రూ.2.67 కోట్లనగదును దుబాయ్‌లో బంగారం కొని బెంగళూరులో విక్రయించడం ద్వారా ఆమెకు లాభంగా వచ్చిన హవాలా సొమ్ముగా తెలిపింది. ప్రతి లావాదేవీకి రూ.55వేల కమిషన్ తీసుకున్నట్లు సాహిల్ అంగీకరించాడని డిఆర్ఐ తన రిపోర్టులో తెలిపింది. ఈ ఏడాదిజనవరిలో రూ.11.56 కోట్లు విలువైన 14.56 కిలోల బంగారాన్ని అమ్మేందుకు హవాలా ద్వారా రూ.11 కోట్లు దుబాయ్‌కు బదిలీ చేసేందుకు రన్యాకు సహకరించాడు. ఆమెకూ రూ.55లక్షలు బదలీ చేసాడు. ఫిబ్రవరిలో రూ.11.81 కోట్లు విలువైన 13.43 కిలోల బంగారాన్ని విక్రయించేందుకు సాయంచేసాడు. అదేనెలలో రూ.11.25 కోట్ల హవాలా నిధులనుదుబాయ్‌కి రూ.55.81 లక్షలను బెంగళూరులోని రన్యారావుకు బదిలీచేసాడని డిఆర్ఐ వెల్లడించింది. సాహిల్‌కు చెందిన రెండు ఫోన్లు, లాప్‌టాప్‌నుంచి సేకరించిన ఆధారాలు ఈ వ్యవహారంలో ఆతడి పాత్రను తేటతెల్లంచేస్తున్నాయనిచెప్పింది.

4-04pg6exHMNWJQE.qxd:4-04pg6exHMNWJQE.qxd 01/01/01 9:34 AM Page 1



# ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కక్షలు రేపేందుకే వైఎస్.జగన్ వస్తున్నారా?

**- కారు బాంబు..టివి బాంబులపై సమాధానం చెప్పి జిల్లాలోకి అడుగు పెట్టాలి : పరిటాల సునీత**



అనంతపురంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త బ్యూరో** ప్రశాంతంగా ఉన్న అనంతపురం జిల్లాలో కక్షలు రేపేందుకే వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు వస్తున్నారా..? కారుబాంబు, సూట్‌కేసు బాంబులు, ఆయన తండ్రి హయాంలో జరిగిన మరో 40 హత్యలకు సంబంధించి సమాధానం చెప్పిన తర్వాతే జిల్లాలోకి అడుగు పెట్టాలని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత డిమాండ్ చేశారు. దివంగత నేత పరిటాల రవీంద్ర హత్యలో కూడా వైఎస్.జగన్‌కు సంబంధం ఉందని, ఈ విషయంలో సిబిఐ కూడా విచారణ చేసిందని ఆమె ఆరోపించారు. ఈ నెల 8వ తేదిన రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో వైసిపి కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వైఎస్ జగన్‌రానున్న నేపథ్యంలో టిడిపి నేత రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం అనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ..వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సూట్‌కేసు బాంబు గురించి బాగా తెలుసని ఆయన అప్పట్లో పరిటాల రవిని హత్య చేసేందుకు ప్రయత్నించారన్నారు. కారుబాంబు సంఘటనలో 24 మందిని పొట్టన పెట్టుకున్నారని ఇందులో జర్నలిస్టులు కూడా ఉన్నారని ఆమె గుర్తు చేశారు. తోపుదుర్తి సోదరులు ఎప్పుడు మాట్లాడినా టివి బాంబు గురించి ప్రస్తావిస్తుంటారని, కారుబాంబు, సూట్‌కేసు బాంబుల గురించి మాట్లాడరా అని ఆమె ప్రశ్నించారు. కారుబాంబు సంఘటనలో తోపుదుర్తి సోదరులు జైలుకు కూడా వెళ్లి వచ్చారని ఆమె వెల్లడించారు. వైఎస్.జగన్ జిల్లాకు వచ్చేటప్పుడు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పి జిల్లాలోకి రావాలన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కక్షలు రేపేందుకే జగన్ వస్తున్నారని ఆయనప్రశ్నించారు. మా ప్రాంతం ప్రశాంతంగా ఉందని ఆమె వెల్లడించారు. శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డి పల్లి గ్రామంలో వాస్తవంగా ఏం జరిగింది, అని తెలుసుకోకుండా ప్రకాష్‌రెడ్డి చెప్పిన మాటలు విని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు వస్తున్నారని ఆమె ఆరోపించారు. లింగమయ్యతోపాటు మీరు పరామర్శించాల్సిన వారు చాలా మంది ఉన్నారని, ఆయన వచ్చే టప్పుడు సూట్‌కేసులో కొన్ని జతల దుస్తులు ఎక్కువ పెట్టుకుని రావాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేకంగా వైఎస్.జగన్‌కు విజ్ఞప్తి చేశారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మాజీ ఎమ్మెల్యే వల్ల నష్టపోయిన వైసిపి నాయకులు చాలా మంది ఉ న్నారని వారిని కూడా పరామర్శిస్తే మంచిదన్నారు. తోపుదుర్తి గ్రామానికి చెందిన మహేశ్వర్‌రెడ్డి అనే యువకున్ని రైలు పట్టాలపై పడుకోబెట్టి చంపారని, ఆ కుటుంబంతోపాటు జి.కొత్తపల్లి మాజీ సర్పంచు మోహన్‌రెడ్డిపై హత్య యత్నం చేశారని, సిద్దం సభలో ఫోటోగ్రాఫర్ కిష్టపై నిర్దాక్షిణ్యంగా దాడి చేశారని, ఆ కుటుంబాన్ని కూడా పరామర్శించాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ విషయంలో ఎంతో మందిని మోసం చేసి తోపుదుర్తి సోదరులు భూములు లాక్కున్నారని వారందరినీ కూడా పరామర్శించాలన్నారు. ఎంపిపి ఎన్నికల్లో సుధాకర్ యాదవ్ నిజాయితీగా వ్యవహరిస్తే ఆయనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతారా అని ప్రశ్నించారు.



# ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు పరికరాలు పంపిణీ

**వెదురుకుప్పం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:** ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన పరికరాలను ఎస్ఎస్ఎ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పచ్చికపల్లంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎస్ఎ వారు అందించిన ఎయిడ్స్ అండ్ అప్లైన్స్ (వీల్ ఛైర్, హియరింగ్ కిట్టు, రోలేటర్‌సిపి ఛైర్) ను గురువారం ఎంఈఓ-2 డి.దామోదరం చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించింది.

# వివేకా హత్య కేసులో సాక్షులకు రక్షణ కల్పించాలి : వైఎస్ షర్మిల

**విజయవాడ ఏప్రిల్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసు పై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఎంపీ అవినాష్‌రెడ్డి బెయిల్‌పై ఉంటూ సాక్షులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. వివేకా హత్య కేసులోని సాక్షులు ఒక్కొక్కరిగా ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వివేకా కుమార్తె సునీతకు ఇద్దరు పిల్లలున్నారు. ఆమె ప్రాణాలకు రక్షణ లేదు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారు సునీతను ఏమైనా చేస్తారనే భయం ఉంది. ఇటీవల నాకు తెలిసిన విషయాలు నన్ను ఆలోచింపజేస్తున్నాయి. అవినాష్ బెయిల్ రద్దు పిటిషన్‌పై ప్రభుత్వ అఫిడవిట్‌లో పలు అంశాలు ఉన్నాయి. విచారణ అధికారులను ఆయన పిలిపించుకొని బెదిరించారని అఫిడవిట్‌లో ఉంది. తప్పుడు రిపోర్టుపై అధికారులతో అవినాష్ సంతకాలు చేయించినట్లుగా ఉంది. అవినాష్ బెయిల్‌పై ఉన్నందునే సునీతకు న్యాయం జరగడం లేదు. సాక్షులను బెదిరించి ఒత్తిడి తెస్తున్నా. బెయిల్ రద్దు చేయట్లేదు. వివేకాను సునీత, ఆమె భర్త చంపించారని తప్పుడు రిపోర్టు ఇచ్చారు. హత్య జరిగిన సమయంలో ఘటనాస్థలిలో ఉన్నది అవినాష్ రెడ్డే అని వైఎస్ షర్మిల అన్నారు.

## గొల్లపూడి వద్ద శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మించాలి: దగ్గుబాటి పురందేశ్వరి

**విజయవాడ ఏప్రిల్ 03 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ రైల్వేస్టేషన్‌లో రద్దీ తగ్గించడానికి అక్కడికి సమీపంలోని గొల్లపూడి వద్ద శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మించాలని ఏపీ భారతీయజనతాపార్టీఅధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఆమె ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి ఈ మేరకు కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఉత్తర-దక్షిణ భారత దేశాలను కలిపే విజయవాడ రైల్వేస్టేషన్‌లో రాజధాని అమరావతి కారణంగా భవిష్యత్తులో ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉంది. అమరావతి అవసరాలు తీర్చేందుకు గొల్లపూడి వద్ద శాటిలైట్ రైల్వేస్టేషన్ నిర్మించే అంశాన్ని పరిగణలోనికి తీసుకోవాలి అని ఆమె కోరారు.

# జిల్లాల వారీగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సమీక్ష

## కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నేతలతో చర్చ



పార్టీ ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేస్తున్న మాజీ సిఎం కెసిఆర్

**మర్కుక్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభ, పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణపై మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పార్టీ ముఖ్యనేతలతో గురువారం మండల పరిధి ఎర్రవల్లిలోనితన వ్యవసాయ క్షేత్రంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ రెండు జిల్లాల ముఖ్య నాయకులకు దిశ నిర్దేశం చేశారు. భవిష్యత్ కార్యాచరణ క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం, పలు అంశాలపై చర్చించారు. రజతోత్సవ బహిరంగ సభకు పెద్దఎత్తున కార్యకర్తలను సమీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వరంగల్ సభ నుండే కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం ప్రారంభమవుతుందని, ఆ దిశగా ముందుకు సాగుదామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, జోగు రామన్న, మాజీ ఎంపిలు బోయినపల్లి వినోద్‌కుమార్, జోగినపల్లి సంతోష్‌కుమార్, ముఖ్య నేతలు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎల్.రమణ, కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, జివి.రామకృష్ణారావు, తోట ఆగయ్య, బాల్క సుమన్, సతీష్‌కుమార్, రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, దాసరి మనోహర్‌రెడ్డి, కోరుకంటి చందర్, పుట్ట మధు, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధర్‌రావు, దావా వసంత, చెల్మెడ లక్ష్మి, నరసింహారావు, జాన్సన్‌నాయక్, రామకృష్ణారెడ్డి, రమాదేవి, కిరణ్ కొమ్మెర, విలాస్, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# నేటితో ముగియనున్న ఎస్ఎస్‌సి పరీక్షలు

**13వ తేదీతో ముగియనున్న మూల్యాంకనం**

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా మార్చి 21 నుంచి ప్రారం భమైన ఎస్ఎస్‌సి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. నేటి(శుక్ర వారం)తో 10వ తరగతి వార్షిక పరీక్షలు ముగియనున్నాయి. ఈ నెల 2తో ప్రధాన పరీక్షలు ముగియగా.. ఒకేషనల్, ఓఎస్ఎస్‌సి పరీక్షలతో కలిపి నేటితో మొత్తం పరీక్షలు ముగియనున్నాయి. గురువరం జరిగిన ఒకేషనల్, ఓఎస్ఎస్‌సి పేపర్-1 పరీఓలకు 98.67 శాతం మంది విద్యార్థులు హాజర య్యారు. రాష్ట్రంలో ఎస్ఎస్‌సి పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2650 పరీక్షా కేంద్రాలనను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. ఈ నెల 2న జరిగిన సోషల్ స్టడిస్ పరీక్షతో 10వ తరగతికి చెందిన ప్రధాన పరీక్షలు ముగియగా.. ఈ నెల 3, 4 తేదిల్లో ఓఎస్ఎస్‌సి లాంగ్వేజెస్ పరీక్షలు జరగనున్నాయి. నేటితో మొత్తంగా ఎస్ఎస్‌సి పరీక్షలు ముగుస్తాయి.



లార్వెస్ ల్యాబ్స్ ప్రతినిధితో సీఎం చంద్రబాబు

# రాంబిల్లి ఫేజ్2లో లారెస్ ల్యాబ్స్ సంస్థ బల్క్‌డ్రగ్స్ పరిశ్రమల ఏర్పాటు

**విజయవాడ ఏప్రిల్ 3.ప్రభాతవార్తప్రతినిధి:** అనకాపల్లి జిల్లా గోరపూడి గ్రామంలోని ఐపీ రాంబిల్లి ఫేజ్2లో లారెస్ ల్యాబ్స్ సంస్థ బల్క్ డ్రగ్స్ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. లారెస్ ల్యాబ్స్ దాదాపు రూ. 5,000 కోట్లు ఇక్కడ పెట్టుబడిగా పెట్టనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 7,500 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. ల్యారెస్ ల్యాబ్స్ ఇప్పటికే విశాఖ పరిసర ప్రాంతాల్లో 2007 నుంచి పెట్టుబడులు పెడుతూ వస్తోంది. ఇప్పటివరకు రూ.6,500 కోట్లతో తయారీ యూనిట్లు నెలకొల్పగా, 10 వేల మందికి ఉద్యోగాలు దక్కాయి. లారెస్ ల్యాబ్స్ సంస్థకు బెంగళూర్, హైదరాబాద్‌లో కూడా యూనిట్లు ఉన్నాయి. సంస్థ విస్తరణలో భాగంగా రాంబిల్లిలో పరిశ్రమలు పెడుతోంది. ఫర్మంటేషన్, క్రాప్ సైన్స్ కెమికల్స్, గ్రీన్ కెమిస్ట్రీ వంటి స్పెషాలిటీ కెమికల్స్ ఉత్పత్తి చేయనుంది. ఏపీలో సంస్థ విస్తరణపై కొద్ది రోజులుగా రాష్ట్ర ప్రభుత్వంతో లారస్ ల్యాబ్స్ సంప్రదింపులు జరుపుతోంది. లారస్ ల్యాబ్స్ సీఈవో చావా సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ చావా నరసింహారావు ఈ రోజు సిఎం చంద్రబాబును సచివాలయంలో కలిశారు. భూకేటాయింపులు జరిపినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సంస్థ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తమ విధానమని చెప్పిన ముఖ్యమంత్రి... భూ కేటాయింపులతో పాటు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని... సాధ్యమైనంత త్వరగా క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభించాలని కోరారు. ఈ పరిశ్రమ ఏర్పాటు ద్వారా పెద్దఎత్తున యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

# హెల్మెట్ల వాడకం విషయంలో పోలీసు చర్యలు ఫలిస్తున్నాయి: హైకోర్టు

**విజయవాడ ఏప్రిల్ 03 ప్రభాతవార్త ప్రతినిధి:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు వినియోగించేలా చూసే విషయంలో పోలీసులు తీసుకుంటున్న చర్యలు ఫలితాలను ఇస్తున్నాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. హెల్మెట్ల వాడకంలో కొంత పురోగతి కనిపిస్తోందని పేర్కొంది. హెల్మెట్లపై అవగాహన కల్పించడం, ధరించని వారికి జరిమానాలు వేయడంలో కొన్ని జిల్లాల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదని అభిప్రాయపడింది. ఆ జిల్లాల ఎస్పీలకు తగిన సూచనలు చేయాలని డీజీపీని ఆదేశించింది.పోలీసులు అవగాహన కార్యక్రమాలు, తనిఖీలను కొనసాగించాలని స్పష్టం చేసింది. పత్రికల్లో ప్రకటనలు, ప్రసార మాధ్యమాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని ఆదేశించింది. శాంతి భద్రతలు ట్రాఫిక్ విభాగం ఒకే వింగ్‌లో ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోందని వ్యాఖ్యానించింది. ట్రాఫిక్ విభాగం ప్రత్యేకంగా ఉంటే మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడింది. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు హెల్మెట్ ధరించకపోవడం వల్లఎంత మంది చనిపోయారన్న వివరాలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. హెల్మెట్లు దరించకపోవడం వల్ల ద్విచక్ర వాహనదారులు మృతి చెందుతున్నారని, మోటారు వాహన చట్టాన్ని అమలు చేసేలా పోలీసులను ఆదేశించాలంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో పిల్ వేశారు. బుధవారం జరిగిన విచారణలో యోగేష్ వాదనలు వినిపించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు చేసి ఉల్లంఘనలకు పాల్పడినవారికి చలానాలు విధిస్తున్నారన్నారు. వాహనదారుల నుంచి ఈ చలానాల సొమ్ము 72% వసూలు చేసి ప్రకాశం జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. విజయనగరం, తూర్పుగోదావరి శ్రీకాకుళం జిల్లాలు 4 శాతం చొప్పున మాత్రమే వసూలు చేశాయన్నారు. పోలీసులు రహదారులపైకి వచ్చి తనిఖీలు చేయకపోతే మోటారు వాహన చట్టాలను ఉల్లంఘించేవారిని ప్రోత్సహించినట్లవుతుందని పేర్కొంది.



తెల్లజిల్లేడు, మారేడు, తులసీదళాలతో పుష్పార్చనలందుకుంటున్న దుర్గమ్మ

# వైభవంగా దుర్గమ్మకు పుష్పార్చన

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 3, ప్రభాత'వార్త'** అలంకార ప్రియురాలయిన దుర్గమ్మవారికి గురువారం తెల్లజిల్లేడు, మారేడు, తులసీదళాలతో ప్రత్యేక పుష్పార్చన నిర్వహించారు. వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ఇఓ కె రామచంద్ర మోహన్ పండితులతో కలిసి దుర్గమ్మవారికి నిర్వహించే పుష్పార్చనకు సంబంధించిన పుష్పాలను నూతనంగా నిర్మించిన పూజామండపంకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, మంత్రపఠనోచ్ఛారణల నడుమ తీసుకొచ్చారు. అక్కడ దుర్గమ్మ వారు పుష్పార్చనలందుకుని భక్తులను అనుగ్రహించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

- వేదోక్తంగా శ్రీ సుబ్రహ్మణ్య కళ్యాణం: దుర్గమ్మవారి ఆలయంలో చైత్రమాసం శుద్ధ షష్టి సందర్భంగా శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామివార్ల కళ్యాణోత్సవం వేదోక్తంగా నిర్వహించారు. దేవతలకు సర్వసైన్యాధిపతి అయిన సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. కళ్యాణ క్రతువు పూర్తయిన తరువాత ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు. దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను గురువారం లెక్కించగా రు.2,18,00,698లు లభించినట్లు ఇఓ కె రామచంద్ర మోహన్ తెలిపారు. 355గ్రాముల బంగారం, 6కెజిల 374 గ్రాముల వెండి కూడా భక్తులు కానుకలుగా దుర్గమ్మకు సమర్పించారన్నారు. ఇఓ తో పాటు డిప్యూటి ఇఓ ఎం రత్నరాజు, దేవదాయ శాఖాధికారులు, పోలీసులు, ఎస్‌పిఎఫ్, ఆలయాధికారులు ఈ లెక్కింపుల కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నియంత్రణలో ఎపి భేష్: న్యాకో తాజా నివేదికలో 7వ స్థానానికి చేరిన రాష్ట్రం

**విజయవాడ,ఏప్రిల్3,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో ఎయిడ్స్ నియంత్రణలో పనితీరు బాగా మెరుగుపర్చుకుని 7వ స్థానానికి చేరుకున్నట్లు ఏపీశాక్స్ వెల్లడించింది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణా సంస్థగతేడాది ఏప్రిల్- డిసెంబర్ మధ్య మెరుగైన పనితీరును కనబర్చడం ద్వారా 17వ ర్యాంక్ నుండి పైకి ఎగబాకిన ఏపీశాక్స్ ఈ కాలంలో ఎయిడ్స్ ను నియంత్రించడంలో ఏపీ కృషిని న్యాకోప్రశంసించింది. వివిధ ప్రమాణాల విషయంలో ఎపిశాక్స్ సాధించిన ఫలితాల్ని న్యాకోవెల్లడించింది. గతేడాది ఏప్రిల్, డిసెంబర్ మధ్యకాలంలో ఎపి శాక్స్ 90 శాతం నిధులను ఉపయోగించుకుంది ఖైదీల స్క్రీనింగ్‌ను మెరుగుపరచడంపై ఎపి శాక్స్ ఇప్పుడు దృష్టి సారించింది. 2004 నుండి ఏపీలో దాదాపు 2,25,000 మంది ఎయిడ్స్ బాధితుల్ని గుర్తించారుఎయిడ్స్ వ్యాధి నియంత్రణ కోసం 202425 సంవత్సరానికి గాను ఎపి శాక్స్ కు న్యాకో రూ.127 కోట్లు ఇచ్చింది ఎయిడ్స్ వ్యాధిని నియంత్రించడంలో మంచి పని తీరును కనబర్చినందుకు ఎపి శాక్స్ పీడీ డాక్టర్ ఎ.సిరిని, సిబ్బందిని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ అభినందించారు.

# ఎయిర్ ట్యాక్సీ తయారుచేసిన అభిరామ్‌కు సిఎం చంద్రబాబు అభినందన

**విజయవాడ, ఏప్రిల్ 3,ప్రభాతవార్తప్రతినిధి:**ఎయిర్ ట్యాక్సీ తయారుచేసిన అభిరామ్‌కు సీఎం చంద్రబాబు అభినంద అమరావతి, ఏప్రిల్ 03 : ముఖ్యమంత్రి చంద్రబాబును గుంటూరుకు చెందిన మ్యాగ్నమ్ వింగ్స్ సీఈఓ అభిరామ్ చావా కలిశారు. ఇటీవల తాను తయారుచేసిన ఎయిర్ ట్యాక్సీ గురించి సచివాలయంలో సీఎంను కలిసి వివరించారు. ఈ సందర్భంగా అభిరామ్‌ను సీఎం అభినందించారు. ఎయిర్ ట్యాక్సీ వివరాలు, సెక్యూరిటీ ఫీచర్స్, తయారీకి అయిన ఖర్చు వంటి వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రెండుసీట్ల సామర్థ్యంతో ఈ ఎయిర్ ట్యాక్సీని తయారు చేశానని అభిరామ్ అన్నారు. ఈ ప్రాజెక్టుకు సివిల్ ఏవియేషన్ అనుమతుల కొనసాగిస్తామన్ని అన్నారు.

# నేటితో ముగియనున్న ఎస్ఎస్‌సి పరీక్షలు

**13వ తేదీతో ముగియనున్న మూల్యాంకనం**

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా మార్చి 21 నుంచి ప్రారం భమైన ఎస్ఎస్‌సి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. నేటి(శుక్ర వారం)తో 10వ తరగతి వార్షిక పరీక్షలు ముగియనున్నాయి. ఈ నెల 2తో ప్రధాన పరీక్షలు ముగియగా.. ఒకేషనల్, ఓఎస్ఎస్‌సి పరీక్షలతో కలిపి నేటితో మొత్తం పరీక్షలు ముగియనున్నాయి. గురువరం జరిగిన ఒకేషనల్, ఓఎస్ఎస్‌సి పేపర్-1 పరీఓలకు 98.67 శాతం మంది విద్యార్థులు హాజర య్యారు. రాష్ట్రంలో ఎస్ఎస్‌సి పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2650 పరీక్షా కేంద్రాలనను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. ఈ నెల 2న జరిగిన సోషల్ స్టడిస్ పరీక్షతో 10వ తరగతికి చెందిన ప్రధాన పరీక్షలు ముగియగా.. ఈ నెల 3, 4 తేదిల్లో ఓఎస్ఎస్‌సి లాంగ్వేజెస్ పరీక్షలు జరగనున్నాయి. నేటితో మొత్తంగా ఎస్ఎస్‌సి పరీక్షలు ముగుస్తాయి. రాష్ట్రంలో మార్చి 21 నుంచి ప్రారం భమైన 10వ తరగత వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం మార్చి 26 నుంచి ప్రారంభమైంది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా లాంగ్వేజెస్ పరీక్షలు ముగియగానే జవాబు పత్రాల మూల్యాంకనాన్ని మార్చి 26నే ప్రారంభించారు. రాష్ట్రంలోని 19 సెంటర్లలో స్పాట్ వాల్యు యేషన్ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలకు 5.05 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఎస్ఎస్‌సి మూల్యాంకనాన్ని ఏప్రిల్ 13 వరకు ముగించాలని అధికారులు భావిస్తున్నారు. మూల్యాం కనం పూర్తయిన తరువాత.. ఏప్రిల్ నెలాఖరులోగానీ.. మే మొదటి వారంలోగానీ ఎస్ఎస్‌సి ఫలితాలను విడుదల చేయడానికి పాఠశాల విద్య శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.

# ఫ్లాట్‌లు కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సిందే

**సుప్రీంకోర్టు ఆదేశాలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 3:** హైదరాబాద్ నగరంలోని ఇందూ, రాంకీ, మంజీరా ప్రాజెక్టుల్లో ఫ్లాట్‌లు కొనుగోలు చేసినవారికి 4 వారాల్లో రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాల్సిందేనని తెలంగాణ హౌసింగ్ బోర్డుకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. గతంలో వై.ఎస్.కు సన్నిహితులైన వారి కంపెనీలతో హౌసింగ్ బోర్డు ఒప్పందాలను చేసుకుని విలువైన భూములను అప్పగించింది. ఒప్పందం ప్రకారం ప్రాజెక్టును పూర్తి చేసినటువంటి కంపెనీలు బోర్డుకు రావాల్సిన వాటా సొమ్ము చెల్లించకపోవడం వల్ల ఫ్లాట్ కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ చేయడానికి హౌసింగ్ బోర్డు నిరాకరించింది. ఫ్లాట్లు కొనుగోలు చేసినవారు 2 దశాబ్దాలుగా చేస్తున్న న్యాయపోరాటానికి అత్యున్నత న్యాయస్థానం తెరదించింది. ఇందూ ఈస్టర్న్ ప్రావిన్స్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కొనుగోలు చేసిన ఫ్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేసివ్వకపోవడాన్ని సవాలు చేస్తూ ఆర్.వేణుగోపాల్‌రెడ్డి అనే వ్యక్తితో పాటు మరొకరు గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన హైకోర్టు డెవలపర్ అయిన ఇందూ ప్రాజెక్ట్స్‌తో ఉన్న వివాదంతో అమాయకులైన కొనుగోలుదారులకు ఇబ్బందులు సృష్టించరాదని, వారికి ఫ్లాట్‌లను రిజిస్ట్రేషన్ చేయాలని, రూ.10 వేలు జరిమానా చెల్లించాలంటూ తీర్పు వెలువరించింది.

# దేశరాజధానిలో కాంగ్రెస్ బిసి నేతలు బిజీబిజీ

## కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి వీరేంద్రతో భేటీ

## పార్లమెంట్‌హాల్‌లో సోనియాతో సమావేశం

## రాహుల్‌కు జంతర్‌మంతర్ దీక్ష గురించి వివరించిన బిసి నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** తెలంగాణలో బిసి రిజర్వేషన్ 42శాతం పెంచే అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పొందుపరిచేందుకు కాంగ్రెస్ బిసి ప్రజా ప్రతినిధులు న్యూఢిల్లీలో తీవ్రకసరత్తుచేస్తూ గురువారం బిజీబిజీగా గడిపారు. పిసిసి ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద బుధవారం ఢిల్లీలో చేపట్టిన బిసి సంఘాల మహాధర్నాకు ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరు కాకపోయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతోపాటు బిసి మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇండియా కూటమికి చెందిన కనిమెళి వంటి పొరుగు రాష్ట్రాల నేతలు హాజరుకావడంతో మహాధర్నాకు ఆశించిన దానికంటే ఎక్కువ రాజకీయ మైలేజి వచ్చింది. తెలంగాణ బిసి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు మహాధర్నా సక్సెస్ ఉత్సాహంతో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ నేతృత్వంలో కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రి డా.వీరేంద్రకుమార్‌ను గురువారం ఉదయం కలిసి రాష్ట్రంలో శాస్త్రీయంగా కులగణన సర్వేచేపట్టిన తీరును, దానికి అనుగుణంగా 42శాతం బిసిలకు రిజర్వేషన్ పెంచుతున్నామని వివరించారు. తెలంగాణ శాసనసభలో బిజెపి ఎమ్మెల్యేలు కూడా బిసి రిజర్వేషన్‌కు మద్దతు ఇవ్వడంతో ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని కేంద్ర మంత్రికి టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సమావేశంలో పాల్గొన్న తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, కొండసురేఖ,విప్‌లు ఆదిశ్రీనివాస్,బీర్ల ఐలయ్యలు ఎంపి మల్లురవి కేంద్ర మంత్రితో మాట్లాడుతూ జాతీయపార్టీకి చెందిన బిజెపి ఎమ్మెల్యేలు శాసనసభలో బిల్లుకు మద్దతు తెలిపిన క్రమంలో పార్లమెంట్‌లో కూడా జాతీయ పార్టీ బిజెపి సహకరించి తొందరగా బిల్లు పాస్ చేస్తుందనే విశ్వాసంతో ఉన్నా మని దానిని ఆచరణలో పెట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంకు శాసనసభలో ఆమోదించిన బిల్లును పంపామని వారు తెలిపారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ సంతోషం వ్యక్తంచేశారు. పార్లమెంట్ హాల్‌లో కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీతో మంత్రులు పొన్నంప్రభాకర్, కొండసురేఖ, ఎంపిలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి బిసిడిక్లరేషన్ అమలుకు తెలంగాణలో చేస్తున్న కృషిని వివరించారు. తెలంగాణలో గత పదిహేను నెలలుగా ప్రజాస్వామిక పాలన కొనసాగిస్తూ గత ప్రభుత్వం చేసిన తప్పులు ప్రజలు ఎండగడుతూ ముందుకు పోతున్నామని వివరించారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత, ఎఐసిసి అగ్ర నేత రాహుల్‌గాంధీ వద్దకు చేరుకొని బిసి రిజర్వేషన్ 42 శాతానికి పెంచి తొమ్మిదవ షెడ్యూల్‌లో పొందు పరిచేలా చర్యలు తీసుకోవాలని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ కోరారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ నేతృత్వంలో లోక్‌సభ ప్రతిపక్షనేత ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీతో భేటీ అయిన తెలంగాణ బిసి మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, ఎంపి అనిల్‌యాదవ్, విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నాయకులు వివరించారు. తెలంగాణ కుల గణన చేపట్టి అసెంబ్లీలో బిల్లు పెట్టి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన విషయాలు తెలిపారు. ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బిసి సంఘాల దీక్ష తదితర అంశాలను పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం, కొండా సురేఖ తదితరులు వివరించగా ఆయన విన్నారు.

4-4P□g7exHMNWJQE.qxd:4-4P□g7exHMNWJQE.qxd 01/01/01 9:35 AM Page 1



## హెచ్‌సియు భూములపై సుప్రీంకోర్టు స్టేను స్వాగతిస్తున్నాం

### భూములను కార్పొరేట్ శక్తులకు అప్పగించొద్దు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీకి చెం దిన 400 ఎకరాల భూమి వ్యవహారంపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్టు సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. హెచ్‌సి యూకు చెందిన 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వేలం వేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలనే ప్రయత్నంలో భాగంగా బుల్డోజర్లతో అక్కడి చెట్లను తొలగించి, భూమిని చదునుచేసి, జంతువులకు తీవ్ర ఇబ్బంది కల్గించే చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. భూములను కారొపరేట్ సంస్థలకు ఇవ్వడాన్ని వ్యతిరేకించిన విద్యార్థులపై లాఠీఛార్జీ, అరెస్టులు, అక్రమ కేసులు పెట్టి, జైలుకు పంపిందన్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌సి యూ భూమిలో చెట్ల తొలగింపు, చదును చేయడం వెంటనే నిలిపి వేయాలని సుప్రీంకోర్టు స్టే విధించడాన్ని తమ పార్టీ స్వాగతిస్తుం దన్నారు. సుప్రీం కోర్టు స్టేను దృష్టిలో పెట్టుకుని ఈ భూములను వేలం వేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి చర్యలకు పూనుకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై విద్యార్థులు, మేధావులు, ప్రజా సంఘాలు, ప్రజలు తీవ్రఆగ్రహాన్ని వ్యక్తం చేస్తారని జాన్‌వెస్లీ హెచ్చరించారు.

## టిజి సెట్-2025లో 36,334 మందికి సీట్ల కేటాయింపు

### మరో 13,130 సీట్ల రిజల్ట్స్ దశలవారీగా విడుదల

### ఫలితాలను విడుదల చేసిన సెట్ కన్వీనర్

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన టిజి సెట్-2025లో 36,334 మందికి సీట్ల కేటాయింపు చేశారు. మరో 13,130 సీట్ల ఫలితాలను దశల వారీగా విడుదల చేయనున్నారు. టిసి సెట్-2025 ఫలితాలను సెట్ కన్వీనర్ విఎస్ అలుగు వర్షిణి గురువారం విడుదల చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, జనరల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 5వ తరగతిలో ప్రవేశాల కోసం ప్రతి ఏడాది టిజి సెట్‌ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా 5వ తరగతిలో ఫిబ్రవరి 23న రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారి ఫలితాలను టిజి సెట్-2025 చీఫ్ కన్వీనర్ డాక్టర్ విఎస్ అలుగు వర్షిణి విడుదల చేశారు. ప్రవేశ పరీక్ష రాసిన వారిలో 36,334 మంది ఎస్సి, ఎస్టీ, బిసి, ఓసి కేటగిరికి చెందిన విద్యార్థులు సీట్లు పొందినట్టు తెలిపారు. 5వ తరగతి ప్రవేశాలకు 89,246 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారిలో 84,672 మంది పరీక్షకు హాజరైనట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గురుకులాల్లో కలిపి 5వ తరగతిలో 51,406 సీట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. వాటిలో ఇప్పటికే ప్రత్యేక కేటగిరికి చెందిన 1944 మంది విద్యార్థుల ఫలితాలను వెల్లడించిన సంగతి తెలిసిందే. మిగిలిన కేటగిరీలకు చెందిన 13,130 సీట్ల ఫలితాలను దశల వారీగా విడుదల చేయనున్నట్టు అలుగు వర్షిణి ప్రకటనలో తెలిపారు.

## కొత్త బార్ల లైసెన్స్‌లకు దరఖాస్తులు ఆహ్వానం

### 26వ తేదీ ఆఖరి గడువు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** తెలంగాణలో గతంలో అనుమతి ఇచ్చినటువంటి 40 బార్లకు వివిధ కారణాలతో మూసివేయడంతో వీటి లైసెన్సులను కూడా ప్రభుత్వం రద్దు చేసింది. రద్దు చేసిన 40 బార్లను కు పునరుద్ధరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ చేవూరి హరికిరణ్ నోటిఫికేషన్ బార్ల పునరుద్ధరణ నోటిఫికేషన్లు విడుదల చేశారు. తెలంగాణలో ఆదిలాబాద్‌లో 5, కరీంనగరలో ఒకటి, వరంగల్‌లో 4, ఖమ్మంలో 2, నల్గొండలో 1, మహబూబ్‌నగర్‌లో 5, మెదక్‌లో1, నిజామాబాద్‌లో 4, రంగారెడ్డి జిల్లాలో రెండు బార్లను పునరుద్ధరించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే జిహెచ్ఎంసి పరిధిలో స్థానిక సంస్థల ఏమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో 15 దరఖాస్తులను తీసుకోవడం లేదు. తెలంగాణ రూరల్ జిల్లాల్లో 25 బార్లకు నోటిఫికేషన్లు ఇచ్చారు. మీర్‌పేట మున్సిపాల్టీలో పాత బార్ స్థానంలో కొత్త బారుకు నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు కోరుతున్నామని సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరిండెంట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుకు రూ. 1 లక్ష కాగా, బార్ లైసెన్స్ ఫీజు రూ.42 లక్షల ఉంటుందన్నారు. రంగారెడ్డి డివిజన్‌లో వికారాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ పరిధిలో సిఎం రేవంత్ రెడ్డి సొంత నియోజక వర్గం కొడంగల్ మున్సిపాల్టీలో ఉన్నటువంటి పాత బార్ స్థానంలో కొత్త బార్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ దశరథ్ తెలిపారు. దరఖాస్తు ధర రూ.1 లక్ష ఉంగా, సంవత్సరం ఫీజు రూ.30 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

# వచ్చే ఖరీఫ్ సీజన్‌కు లిఫ్టులు సిద్ధం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### రహదారుల వెడల్పుపై రాజీ ప్రసక్తేలేదు

### అగ్రికల్చరల్ వర్సిటీకి వంద ఎకరాలు స్థలాన్ని సేకరించాలని ఆదేశం

### నాణ్యతా ప్రమాణాలతో చెక్‌డ్యామ్‌లను నిర్మించాలి

### ఉన్నతాధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్

**హుజూర్‌నగర్ (గరిడేపల్లి), ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** ప్రజలకు ఉపయోగపడే శాశ్వత పనులను చేపడితే చరిత్రలో నిలిచిపోతామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి పేర్కొ న్నారు. హైదరాబాదులోని జల సౌధ లో హుజూర్‌నగర్ కోదాడ నియోజ కవర్గాల్లోని జరుగుతున్న అభివృద్ధి పనులపై గురువారం ఉన్నతాధికా రులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా ఇరిగేషన్, ఆర్ అండ్ బి, ఆర్టీసీ, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ హౌసింగ్ తదితర శాఖల ఉన్నతాధికారులతో మున్సిపాలిటీ అభివృద్ధి పనులు జరుగుతున్న తీరుపై ఆయన సుదీర్ఘం గా చర్చించారు. అభివృద్ధి పనులలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరిం చారు. పనుల పట్ల అశ్రద్ధ వహించే అధికారులు ఉంటే వారిని వెంటనే బదిలీ చేయాలని ఉన్నత అధికారులను ఆదేశించారు. హుజూర్నగర్ నియోజక వర్గంలోని కోదాడ నియోజకవర్గాల పరిధిలోని 8 ఎత్తిపోతల పథకాల పనులు పూర్తిచేసి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నాటికి అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్ నియోజ కవర్గంలోని ముక్త్యాల్ కెనాల్ బ్రాంచ్, జవహర్ జాన్ పహాడ్, బెట్టతండా,,నక్కగూడెం లిఫ్టపై కోదాడ నియోజకవర్గం లోని రాజీవ్ గాంధీ రెడ్లకుంట, ఉత్తమ్ పద్మావతి తో పాటు ఆర్9 లిఫ్ట్ ఇరిగేషన్ పనులు జరుగుతున్న తీరును అధికారులతో చర్చించారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలంటే ఈ మూడు నెలలే సరైన సమయమని అన్నారు. రైతులంతా పంటలన్నీ కోయడంతో భూములన్ని ఖాళీ ఉన్నాయని ఇప్పుడు పనులు చేయటానికి ఎలాంటి ఆటంకాలు ఉండవని అధికారులకు ఆయన సూచించారు. లిఫ్ట్ నిర్మాణం పనులు ఇప్పటికే చాలా ఆలస్యమైందని భూ సేకరణ పూర్తి కాకపోవడం వలన పనులు ఆలస్యమైతున్నాయని కాంట్రాక్టర్లు మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకువచ్చారు. లిఫ్ట్ లకు సంబంధించిన పైపులు వెళ్లే భూములలో ఎప్పుడో భూసేకరణ చేశామని కేవలం రైతులకు నష్టపరిహారం చెల్లించడమే ఉందని రైతులు మాత్రం పైప్ లైన్ వేసుకునేందుకు అనుమతిచ్చారని హుజూర్నగర్, కోదాడు ఆర్డీవోలు మంత్రికి వివరించారు పైప్ లైన్ వేసుకునేందుకు వారు ఎలాంటి అడ్డంకులు చెప్పరని పనులు ప్రారంభించవచ్చునని వారు తెలిపారు. శాశ్వతంగా నిలిచిపోయేలా లిఫ్ట్ చెక్ డ్యాం నిర్మాణాలు చేపట్టాలనీ.. గతంలో కట్టిన చెక్ డ్యాం లు కొట్టుకుపోయాయని అలా కాకుండా పటిష్ఠంగా చెక్ డ్యాములను ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. అలాగే కొన్ని ఎస్‌ఎస్పి కాలువ బ్రిడ్జ్ లు కూలిపోయే దశలో ఉన్నాయని వాటిని వెంటనే అవసరమైన ప్రతిపాదనలను తనకు అందిస్తే అనుమతులు మంజూరు చేస్తామన్నారు. పంచాయతీరాజ్ ఆర్!!బి రోడ్లన్నీ ఇరుకుగా ఉన్నాయని తెలిపారు . రోడ్ల వెంట ఉన్న రైతులు ఆక్రమించారని, రోడ్డు విస్తీర్ణం ఎంతవరకు ఉందో అంతవరకు రోడ్డు వేయాలని, రోడ్ల నిర్మాణాల విషయంలో రాజీ ప్రసక్తి లేదని అధికారులకు తేల్చి చెప్పారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలలో చెరువులను ఆక్రమించారని వాటిని వెంటనే గుర్తించి స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ను ఆదేశించారు. మేళ్లచెరువు ఎస్‌ఎస్పీ కాలు పై ఉన్న మూడు బ్రిడ్జిలు కూలిపోయే ప్రమాదం ఉందని వెంటనే వాటికి ఎస్టిమేషన్ వేసి పంపించాలని ఇరిగేషన్ ఈఈ ను మంత్రి ఆదేశించారు.

## రెండో ఏఎన్ఎంల పిఆర్‌సి బకాయిలను విడుదల చేయాలి

### నోటిఫికేషన్ 2(2023 పరీక్ష ఫలితాలను విడుదల చేయాలి

### డిహెచ్ కార్యాలయం ముందు 2వ ఏఎన్ఎంల ధర్నా

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలో 2వ ఏఎన్ఎంలకు ఇవ్వవలసిన 7 నెలల పిఆర్‌సి ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని, పోస్టుల సంఖ్యను పెంచి ఫలితాలను విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర సెకండ్ ఏఎన్ఎమ్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. గతంలో 2వ ఏఎన్ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కోఠిలోని డైరెక్టర్ హెల్త్ కార్యాలయం ముందు 2వ ఏఎన్ఎం యూనియన్ ధర్నా చేపట్టింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల సంఘం గౌరవ అధ్యక్షులు తోట రామాంజనేయులు, సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జక్కుల పద్మ, బోయిని శ్యామల, రాష్ట్ర కార్యదర్శులు తన్వీర్ సుల్తానా, పి జయమ్మ, ఎస్ సంధ్యా రాణి, ఉపాధ్యక్షులు కే. పద్మ, కృష్ణవేణి, పార్వతి, భారతి, కోశాధికారి రాజేశ్వరి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐటియూసి తెలంగాణ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ నందు పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం ఆగబోదని వెల్లడించారు. రెండవ ఏఎన్ఎంలు.. ఏఐటియుసి ఆధ్వర్యంలో చేసిన సమ్మె సమయంలో, ఆ తరువాత జరిగిన పోరాటాల సమయంలో వయసు రీత్యా పరీక్షకు అర్హత లేని వారిని 100 శాతం గ్రాస్ శాలరీతోపాటు 7 నెలల పిఆర్సి వేతన బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేశారు. అలాగే రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్, సబ్ సెంటర్ అదెబకాయిలు, ఏవిడి వ్యాక్సిన్ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఫిబ్రవరి 17న జరిగిన చర్చల్లో భాగంగా .. మార్చి 31వ తేదీ లోపు 7 నెలల పిఆర్‌సి బకాయిలు చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు నరసింహ గుర్తు చేశారు. 2020లో పిఆర్‌సి ప్రకటన చేస్తే .. 11 జూన్ 2021న పిఆర్‌సి అమల్లోకి వచ్చిందన్నారు. పిఆర్‌సి అమల్లోకి వచ్చిన 7 నెలల తర్వాత జీతాలు పెరిగాయని ఆయన గుర్తు చేశారు. ఆ తర్వాత జరిగిన పోరాటాల్లో పిఆర్‌సి బకాయిలను చెల్లిస్తామని చాలాసార్లు హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. 2వ ఏఎన్ఎంలతోపాటే పని చేస్తున్న ఈసీ ఏఎన్ఎంలకు 2023 సంవత్సరంలోనే పిఆర్‌సి బకాయిలు చెల్లించారని తెలిపారు. కానీ రెండవ ఏఎన్ఎంలకు ఇంతవరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఎంఎస్ఆర్‌బి వారు విడుదల చేసిన నోటిఫికేషన్ 2/2023 పరీక్ష ఫలితాలను వెంటనే విడుదల చేయాలని నరసింహ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ పోరాట ఫలితంగా 52 సంవత్సరాలు దాటిన వారికి కూడా పరీక్ష రాయటానికి అర్హత వచ్చిందని.. ఇప్పుడు ఫలితాలు వెలువడితే వారు ఐదు, ఆరు సంవత్సరాలు పాటు రెగ్యులర్ ఏఎన్ఎంలుగా విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుందన్నారు. కానీ ఫలితాలు విడుదల చేయకుండా ఆలస్యం చేస్తే తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. కావున అధికారులు సత్వరమే స్పందించి పరీక్ష ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తాము శాంతియుతంగా ధర్నా చేయడానికి వస్తుంటే .. ధర్నాకు రాకుండా పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల్లో వందలాది మందిని అడ్డుకున్నారని మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వంలో ఇటువంటి అరెస్టులు జరగవద్దని.. హక్కులు తెలియజెప్పడానికి పోరాటాలు చేయక తప్పదనే విషయాన్ని పోలీసులు గుర్తించాలన్నారు.

## స్పీడ్ పోస్టులో ఇంటి వద్దకే రాములోరి కల్యాణ తలంబ్రాలు, అక్షింతలు

**హైదరాబాద్, ఏపిల్ర్ 3, ప్రభాతవార్త :** దక్షిణ అయోధ్యగా పేరు పొందిన భద్రాద్రిలో ఈ నెల 6న శ్రీరామనవి సందర్భంగా జరగనున్న కళ్యోత్సవ ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి ఈ ఉత్సవాలను కన్నులార వీక్షించేందుకు, కళ్యానికి ఉపయోగించిన అక్షింతలను, తలంబ్రాలను భక్తులు తీసుకునేందుకు రాలేని భక్తుల కోసం దేవాదాయశాఖ సహాకారంతో పోస్టల్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా కళ్యాణోతనసవంలో ఉపయోగించే అక్షింతలను, తలంబ్రాలను భక్తులు పొందేందుకు పోస్టల్ డిపార్టు మెంట్ ఒక ప్రత్యేక సౌకర్యాన్ని కల్పిస్తోంది. అర్చన తలంబ్రాలు, అక్షింతలను సేవ ఆర్డర్‌లు బుక్ చేసుకునేందుకు అవకాశాన్ని తెలంగాణ పోస్టల్ శాఖ కల్పిస్తోంది. ఈ సేవలను పొందాలనుకునే భక్తులు సమీపంలోని పోస్టల్ శాఖను సంప్రదించాలని కోరింది. భక్తులకు భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం నుంచి ప్రసాదం, ముత్యాలు కళ్యాణ తలంబ్రాలను భక్తుల చిరునామాకు స్పీడ్ పోస్టు ద్వారా పంపిణీ చేస్తారు. అయితే భక్తులు ముత్యాల కళ్యాణ తలంబ్రాల కోసం రూ.150లను చెల్లించాల్సి ఉంటుందని, ఈ సదుపాయాన్ని ఉపయోగించుకునే భక్తులకు ఇంటి వద్దకే ముత్యాల తలంబ్రాలు, అక్షింతలు పోందవచ్చని పోస్టల్ శాఖ తెలిపింది.

## ప్రభుత్వం రూ.279 కోట్లు చెల్లించకపోవడంతో జాప్యం

### గుట్టకు ఎంఎంటిఎస్ రైలుపై

### ఎంపి చామల కిరణ్ ప్రశ్నకు కేంద్రం జవాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఘట్కేసర్ నుంచి యాదగిరిగుట్టకు ఎంఎంటిఎస్ రైతు మార్గం నిర్మాణానికి తనవంతు వాటా నిధులు రూ.279 కోట్లు చెల్లించకపోవడంలోనే జాప్యం జరుగుతోందని రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. లోకసభలో హైదరాబాద్ నుంచి యాదగిరి గుట్టకు ఎంఎంటిఎస్ ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తిచేస్తారని ఎంపి కిరణ్‌కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి అశ్విన్ వైష్ణవి సమాధానం చెప్పారు. 2016లోనే ఎంఎంటిఎస్‌పై తెలంగాణ ప్రభుత్వంతో కేంద్ర రైల్వేకు ఒప్పందం జరిగిందని 1:2నిష్పత్తిలో పనులు చేపట్టాలని నిర్ణయించి అదే యేడు నిధులు కూడా మంజూరు చేశామని తెలిపారు. చామలకిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రమే తన నిధులతో ఎంఎంటిఎస్ ఘట్కేసర్ నుంచి యాదగిరిగుట్టకు ప్రాజెక్టును పూర్తిచేయాలని సూచించారు.

## కలకలం రేపుతున్న బంగారం వ్యవహారం

### సౌదీ నుండి ఇండియాకు కిలో బంగారం అక్రమ రవాణా

### నిందితుల కోసం పోలీసుల గాలింపు




**చందుర్తి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** సౌదీ అరేబియా నుండి ఏ లాంటి అనుమతులు లేకుండా కిలో బంగారాన్ని అక్రమంగా నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల ద్వారా ఇండియాకు వారం రోజుల క్రితం పంపియగా బంగారం తీసుకొచ్చిన వ్యక్తుల సెల్ ఫోన్ లు కలవకపోవడంతో అట్టి వ్యక్తుల ఆచూకీ లభ్యం కాకపోవడంతో నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతూ బంగారం తీసుకొచ్చిన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు, విదేశాల నుండి సుంకం లేకుండా అక్రమంగా బంగారాన్ని తీసుకువచ్చి ఇక్కడ విక్రయించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు, జోగాపూర్ గ్రామానికి చెందిన బీరయ్య, అనిల్ అనే ఇద్దరు వ్యక్తులు ఈ బంగారాన్ని తీసుకువచ్చి ఎన్గల్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్వారా బంగారాన్ని మాయం చేసినట్లు చందుర్తి మండలం లో ప్రచారం జరుగుతుంది, సౌదీ నుండి బంగారం పంపిన వ్యక్తి ఇండియాలో బంగారాన్ని అప్పగించకపోవడం ఈ వ్యవహారం బయటపడింది, వేములవాడ పోలీస్ స్టేషన్ లో ఈ సంఘటన కేసు నమోదు కాగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టగా వారి ఆచూకీ లభ్య కాకపోవడంతో వారి బంధువులను ఆరా తీస్తున్నారు, బంగారం వ్యవహారం కేసుకు సంబంధించి చందుర్తి మండలానికి చెందిన కొంతమంది మాజీ ప్రజాప్రతినిదులు రాజీ కుదిరిచ్చేందుకు బెరసాలు కొనసాగిస్తున్నట్లు తెలిసింది, సౌదీ నుండి అక్రమ బంగారం ఎయిర్ పోర్టు నుండి ఎలా బయటకు వచ్చింది అనే కోణం నుండి విచారణ కొనసాగుతుంది, ఈ విషయమైన పోలీసులను వివరణ కోరగా సౌదీ నుండి అనధికారికంగా బంగారం వచ్చింది వాస్తవమేనని ఈ సంఘటనపై కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గ్యాప్-1 రాక్ఫిల్ డ్యామ్ పనులకు శ్రీకారం

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** పోలవరం ప్రాజెక్ట్ లో కీలకమైన గ్యాప్ 1 రాక్ఫిల్ డ్యామ్ పనులకు గురువారం శ్రీకారం చుట్టారు. జలవనరుల శాఖ, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ), మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) అధికారులు ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్యాప్ 1 రాక్ఫిల్ డ్యామ్ ను సుమారు 25 మీటర్ల ఎత్తుతో 540 మీటర్ల పొడవున నిర్మిస్తారు. ఈ సందర్భంగా జల వనరుల శాఖ, పీపీఏ అధికారులు, ఎంఏఐఅల్ ప్రతినిధులు మాట్లా డుతూ నిర్ణీత గడువులోగా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని విభాగాలు సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేసి ప్రాజెక్టును గడువులోగా పూర్తి చేయా లని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు సీఈ కే నరసింహమూర్తి, ఎస్ఈ రెడ్డి రామచంద్రరావు, ఈఈ కే బాలకృష్ణ, పీపీఏసీఈ రమేష్ కుమార్, ఎంఈఐఎల్ జాయింట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర, జీఎం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 2 నుంచి జూనియర్ కాలేజీలు ప్రారంభం

### దసరాకు 9 రోజులు, సంక్రాంతికి 8 రోజులు సెలవులు

### నవంబర్‌లో అర్ధవార్షిక పరీక్షలు.. జనవరిలో ప్రీఫైనల్

### 2025-26 అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించిన ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జూన్ 2 నుంచి జూనియర్ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. జూన్ 2 నుంచి 2025-26 విద్యా సంవత్సరాన్ని ప్రారంభించనున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో 226 పనిదినాలతో కొనసాగనున్నట్టు అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించారు. జూన్ 2 నుంచే ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం క్లాసులను ప్రారంభిం చనున్నట్టు అకడమిక్ క్యాలెండర్‌లో ప్రకటించారు. దసరా సెలవులను సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5 వరకు 9 రోజులు, సంక్రాంతి సెలవులను జనవరి 11 నుంచి 18 వరకు 8 రోజులపాటు ఇవ్వనున్నారు. నవంబర్ 10 నుంచి 15 వరకు అర్ధవార్షిక పరీక్షలను నిర్వహిం చనున్నట్టు తెలిపారు. ప్రీఫైనల్ పరీక్షలను జనవరి 19 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభించాలని.. వార్షిక పరీక్షలను మార్చి మొదటి వారంలో ప్రారంభించాలని నిర్ణయించినట్టు అకడమిక్ క్యాలెండర్‌లో ప్రకటించారు. 2026, మార్చి 31 2025-26 విద్యా సంవత్సరపు చివరి పనిదినంగా ప్రకటించారు. ఏప్రిల్ 1, 2026 నుంచి మే 31, 2026 వరకు వచ్చే ఏడాది వేసవి సెలవులుగా ప్రకటించారు. మొత్తంగా 226 పనిదినాలతో 2025-26 విద్యా సంవత్సరాన్ని అమలు చేయనున్నట్టు అకడమిక్ క్యాలెండర్‌లో పేర్కొన్నారు. జూన్‌లో 23, జులై 25, ఆగస్టు 22, సెప్టెంబర్ 22, అక్టోబర్ 21, నవంబర్ 23, డిసెంబర్ 24, జనవరి 19, ఫిబ్రవరి 24, మార్చి 23 రోజులు పనిదినాలతో మొత్తం 226 పనిదినాలు కొనసాగుతాయని ప్రకటించారు.



## జోయలుక్కాస్ ఆధ్వర్యంలో బ్రిలియన్స్ డైమండ్ జ్యుయెలరీ ప్రదర్శన

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :** జోయలుకాస్ ఆధ్వర్యంలో డైమండ్ జ్యూయల్లరీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు జోయ్ అలుకాస్ ఎండి, ఛైర్మన్ జోయ్ అలుక్కాస్ అన్నారు. గురువారం ఆయన పంజాగుట్టలోని జోయలుకాస్ షోరూంలో ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఈ నెల 20 వరకు ఉంటుందని తెలిపారు. పంజాగుట్టలోని షోరూంలో నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో అనేక రకాల డైమండ్ జ్యూయల్లరీలను ప్రదర్శించనన్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా అన్ కట్ డైమండ్స్, ప్రెషస్ జ్యూవలరీ యొక్క ప్రత్యేకమైన కలక్షన్‌ను ప్రదర్శిస్తామన్నారు. ఈ డైమండ్ జ్యూయల్లరీ ప్రదర్శనలో ప్రతి ఆభరణం ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. బ్రిలియెన్స్ డైమండ్ జ్యూవలరీ షోలో కలక్షన్ ప్రత్యేకంగా లభించేలా చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనను మొదటిగా వీక్షించి, ఈ కళాఖండాలను సొంతం చేసుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశమన్నారు. ఉత్తమమైన జ్యూయల్లరిని గొప్పగా ప్రకాశించే విధంగా నగరంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డైమండ్ జ్యూవలరీ పై సాటిలేని ఆఫర్లు అందిస్తున్నామన్నారు. రూ. 1 లక్ష మరియు అంతకంటే ఎక్కువ విలువైన డైమండ్ జ్యూవలరీని కొనుగోలు చేసిన కస్టమర్లు 1గ్రామ్ గోల్డ్ కాయిన్ ను ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ లో ప్రతి ఒక్కరి కోసం ఏదో ఒకటి ప్రత్యేకమైనది లభిస్తుందన్న ఆయన డైమండ్, ప్రెషస్ జ్యూయల్లరిలో ఉత్తమమైన వాటిని కనుగోనే ఈ సాటి లేని అవకాశాన్ని కోల్పోవద్దని విజ్ఞప్తి చేశారు.

## ప్రైవేటు జూ.కాలేజీల గుర్తింపునకు రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

### మే 4 వరకు అపరాధ రుసుం లేకుండా స్వీకరణ

### అపరాధ రుసుంతో జూన్ 6 వరకు..

### ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికిగానూ ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలకి తాత్కాలిక గుర్తింపు ఇవ్వడానికి రేపటి(శనివారం) నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. అపరాధ రుసుం లేకుండా మే 4 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య గురువారం జారీ చేశారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సుమారు 1500 వరకు ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు ప్రతి ఏడాది ఇంటర్ బోర్డు ద్వారా అనుబంధ గుర్తింపును పొందాల్సి ఉంటుంది. అందులో భాగంగా ప్రతిఏడాది ప్రైవేటు జూనియర్ కాలేజీల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించి ఆయా కాలేజీలకు అనుబంధ గుర్తింపును ఇంటర్ బోర్డు ఇస్తుంది. ఈ నేపథ్యంలోనే 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం జారీ చేసింది. కాలేజీలకు ఇంటర్ బోర్డు అనుబంధం గుర్తింపుతోపాటు అదనపు సెక్షన్ల కోసం అనుమతి పొందాల్సి ఉంటుంది. ప్రతి కాలేజీలో గరిష్ఠంగా నాలుగు సెక్షన్లకు అనుమతి ఉంటుంది.. అదనంగా మరో 5 సెక్షన్లకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంటుంది. కాలేజీలకు ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు ఇవ్వడానికి పలు సర్టిఫికెట్లను కాలేజీల యాజమాన్యాలు సమర్పించాల్సి ఉంటుంది. వాటిలో ప్రధానంగా భవన లీజు డీడ్, ఆట స్థలం(ప్లేగ్రౌండ్), అగ్నిమాపక భద్రతా ధృవీకరణ పత్రం(ఫైర్ ఎన్‌వోసీ), శానిటరీ సర్టిఫికేట్, స్ట్రక్చరల్ సౌండ్‌నెస్ సర్టిఫికేట్‌లను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు ప్రక్రియలో భాగంగా కళాశాల యాజమాన్యం బోధనా సిబ్బంది అర్హతలు, వారి వివరాలను కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జనరల్, ఒకేషనల్ జూనియర్ కాలేజీలకు అనుబంధం గుర్తింపు రుసుంతోపాటు తనిఖీ రుసుములను కూడా కాలేజీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది అనుబంధం గుర్తింపు, అదనపు సెక్షన్ల అనుమతి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి రేపటి(శనివారం,ఏప్రిల్ 5) అవకాశం కల్పించింది.

ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మే 4 వరకు అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. అపరాధ రుసుంతో జూన్ 8 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. అపరాధం రుసుం రూ. 1000తో మే 11 రూ. 5000తో మే 18 వరకు, రూ. 10వేలతో మే 25 వరకు, రూ. 15వేలతో జూన్ 1 వరకు.. అపరాధ రుసుం రూ. 20వేలతో జూన్ 8 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. కేవలం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను స్వీకరిస్తారని.. నేరుగా దరఖాస్తులను స్వీకరించరని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని ఒకే ప్రాంతంలోకి మార్చడం, సొసైటీ లేదా కళాశాల పేరులో మార్పులు.. (ఉదా., బాలికల నుండి కోఎడ్యుకేషన్‌కు) కోసం ప్రతిపాదనలతో దరఖాస్తు సమర్పించాలి. జూన్ 8 తర్వాత వచ్చిన అభ్యర్థనలను తిరస్కరించనున్నట్టు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తనిఖీలకు రూ. 65వేలు, అప్లియేషన్ ఫీజు రూ. 16000 కాగా మున్సిపాలిటీ పరిధిలో రూ. 50వేలు తనిఖీలకు, రూ. 14వేలు అప్లియేషన్‌కి, ఇక గ్రామీణ ప్రాంతాల్లో తనిఖీలకు రూ. 20వేలు, అప్లియేషన్లకు రూ. 5వేలు చెల్లించాల్సి ఉంటుంది. 4 కాలేజీల కంటే ఎక్కువ ఉన్న వారు, అదనపు సెక్షన్లు ఉన్నవారు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఒకేషనల్ కాలేజీలకు మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలో తనిఖీలకు రూ. 60వేలు, అప్లియేషన్‌కి రూ. 5వేలు, మున్సిపాలిటీ పరిధిలో రూ. 36వేలు తనిఖీలకు, రూ. 5వేలు అప్లియేషన్‌కి, గ్రామపంచాయతీల్లో తనిఖీలకు రూ. 16వేలుగానూ, అప్లియేషన్‌కి రూ. 5వేలుగా నిర్ణయించారు.

4-4pg10.qxd:4-4pg10.qxd 01/01/01 8:44 AM Page 1



ఆట

## వరల్డ్ బాక్సింగ్ కప్‌లో..
# సెమీస్‌కు జదుమణి



**న్యూఢిల్లీ:** భారత యువ బాక్సర్ జదుమణి సింగ్ ప్రపంచ బాక్సింగ్ కప్‌లో సెమీఫైనల్ చేరాడు. ప్రపంచ బాక్సింగ్ కప్-2025లో భాగంగా బ్రెజిల్‌లోని ఇగాకులో జరుగుతున్న టోర్నీలో భాగంగా పురుషుల 50 కిలోల విభాగంలో బరిలోకి దిగిన జదుమణి క్వార్టర్స్‌లో 3-2తో ఎల్లిస్ ట్రోబ్రిడ్జ్ (బ్రిటన్)ను చిత్తుచేశాడు. జదుమణి సెమీస్ చేరినా మరో ముగ్గురు భారత బాక్సర్లు ఆరంభ బౌట్‌లోనే వెనుదిరిగారు. నరేందర్ (90 కిలోలు), నిఖిల్ దూబే (75 కిలోలు), జుగ్నో (85 కిలోలు) నిరాశపరిచారు. 2024 ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్ రజత పతక విజేత ట్రోబ్రిడ్జ్ తన సాధారణ దూకుడు శైలిలోనే బౌట్‌ను ప్రారంభించాడు, కానీ భారత ఆటగాడు ఆ ఒత్తిడిని తట్టుకుని తన పంచ్‌లతో అదరగొట్టాడు. ఫైనల్‌లో స్థానం కోసం జదుమణి ఇప్పుడు మాజీ ఆసియా యు-22 ఛాంపియన్ అసిల్‌బెక్ జలిలోవ్‌తో తలపడనున్నాడు. కాగా భారత్‌కు చెందిన మరో ముగ్గురు బాక్సర్లు తమ తమ పోటీల్లో ఓడిపోవడంతో 75 కిలోలు, 85 కిలోలు మరియు 90+ కిలోల విభాగాలలో పరాజయం పాలయ్యారు. స్థానిక ఫేవరెట్ కౌ బెలిని చేతిలో భారత్‌కు చెందిన నిఖిల్ దూబే 75 కిలోల బౌట్‌లో 0-5 తేడాతో ఓడిపోయాడు, మంరో భారత్ బాక్సర్ జుగ్నో 85 కిలోల బౌట్‌లో ఫ్రాన్స్‌కు చెందిన అబ్దులయే ట్రోర్‌తో జరిగిన పోరులో 1-4 తేడాతోను, నరేందర్ (భారత్) కజకిస్తాన్‌కు చెందిన డానియల్ సపర్‌బేను ఓడించడానికి దగ్గరగా వచ్చినా కానీ 3-2 స్ప్లిట్ నిర్ణయంతో 90+ కిలోల బౌట్‌లో ఓడిపోయాడు.

## ఆర్సీబి ఓటమితో
# మారిన లెక్కలు
### టాప్‌లోకి దూసుకొచ్చిన పంజాబ్ కింగ్స్



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 18లో 15 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. చాలాటీమ్స్ మూడేసి మ్యాచ్‌లుఆడితే,ఓ రెండు టీమ్స్ రెండేసి మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాయి. అయితే గుజరాత్ టైటాన్స్ చేతిలో ఆర్సీబీ ఓటమితో పాయింట్ల పట్టికలో మార్పులు చోటు చేసుకున్నాయి. శ్రేయాస్ అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ కింగ్స్ ఆడిన రెండుమ్యాచ్‌ల్లోనూ విజయంసాధించింది. దీంతో పంజాబ్ కింగ్స్ 1.485 నికర రన్‌రేట్‌తో 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. అక్షర్ పటేల్ నాయకత్వంలో, ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు మొదటి రెండు మ్యాచ్‌ల్లో అద్భుతంగా రాణించింది. ఈ ప్రదర్శనతో, దీది జట్టు 1.320 నికర రన్ రేట్‌తో మొత్తం 4 పాయింట్లతో రెండవ స్థానాన్ని దక్కించుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మొదటి రెండు మ్యాచ్‌ల్లో గెలిచింది, కానీ మూడవ మ్యాచ్‌లో ఓడిపోయింది. దీనితో, వారు 1.149 నికర రన్ రేట్‌తో మొత్తం 4 పాయింట్లతో మూడవ స్థానానికి పడిపోయారు. ఇక తర్వాత స్థానాల్లో వరుసగా గుజరాత్, ముంబై, లక్నో, చెన్నై, హైదరాబాద్, రాజస్థాన్, కోల్‌కతా జట్లు ఉన్నాయి.

## మెనోర్కా ఓపెన్ ఎటిపి ఛాలెంజర్‌లో..
# భారత్ శుభారంభం

**న్యూఢిల్లీ:** మెనోర్కా ఓపెన్ ఏటీపీ ఛాలెంజర్-100 టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత్ ద్వయం శుభారంభం చేసింది. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా పురుషుల డబుల్స్ విభాగంలో భారత్ డేవిజ్ కప్ జట్టు సభ్యుడు మైనేని సాకేత్, తమిళనాడుకు చెందిన రామ్‌కుమార్ రామనాధన్‌తో కలిసి బరిలోకి దిగాడు. తొలి రౌండ్ మ్యాచ్‌లో సాకేత్-రామ్‌కుమార్ ద్వయం 6-1, 6-2తో అర్జెంటీన్‌కు చెందిన పెడ్రో కాచిన్-స్పెయిన్‌కు చెందిన ఇజాన్ కొరెత్యా జోడీపై విజయం సాధించి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 48 నిముషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో సాకేత్-రామ్‌కుమార్ నాలుగు ఏఎస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేశారు. తమ సర్వీస్‌లను నిలబెట్టుకుని, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు. కాగా ఇదే టోర్నమెంట్‌లో బరిలోకి దిగిన హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్ మాత్రం తొలి రౌండ్‌ను దాటలేకపోయాడు. గత వారం డేవిడ్



స్పెయిన్‌కు చెందిన వెగా హెర్నాండెజ్‌తో కలిసి జిరోనా ఓపెన్ ఏటీపీ ఛాలెంజర్‌స టోర్నీలో డబుల్స్ టైటిల్ నెగ్గిన అనిరుధ్ అదే ఫలితాన్ని పునరావృతం చేయలేకపోయాడు. తొలి రౌండ్‌లో అనిరుధ్ (భారత్)-హెర్నాండెజ్ ద్వయం 6-7 (4/7), 7-5, 5-10తో సూపర్ టైబ్రేక్‌లో మూడో సీడ్, డానియల్ కుకెర్మన్ (ఇజ్రాయెల్)-జోషువా పారిస్ (బ్రిటన్) జంట చేతిలో పోరాడి పరాజయం పాలైంది. రెండు గంటల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్ జంట తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. అయితే నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో మాత్రం అనిరుధ్ ద్వయం తడబడింది. ఇక భారత్‌కే చెందిన టాప్ సీడ్ జోడీ విజయ్ సుందర్ ప్రశాంత్, జీవన్ నెడుంజెళియన్ జోడీ 2-6, 0-6తో మాటియో-అంద్రియా (ఇటలీ) జంట చేతిలో ఓటమి పాలైంది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో నిక్కీ పునాచా (భారత్)-గోర్నెస్ (స్పెయిన్) ద్యం 6-3, 6-3తో వరోనా-టబెర్నర్ (స్పెయిన్) జంటపై గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది.



## ఐపిఎల్‌లో ఆర్సీబి, జిటి మ్యాచ్‌తో..
# మారిన పర్పుల్ క్యాప్ లిస్ట్
### టాప్‌లో 9 వికెట్లతో నూర్ అహ్మద్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, సీజన్ 18 అత్యంత ఉత్కంఠ భరితంగా కొనసాగుతోంది. వివిధ ఫ్రాంచైజీలకు చెందిన జట్లు పోటా పోటీగా తలపడుతూ ఆధిక్యాన్ని చూపించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా టీమ్‌ల్లోని ప్లేయర్లు తమ శక్తి వంచన లేకుండా కదం తొక్కుతున్నారు. బౌలర్లు ప్రత్యర్థి వికెట్లను పడగొట్టడంపైనే దృష్టిసారిస్తున్నారు. ఫలితంగా ప్రస్తుత ఐపీఎల్-2025లో పలువురు బౌలర్లు ధనాధన్ అంటూ ప్రత్యర్థి జట్ల వికెట్లను దక్కించుకుంటున్నారు. బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బెంగళూరు వర్సెస్ గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన మ్యాచ్ తర్వాత ఆర్ సాయి కిషోర్ ఐపీఎల్ 2025 పర్పుల్ క్యాప్ స్టాండింగ్స్‌లో నాల్గవ స్థానానికి చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఎడమచేతి వాటం స్పిన్నర్ సాయి కిషోర్ రెండు వికెట్లు పడగొట్టి ఖలీల్ అహ్మద్, శార్దూల్ ఠాకూర్‌లను అధిగమించాడు. ఆర్సీబీకి చెందిన జోష్ హాజిల్‌వుడ్ గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్ వికెట్ తీసి మూడో స్థానానికి చేరుకున్నాడు. అలాగే గౌహతిలో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్ నూర్ అహ్మద్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. నూర్ తన నాలుగు ఓవర్లలో రెండు వికెట్లు పడగొట్టి ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన మిచెల్ స్టార్క్‌ను వెనక్కి నెట్టి జాబితాలో ఫస్ట్ ప్లేస్‌కు చేరుకున్నాడు. ఈ విధంగా ప్రస్తుత ఐపీఎల్‌లో ఇప్పటి వరకూ జరిగిన మ్యాచ్‌ల్లో అత్యధిక వికెట్లు దక్కించుకున్న టాప్ 5 బౌలర్ల జాబితాలో అగ్ర స్థానంలో చెన్నై సూపర్ కింగ్స్ (సిఎస్కే) ప్లేయర్ నూర్ అహ్మద్ ఉన్నాడు. అతడు 3 మ్యాచ్‌ల్లో 9 వికెట్లు పడగొట్టి 6.83 ఎకానమీ రేటుతో సగటు 9.11గా ఉన్నాడు. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెందిన మిచెల్ స్టార్క్ 2 మ్యాచ్‌ల్లో 8 వికెట్లు,10.04 ఎకానమి, 9.62సగటుతో రెండోస్థానంలోను, రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు తరపున ఆడిన జోష్ హాజిల్‌వుడ్ 3 మ్యాచ్‌ల్లో 6వికెట్లు తీసి 6.00 ఎకానమి, 11 సగటుతో మూడో స్థానంలోనూ, గుజరాత్ టైటాన్స్ జట్టు ప్లేయర్ ఆర్ సాయి కిషోర్ 3 మ్యాచ్‌ల్లో 6 వికెట్లు పడగొట్టి 7.41 ఎకానమీ, 14.83 సగటుతో నాల్గవ స్థానంలోను, చెన్నై సూపర్ కింగ్ జట్టు నుండి ఖలీల్ అహ్మద్ 3 మ్యాచ్‌లు ఆడగా, వాటిల్లో 6 వికెట్లు పడగొట్టి 7.91 ఎకానమి, 15.83 సగటుతో ఐదవ స్థానంలో ఉన్నాడు.

# వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో పోరు
### స్వదేశంలో టీమిండియా రెండు సిరీస్‌లు ఖరారు



**ఢిల్లీ:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 2025 సంవత్సరానికి సంబంధించి స్వదేశంలో టీమిండియా షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఏడాది భారత జట్టు స్వదేశంలో రెండు సిరీస్‌లు ఆడనుంది. ఇందులో వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో తలపడనుంది. ఈ రెండు భారత సిరీస్‌లు అక్టోబర్, డిసెంబర్ మధ్య జరుగుతాయి. ఇందులో టెస్ట్, వన్డే, టీ 20 ఫార్మాట్లలో మొత్తం 12 మ్యాచ్‌లు జరుగుతాయి. అక్టోబర్‌లో వెస్టిండీస్‌తో టీం ఇండియా మొదట రెండు టెస్టులు ఆడుతుందని బీసీసీఐ తెలిపింది. ఆ తర్వాత, నవంబర్, డిసెంబర్‌లో దక్షిణాఫ్రికాతో రెండు టెస్టులు, మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఉంటాయి. అక్టోబర్ 2 నుంచి వెస్టిండీస్‌తో అహ్మదాబాద్‌లో టెస్ట్ సిరీస్ మొదటి మ్యాచ్ జరుగుతుంది. సిరీస్‌లోని రెండవ, చివరి టెస్ట్ అక్టోబర్ 10 నుంచి కోల్‌కతాలో జరగనుంది. వెస్టిండీస్ సిరీస్ తర్వాత టీమిండియా దక్షిణాఫ్రికాను స్వదేశంలో ఎదుర్కోవలసి ఉంటుంది. ప్రోటీస్ జట్టు భారత పర్యటన నవంబర్ 14 నుంచి ప్రారంభమవుతుంది. ముందుగా రెండు టెస్టుల సిరీస్ ఉంటుంది. మొదటి మ్యాచ్ నవంబర్ 14 నుంచి ఢిల్లీలో జరుగుతుంది. రెండవ, చివరి టెస్ట్ నవంబర్ 22న గౌహతిలో ప్రారంభమవుతుంది. గౌహతి తొలిసారిగా టెస్ట్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య వన్డే సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఉంటాయి. ఈ సిరీస్ నవంబర్ 30న రాంచీలో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత డిసెంబర్ 3న రాయ్‌పూర్‌లో రెండో వన్డే, డిసెంబర్ 6న వైజాగ్‌లో మూడో వన్డే జరుగుతాయి. ఐదు మ్యాచ్‌ల భారత్-దక్షిణాఫ్రికా టీ20 సిరీస్ డిసెంబర్ 9న కటక్‌లో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత డిసెంబర్ 11న న్యూ చండీగఢ్‌లో రెండో టీ20, డిసెంబర్ 14న ధర్మశాలలో మూడో టీ20, డిసెంబర్ 17న లక్నోలో నాలుగో టీ20, డిసెంబర్ 19న అహ్మదాబాద్‌లో ఐదవ, చివరి

# ట్రంప్ టారిఫ్‌తో భారత్‌లో ఈ రంగాలపై ఎఫెక్ట్

## ఔషధాలపై టారిఫ్ మినహాయింపు

**ముంబై, ఏప్రిల్ 3:** భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు ప్రకటించారు. అయితే వీటిలో ఔషధ ఉత్పత్తులకు మినహాయింపు లభించింది. ఔషధాలపై పరస్పర సుంకాలను యూఎస్ మినహాయించిందని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపిఎ) సెక్రటరీ సుదర్శన్ జైన్ తెలిపారు. దీంతో దేశీయ ఔషధ రంగ సంస్థలకు కాస్త ఉపశమనం లభించింది. ఫలితంగా ఆయా రంగ షేర్లు గురువారం రాణిస్తున్నాయి. అమెరికాకు దిగుమతి చేసే అన్ని ఔషధాలపై పరస్పర సుంకాల నుంచి మినహాయింపు లభించింది. ఇలా పరస్పర సుంకాలకు లోబడి ఉండని వాటి జాబితాలో రాగి, ఔషధాలు, సెమీకండక్టర్లు, కలప వస్తువులు ఉన్నాయి. భారత్ అమెరికాకు చేసే ఔషధ ఎగుమతులు ఎక్కువగా జనరిక్ మందులే ఉన్నాయని నిపుణులు పేర్కొన్నారు. ఒకవేళ సుంకాలు పెంచితే యూఎస్ పౌరులపైనే ఈ భారం పడనుంది. అందుచేతనే వీటినుంచి మినహాయింపు లభించినట్లు తెలుస్తోంది. జనరిక్ ఔషధాలపై



టారిఫ్‌లు విధిస్తారనే భయాలతో గత ఆరు నెలల్లో ఫార్మా ఇండెక్స్ దాదాపు 10 శాతం కుంగింది. పన్ను మినహాయింపు ప్రకటనతో నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ ఏకంగా 4.4 శాతం పెరిగింది. ప్రధాన ఫార్మా షేర్లు రాణిస్తున్నాయి. గ్లాండ్ ఫార్మా షేర్లు 4 శాతం, అరబిందో ఫార్మా 2.79 శాతం, డాక్టర్ రెడ్డీస్ షేర్లు 2.11 శాతం లాభంతో ట్రేడవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా విధించిన అమెరికన్ ఉత్పత్తులపై అధిక సుంకా లను ఎదుర్కోవడానికి ట్రంప్ సుమారు 60 దేశాలపై పరస్పర సుంకాలను ప్రకటించారు. అమెరికా వస్తువులపై అధిక దిగుమతి సుంకాలను విధిస్తుందని చెబుతూ భారత్‌పై 26 శాతం పరస్పర సుంకాలు ప్రకటించిన విషయం తెలిసిందే.

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:** అంచనాలను మించి భారత్‌పై టారిఫ్‌ల బాంబు వేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. న్యూఢిల్లీ తమకు వాణిజ్య భాగస్వామి అని చెబుతూనే సుంకాల మోత మోగించారు. అమెరికా ఉత్పత్తులపై ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌లతో పోలిస్తే, తాము సగం మేర మాత్రమే వసూలు చేయనున్నట్లు తెలిపారు. భారత్ తమ ఉత్పత్తులపై సగటున 52శాతం సుంకం విధిస్తున్నందున, తాము 26శాతం సుంకం విధిస్తున్నట్లు వెల్లడించారు. అయితే, ట్రంప్ నిర్ణయంతో మన దేశంలోకి కొన్ని రంగాలపై కీలక ప్రభావం పడనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ విశ్లేషణ ప్రకారం, ట్రంప్ టారిఫ్‌ల వల్ల వ్యవసాయ రంగ సంబంధిత ఎగుమ తులపై అత్యధిక ప్రభావం ఉండనున్న ట్లు తెలుస్తోంది. భారత రొయ్యలు, ఇతర సీఫుడ్ ఉత్పత్తులకు యూఎస్ ప్రధాన దిగుమతిదారుగా ఉంది. 2024లో అమెరికాకు చేపలు, ఇతర ప్రాసెస్డ్ సీఫుడ్ ఎగుమతుల విలువ 2.58 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇప్పుడు తాజా సుంకాల వల్ల అగ్రరాజ్య మార్కెట్లో వీటి ధరలు పెరుగుతాయి. దీంతో గిరాకీ ఆశించిన మేర ఉండకపోవచ్చని నిపుణుల అభిప్రాయం. రంగాల వారీగా ఉత్పత్తులపై సుంకాలు భిన్నంగా ఉంటాయి. ట్రంప్ తాజా నిర్ణయంతో మన డెయిరీ



ఉత్పత్తులపై టారిఫ్‌లు 38.23 శాతానికి చేరనున్నాయి. దీంతో అగ్రరాజ్యంలో మన వెన్న, నెయ్యి, పాలపొడి ధరలు కూడా పెరుగుతాయి. భారత్ నుంచి అమెరికాకు 181.49 మిలియన్ డాలర్ల డెయిరీ ఎగుమతులు జరుగుతున్నాయి. దీంతో పాటు ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెర, కోకో ఎగుమతులపై ప్రభావం పడనుంది. భారత్ నుంచి ఏటా 11.88 బిలియన్ డాలర్ల విలువైన బంగారం, వెండి, వజ్రాభరణాలు అగ్రరాజ్యానికి ఎగుమతి అవుతున్నాయి. తాజా పెంపుతో వీటిపై సుంకం 13.32శాతానికి చేరనుంది. దీంతో అమెరికాలో ఆభరణాల ధరలు పెరగనున్నాయి. ఇక, జౌళి పరిశ్రమ పైనా అధిక ప్రభావమే పడనుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి 9.6 బిలియన్ డాలర్ల విలువైన దుస్తులు, ఇతర టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్స్ ఎగుమతి అవుతున్నాయి. పాదరక్షల పరిశ్రమ పైనా సుంకాల ప్రభావం ఉండనుంది. మన దేశం నుంచి 457.66 మిలియన్ డాలర్ల విలువైన ఫుట్‌వేర్ ఉత్పత్తులు యూఎస్‌కు ఎగమతి అవుతున్నాయి. వీటిపై అమెరికా-భారత్ మధ్య సుంకాల వ్యత్యాసం 15.56 శాతంగా ఉంది. దీంతో అగ్రరాజ్య మార్కెట్లో మన చెప్పుల ధరలు మరింత ప్రియం కానున్నాయి. ఎలక్ట్రానిక్స్, టెలికాం రంగాన్ని చూస్తే.. 2024లో 14.39 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యాయి. ఇప్పుడు సుంకాల పెంపుతో యూఎస్ మార్కెట్‌లో భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి.

## పిపిఎఫ్‌లో నామినీ మార్పునకు ఛార్జీలుండవ్: ఆర్థిక మంత్రి





**ముంబై, ఏప్రిల్ 3:** చిన్న మొత్తాల పొదుపు పథకం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తాజాగా ఓ నోటిఫికేషన్ ఇచ్చింది. పిపిఎఫ్‌లో నామినీ మార్పునకు ఇకపై ఛార్జీలుండవని అందులో పేర్కొంది. పిపిఎఫ్ ఖాతాలకు సంబంధించి నామినీ వివరాలను మార్చుకోవడానికి ఆర్థిక సంస్థలు రుసుము వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆ ఛార్జీలను తొలగించేందుకు జీవో తీసుకువచ్చాం. ఇటీవల ఆమోదం పొందిన బ్యాంకింగ్ సవరణ బిల్లు ప్రకారం, నలుగురు నామినీలను చేర్చుకునేందుకు వీలు ఉంది అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పోస్ట్ పెట్టారు.

## ఇకపై ఇపిఎఫ్ విత్‌డ్రా సులువు..

**ముంబై, ఏప్రిల్ 3:** ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ) ఆన్‌లైన్‌లో నగదు ఉపసంహరణను మరింత సులభతరం చేసింది. ఇకపై ఆన్‌లైన్‌లో డబ్బును విత్‌డ్రా చేసుకోవాలంటే క్యాన్సిల్ చేసిన చెక్కు అప్‌లోడ్ చేసే అవసరాన్ని తప్పించింది. దీంతో పాటు బ్యాంక్ ఖాతాను యజమానులు ధ్రువీకరించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఈ ఫాస్ట్ ట్రాక్ క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియతో దాదాపు ఎనిమిది కోట్ల మందికి ప్రయోజనం చేకూరనుంది. ఈ మేరకు కార్మిక మంత్రిత్వ శాఖ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతాలో నిధులు ఉపసంహరణ కోసం






ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలంటే యూఏఎన్, పీఎఫ్ నంబర్‌తో లింక్ చేసిన బ్యాంక్ పాస్ బుక్‌కు సంబంధించిన చెక్కు ఫొటోను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత దరఖాస్తుదారుని బ్యాంక్‌ఖాతా వివరాలు కూడా యజమానులు ఆమోదించాల్సి ఉంటుంది. అంటే ఈ రెండంచెల వెరిఫికేషన్ పూర్తయిన తర్వాతే నగదు చేతికందేది. ఈ అవసరాన్ని ఈపీఎఫ్‌వో పూర్తిగా తొలగించినట్లు కార్మిక మంత్రిత్వ శాఖ తెలిపింది. క్లెయిమ్ సెటిల్‌మెంట్ ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు క్లెయిమ్ తిరస్కరణల్ని తగ్గించేందుకు ఈ చర్యలు సాయపడతాయని పేర్కొంది. వాస్తవానికి కేవైసీ అప్‌డేట్ చేసిన సభ్యులకు ఈ నిబంధనను పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఇది వరకే తొలగించారు. 2024 మే 28న పైలట్ విధానాన్ని లాంచ్ చేశారు. దీనివల్ల సుమారు 1.7 కోట్ల చందాదారులు లబ్ధి పొందారని కార్మిక శాఖ తెలిపింది. ఇది విజయవంతం కావడంతో సభ్యులందరికీ ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొంది. యూఏఎన్‌తో బ్యాంక్ అకౌంట్‌ను అనుసంధానం చేసే క్రమంలో వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుంది కాబట్టి, ఈపీఎఫ్‌వో ఈ అదనపు భారాన్ని తొలగించింది. కొన్నిసార్లు క్వాలిటీ లేని ఇమేజులు అప్‌లోడ్ అవ్వడం వల్ల క్లెయిమ్‌లు రిజెక్ట్ అవుతున్న ఉదంతాలూ దృష్టికి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతోపాటు యూఏఎన్‌తో అనుసంధానం అయిన బ్యాంక్ ఖాతాను మార్చుకోవాలన్నా ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎంటర్ చేసి ఆధార్ ఓటీపీతో సులువుగా అథంటికేషన్ పూర్తి చేయొచ్చని కార్మిక మంత్రిత్వ శాఖ తెలిపింది.

## ఎఐని అందిపుచ్చుకోవడంలో ప్రపంచాన్ని దాటేస్తోన్న భారత్ : ఓపెన్ ఎఐ సిఇఒ

**వాషింగ్టన్, ఏప్రిల్ 3:** ఓపెన్‌ఎఐకి చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ యూజర్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొత్త మోడళ్లు, అద్భుతమైన ఫీచర్లతో ముందుకొస్తుండంతో పెద్దఎత్తున వినియోగదారులు ఈ సేవల్ని పొందుతున్నారు. కృత్రిమ మేధ (ఎఐ) సాంకేతికతను భారత్ వేగంగా అందిపుచ్చుకోవడంపై కంపెనీ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. భారత్ పురోగతిని ప్రశంసిస్తూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ పెట్టారు. సృజనాత్మకత, ఎఐ సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ప్రపంచంతో పోలిస్తే భారత్ అత్యధిక వేగం కనబరుస్తోందని ఆల్ట్‌మన్ వ్యాఖ్యానించారు. ఎఐని అందిపుచ్చుకోవడంలో భారత్ ప్రపంచాన్ని దాటేస్తోందన్నారు. ఇది చూడటానికి చాలా అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. చాట్‌జీపీటీ ఇమేజ్ జనరేషన్ టూల్ జీబ్లీకి ఆదరణ పెరిగిన నేపథ్యంలో ఆల్ట్‌మన్ నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. 26 నెలల క్రితం తాను చాట్‌జీపీటీ ప్రారంభించినప్పుడు అద్భుతమైన స్పందన వచ్చిందని ఆల్ట్‌మన్ తాజాగా పేర్కొన్నారు. ఐదు




రోజుల్లోనే ఒక మిలియన్ మంది యూజర్లు చేరినట్లు గుర్తు చేశారు. అయితే, తాజాగా జీబ్లీ ఫిల్టర్ అందుబాటులోకి వచ్చిన తర్వాత కేవలం ఒక గంట వ్యవధిలోనే 10 లక్షల మంది కొత్త యూజర్లు చాట్‌జీపీటీకి యాడ్ అయినట్లు ఆయన వెల్లడించారు.

# వాణిజ్యం

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఏప్రిల్ 3:** ట్రంప్ టారిఫ్ భయాలతో ఇన్నాళ్లూ చిగురుటాకులా వణికిన సూచీలు, అధికారిక ప్రకటన తర్వాత మోస్తరు నష్టాలతో బయటపడ్డాయి. చైనా, జపాన్ మార్కెట్లు భారీ నష్టాల్లో ముగియగా, దేశీయ సూచీలపై ఆ స్థాయిలో ప్రభావం పడలేదు. ఐటి, ఆటో స్టాక్స్‌లో అమ్మకాలు ఒత్తిడి కనిపించింది. ప్రతీకార సుంకాల నుంచి ఫార్మా ఉత్పత్తులను మినహాయించడంతో ఆ రంగం స్టాక్స్ రాణించాయి. ట్రంప్ సుంకాల ప్రకటన అనంతరం అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో గురువారం ఉదయం సూచీలు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ 75,811.86 పాయింట్ల వద్ద



ప్రారంభమై, ఆరంభంలోనే 75,807.55 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. ఆ తర్వాత మోస్తరు నష్టాల్లోనే చలించింది. చివరికి 322 పాయింట్ల నష్టంతో 76,295.36 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 82.25 పాయింట్ల నష్టంతో 23,250.10 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ 22 పైసలు పెరిగి రూ.85.30గా ఉంది. టిసిఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టాటా మోటార్స్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టిపిసి, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 71.69 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3135 డాలర్ల వద్ద ట్రేడయింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps